

'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 347


గురువారం 9-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చివరి పంచ్ ఎవరిదో!

అహ్మదాబాద్‌లో నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య నాలుగో టెస్ట్ -12లో



కనిష్టాల వద్ద కొనుగోళ్లు

స్టాక్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల బాట నడిచాయి -13లో



ఆస్ట్రేలియాతో మెరుగైన స్నేహబంధం

భారత్–ఆసీస్ మధ్య బలీయ స్నేహబంధం కోసం ఎదురుచూస్తున్నట్టు ఆసీస్ ప్రధాని అల్బనీస్‌ను ఉద్దేశిస్తూ మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



త్రిపుర సీఎంగా మాణిక్ సాహా

త్రిపుర ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి బీజేపీ నేత మాణిక్ సాహా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు.

వివరాలు 6లో ▸



దేశం కోసం కేజ్రీవాల్ ధ్యానం

దేశాభ్యున్నతి కోసం ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బుధవారం రోజంతా ధ్యానం, పూజలు, ప్రార్థనలు చేశారు.

వివరాలు 6లో ▸



మళ్లీ కశ్మీర్‌పై పాక్ ఏడుపు

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో కశ్మీర్ అంశాన్ని లేవదీసిన పాకిస్తాన్‌పై భారత్ ఘాటుగా స్పందించింది.

వివరాలు 6లో ▸

కవితకు నోటీసులు

నేడు విచారణకు రావాలన్న ఈడీ.. 11న వస్తానన్న ఎమ్మెల్సీ

- ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి గురువారం విచారణకు హాజరు కావాలని ఈడీ నోటీసులు
- ముందే ఖరారైన కార్యక్రమాల కారణంగా గురువారం రాలేనన్న కవిత
- 11న హాజరవుతానని స్పష్టీకరణ.. ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ
- రాజకీయ కక్షతోనే ఇదంతా చేస్తున్నట్టుగా అన్పిస్తోందని విమర్శ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించకుండా కార్యాలయానికి పిలవడమేంటని నిలదీత
- దర్యాప్తునకు సహకరిస్తానని ఉదయం విడుదల చేసిన లేఖలో స్పష్టీకరణ
- మహిళా రిజర్వేషన్ల కోసం శుక్రవారం దీక్ష చేసేందుకు హస్తినకు రాక
- అంతకుముందు సీఎం కేసీఆర్‌కు కవిత ఫోన్
- ఆందోళన అవసరం లేదన్న ముఖ్యమంత్రి
- బీజేపీ అకృత్యాలను న్యాయపరంగా ఎదుర్కొందామంటూ భరోసా
- తాజా పరిణామాలతో రాష్ట్రంలో రాజకీయ దుమారం
- భయపడే ప్రసక్తే లేదన్న బీఆర్‌ఎస్ మంత్రులు, నాయకులు
- తెలంగాణ తలదించుకునేలా చేశారన్న బీజేపీ నాయకులు
- రేపు తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కీలక సమావేశం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం నోటీసులు జారీ చేసింది. గురువారం ఢిల్లీలో విచారణకు హాజరుకావాల్సిందిగా పేర్కొంది. అయితే ముందే ఖరారైన కార్యక్రమాల కారణంగా 9న విచారణకు హాజరు కాలేనని కవిత ఈడీ అధికారులకు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద.. 'పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలి' అనే డిమాండ్‌తో దీక్ష నిర్వహించనున్న దృష్ట్యా విచారణ వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11వ తేదీన హాజరవుతానని తెలిపారు. ముందస్తు అపాయింట్‌మెంట్లు, ఇతర కార్యక్రమాలు ఉన్నందున 9న విచారణకు

మిగతా 2వ పేజీలో ▶



శుక్రవారం నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు బుధవారం ఢిల్లీ చేరుకున్న కవిత

తెలంగాణ తల వంచదు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న సీఎం కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని ఇలాంటి చర్యలతో లొంగదీసుకోవడం కుదరదు. తెలంగాణ తలవంచదని బీజేపీ తెలుసుకోవాలి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీజేపీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం.

\- కవిత, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ

నేడు కీలక కేబినెట్

గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక

బిల్లుల పెండింగ్ అంశంపై చర్చించనున్న మంత్రివర్గం

కవితకు ఈడీ నోటీసులపైనా చర్చించే అవకాశం

సాక్షి, హైదరాబాద్



ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రగతిభవన్‌లో జరగనుంది. సమావేశంలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాల్సిన ఇద్దరిని ఖరారు చేయడంతోపాటు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న కీలక బిల్లులపైనా చర్చించనున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నోటీసులు జారీచేసిన అంశంపైనా భేటీలో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈడీ విచారణ సందర్భంగా ఒకవేళ కవితను అరెస్టుచేస్తే ఎలా స్పందించాలన్న విషయమై సమావేశంలో ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. కేంద్రం రాష్ట్రంపై వ్యవహరిస్తున్న కక్షసాధింపు చర్యలపై మున్ముందు ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపైనా చర్చ జరగనుంది.

పలు అంశాలపై నిర్ణయాలు

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, స్థలాలున్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల చొప్పున నిధుల మంజూరుపై నిర్ణయం, మూడు పారిశ్రామికవాడల్లోని భూముల క్రమబద్ధీకరణ అంశాలపై కేబినెట్ చర్చించనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో అమలవుతున్న కంటివెలుగు కార్యక్రమం, మంగళవారం ప్రారంభమైన 'మహిళా ఆరోగ్య'కార్యక్రమాలను కూడా సమీక్షించే అవకాశం ఉంది.

నేడు నామినేషన్ల దాఖలు

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నవీన్‌కుమార్, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామిరెడ్డి గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. వారి వెంట మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెళ్లనున్నారు. కాగా, గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

కేంద్రం దుర్మార్గాలకు పరాకాష్ట

రాష్ట్ర మంత్రుల ధ్వజం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ నోటీసులు జారీ చేయడాన్ని మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిషాంక్ తదితరులు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలకు పరాకాష్ట అని, బీజేపీ అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ఢిల్లీలో ఆప్, ఇక్కడ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే కుట్రలో భాగమే ఇదని, కేసీఆర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకే ఈ ప్రయత్నాలని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ, ఐటీ కేంద్రం చేతులో కీలుబొమ్మలుగా మారాయని అన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే కవితను టార్గెట్ చేశారని, సీఎం కేసీఆర్ ఎవరికీ తలవంచే రకం కాదని వారు స్పష్టం చేశారు.



- వివరాలు 2లో ▶

లిక్కర్‌స్కామ్ దోషులను మోదీ వదిలిపెట్టరు

- దొంగ దందాతో తెలంగాణ మహిళలు తలదించుకునే పరిస్థితి ఏర్పడింది: బండి



- వివరాలు 2లో ▶

సీబీఐ, ఈడీతో కేంద్రానికేమి సంబంధం?

- తెలంగాణ అంటే మీరు, మీ కుటుంబమేనా..?
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మహిళల కోసం 'సింగిల్ విండో'

- వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఎదిగేలా త్వరలో అమల్లోకి.. వీ హబ్ వార్షికోత్సవంలో మంత్రి కేటీఆర్ వెల్లడి
- మహిళా సమానత్వం మన ఇళ్లనుంచే ప్రారంభం కావాలి
- నన్ను, మా చెల్లిని సమానంగా పెంచారు.. మేం కూడా అలాగే చేస్తున్నాం



- వివరాలు 14లో ▶

మాది న్యూట్రిషన్ మీది పార్టిషన్..

కేంద్ర రాజకీయాలపై మంత్రి హరీశ్‌రావు ధ్వజం

- 'ఆరోగ్యమహిళ' కార్యక్రమానికి కరీంనగర్‌లో శ్రీకారం.. శ్రీరామ నవమి అనంతరం న్యూట్రిషన్ కిట్ అమలు
- రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాల నిధులు విడుదల



- వివరాలు 3లో ▶

మాది చతుర్ముఖ వ్యూహం

మేం 72 స్థానాల్లో గెలుస్తాం..

- బీఆర్‌ఎస్‌కు 25కి మించి రావు.. బీజేపీకి సింగిల్ డిజిటే..
- ఎంఐఎం మినహా ఇతరులకు కష్టమే
- అసెంబ్లీ ఎన్నికల కోసం మా అంచనాలు మాకున్నాయి...
- 60మంది అభ్యర్థులు ఖరారయినట్టే
- బీఆర్‌ఎస్–కేటీఆర్, బీజేపీ–సంజయ్, కాంగ్రెస్–రేవంత్‌లను చూసి ప్రజలే నిర్ణయించుకుంటారు
- కేసీఆర్ హయాంలో ఆచారాల శాశ్వత విధ్వంసం జరుగుతోంది
- అందరం కలిసే ఉన్నాం... యాత్రకు అందరూ వస్తారు
- 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 5లో



నేడు కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ సభ

నిఘా పెంచండి... నివేదికలివ్వండి

ప్రైవేటు ఇంటర్ కాలేజీల ఆగడాలపై బోర్డు సీరియస్

విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్న కళాశాలల వివరాలు జిల్లాల వారీగా సేకరణకు ఆదేశం

ఆయా కాలేజీలకు సహకరించిన అవినీతి అధికారులపైనా చర్యలకు రంగం సిద్ధం

నివేదికలు అందాక కొన్ని కాలేజీలపై వేటు!

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంటర్ కాలేజీలపై ఇంటర్ బోర్డు దూకుడు పెంచింది. ప్రతి కాలేజీకి సంబంధించిన వ్యవహారాలపై నివేదికలు తెప్పించుకోనుంది. వాటి పరిశీలన బాధ్యతను జిల్లా ఇంటర్ అధికారులకు అప్పగిస్తోంది. పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు బోర్డు అప్రమత్తమైనట్లు అధికారులు చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాలేజీలను అదుపు చేయాలన్నదే అసలు ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ వ్యవహారంపై బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ సీరియస్‌గా ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అన్ని జిల్లాల నుంచి నివేదికలు అందాక కొన్ని కాలేజీలపై వేటు తప్పదని తెలుస్తోంది.



విద్యార్థులను వేధించే కాలేజీలపై ఆరా..

రాష్ట్రవ్యాప్తంగా 1,856 ప్రైవేటు ఇంటర్ కాలేజీలు ఉండగా చాలా కాలేజీల్లో బోధన విధానం కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. అంతర్గత పరీక్షల ద్వారా విద్యార్థులను కేటగిరీలుగా చేసి కొన్ని సెక్షన్ల విద్యార్థుల్లో మానసిక ధైర్యం కోల్పోయేలా చేస్తున్నారని తెలుసుకున్నారు. అలాంటి కాలేజీలు అనుసరిస్తున్న విధానాలు ఏమిటనే సమాచారం సేకరిస్తున్నారు. మెరిట్ ఉన్న విద్యార్థులకు ఒక తరహా ఫ్యాకల్టీ, వెనకబడ్డ వారికి నాణ్యత లేని ఫ్యాకల్టీతో బోధన చేస్తున్న కాలేజీలపైనా

మిగతా 10వ పేజీలో ▶

తెలంగాణపై మళ్లీ 'ఫ్లూ' పంజా!



సాధారణ జ్వరాలకు భిన్నంగా 'హెచ్3ఎన్2'లక్షణాలు

- జ్వరంతోపాటు కళ్ల మంటలు, వాంతులు, విరేచనాలు, నిమోనియాతో బాధితుల బెంబేలు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- సాధారణ స్వైన్‌ఫ్లూకన్నా ఈ వైరస్ తీవ్రత కాస్త ఎక్కువగా ఉందన్న ఐసీఎంఆర్

92 శాతం మంది జ్వర బాధితుల్లో హెచ్3ఎన్2 లక్షణాల గుర్తింపు..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణపై మళ్లీ ఫ్లూ పంజా విసురుతోంది. ఏ ఇంట్లో చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, కళ్ల మంటలు, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మంది ఈ సీజనల్ జ్వరాల బారినపడినట్లు సమాచారం. బాధితుల్లో ఎక్కువగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్న వారే ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం నమోదవుతున్న జ్వరాల్లో సాధారణ లక్షణాలకు భిన్నంగా ఉంటుండటం ఆందోళన కలిగిస్తోంది.

వాతావరణం మారడంతో..: ప్రస్తుతం శీతాకాలం ముగిసి వేసవి ప్రారంభమైంది. చలిగాలులు తగ్గి పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వైరస్ కారకాలు మార్పు చెందుతున్నాయి. ప్రస్తుతం నమోదవుతున్న జ్వరాలను ఐసీఎంఆర్ ఇటీవల విశ్లేషించగా విస్తుపోయే అంశాలు వెలుగుచూశాయి. ఐసీఎంఆర్ చేసిన సీరో సర్వేలో 92 శాతం మందికి తీవ్రమైన జ్వరంతో పాటు దగ్గు, కళ్ల మంటలు, నిమోనియా (హెచ్3ఎన్2 వైరస్)

మిగతా 3వ పేజీలో ▶



కేయూ క్యాంపస్ ఆవరణలో మొక్కనాటి సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి సత్యవతి రాథోడ్, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, రాష్ట్ర సంగీత అకాడమీ చైర్మన్ దీప్తి రెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమశాఖ కమిషనర్ భారతి హోలీకేరి తదితరులు

న్యూస్‌రీల్

రైలెక్కి రయ్.. రయ్...



ఇంటి నుంచి కాలు బయట పెడితే విమానాలు ఎక్కడమే వారికి తెలుసు. రయ్యిమంటూ గాల్లో తేలిపోతూ గమ్యస్థానాలకు చేరుకోవడాన్ని ఇష్టపడతారు. అలాంటిది ఇప్పుడు వారిలో మార్పు వస్తోంది. హాయిగా రాత్రిపూట రైలెక్కి బెర్త్ వాల్చితే ఉదయాని కల్లా ఊరు చేరుకోవడంలో ఎంత సదుపాయముందో యూరప్ వాసులు గ్రహించారు.

- వివరాలు 6లో ▶

లబ్ డబ్..సడెన్ స్టాప్!



ఇటీవల చిన్నవయసు వారిలోనూ గుండెపోటు మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. కోవిడ్ వచ్చి తగ్గిన వారిలో ఆలస్యంగా అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నట్టు అనేక తాజా అధ్యయనాల్లో వెల్లడవుతోంది. జీవన శైలి అలవాట్లు ఇందుకు కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు.


- వివరాలు 2లో ▶

పూర్తిగా మహిళా సిబ్బందితో 90 విమాన సర్వీసులు



ఆకాశంలో సగం అనే నారీశక్తి నినాదానికి మరింత మద్దతు పలికింది ఎయిర్‌ఇండియా. మార్చి ఒకటోతేదీ నుంచి 90 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను పూర్తి మహిళా సిబ్బందితోనే నడిపింది! బుధవారం సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది.

- వివరాలు 6లో ▶



.. ఇక్కడ కూడా అవసరమా..!

క్లుప్తంగా...

మీ వల్లే తల దించుకోవాల్సి వస్తోంది

కవితపై ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉందని వెలుగులోకి వచ్చిన తర్వాత దేశం ముందు తెలంగాణ సమాజం సిగ్గుతో తల దించుకోవాల్సి వచ్చిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటివరకు తెలంగాణ సమాజం ఎప్పుడూ ఎవరికీ తలవంచలేదన్నారు. కానీ ఇప్పుడు ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంతో తలవంచుతోందన్నారు. ఢిల్లీలో విచారణకు హాజరుకావాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బుధవారం వరుస ట్వీట్లలో కవితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీగా కవిత ఉన్న సమయంలో పార్టీలో ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు 2014–18 మధ్య కేసీఆర్ ప్రభుత్వ కేబినెట్‌లో ఒక్క మహిళకు కూడా అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. అనంతరం 2019లో నిజామాబాద్ ఎంపీగా తన చేతిలో ఓడిన తర్వాత వారసత్వ కోటాలో ఎమ్మెల్సీ అయి, ఇప్పుడు ఢిల్లీ మద్యం కుంభకోణంలో కీలక కుట్రదారుగా రూపుదిద్దుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చడానికి హఠాత్తుగా మహిళా బిల్లు కోసం పోరాడేందుకు ఒక వ్యర్థ ప్రయత్నం కవిత చేస్తున్నారని నిందించారు.

'నోటీసులు ఊహించే ధర్నాలకు సిద్ధం'



సాక్షి, హైదరాబాద్: లిక్కర్ స్కాంలో నోటీసులు వస్తాయని తెలిసే.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రాత్రికి రాత్రే మహిళా రిజర్వేషన్లు, చట్టం, ధర్నా గుర్తుకొచ్చాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. మద్యం కేసులో ఈడీ నోటీసులు అందుకున్న కవిత, ప్రజల దృష్టి మళ్లించేందుకే.. బీజేపీ తమపై కక్ష సాధింపునకు పాల్పడుతోందని గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. ఈడీ నోటీసులపై స్పందిస్తూ బీజేపీపై, కేంద్రంపై కవిత చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు.

నోటీసులిచ్చింది ఈడీ.. మోదీ కాదు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు




దుబ్బాకటౌన్: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీఎం కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత ముద్దాయి అని నోటీసులు ఇచ్చింది ఈడీ అని.. ప్రధాని మోదీ కాదని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాకలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి చేస్తే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోంది అన్నవారికి జవాబు.. కవితకు ఈడీ నోటీసులే అని వ్యాఖ్యానించారు. అడ్డదారిన ఎమ్మెల్సీ అయిన కవిత తాను చేసిన తప్పును తెలంగాణ ఆడపడుచులకు రుద్దడం బాధాకరమన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఆదాయం పెంచుకోవడానికి ఎందుకు తలదూర్చారో గుర్తు తెచ్చుకోవాలి చెల్లి కవిత అని అన్నారు. ''ఆస్తుల కోసం ఢిల్లీలో లిక్కర్ దందా నువ్వు చేసి ఈరోజు అందరినీ కలపడం కరెక్ట్ కాదు.. కవితమ్మకు నోటీసులు ఇస్తే బీఆర్ఎస్ వాళ్లు ధర్నాలకు పిలుపునివ్వడం బాధాకరం. నోటీసులు ఇస్తే నేను ఎదుర్కొంటా అంటివి ఇప్పుడు ఎదుర్కో చెల్లె.. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి కూడా నీలాగే తప్పించుకుందామనుకుండు..కానీ తప్పలేదు.. ''అని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు మహిళా బిల్లు పెట్టుమని కవిత కొట్లాడిందా? ఇప్పుడు నీ తప్పును తెలంగాణ మహిళలకు ఎందుకు రుద్దడమని ప్రశ్నించారు.

మహిళా దినోత్సవం నాడే గుర్తుకొస్తారా?

మిగిలిన రోజుల్లో కనీసం గౌరవం ఇవ్వరా?: ప్రవీణ్‌కుమార్



శాంతినగర్: మహిళా దినోత్సవం రోజున మాత్రమే అధికార పార్టీ నాయకులకు మహిళలు గుర్తుకు వస్తారని, మిగతా రోజుల్లో కనీసం గౌరవం కూడా ఇవ్వరని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. మహిళలకు పావలా వడ్డీ రుణాలు నాలుగేళ్లుగా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్, ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐలమ్మ విగ్రహం నుంచి మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు ఇవ్వాల్సిన డబ్బుతో సీఎం కూతురు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాంలో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టిందని ఆరోపించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీనిచ్చారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. నేతలు అరుణ, శిరీష, కవిత, రాములమ్మ, రజిత, అశ్విని పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 18 ఏళ్ల ఇంటర్ విద్యార్థి మరీదు రాకేశ్ గుండెపోటుతో మృతి.

రాజస్తాన్‌కు చెందిన 18 ఏళ్ల సచిన్ హైదరాబాద్ శివార్లలోని కండ్లకోయలోని ఓ కాలేజీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతూ కాలేజీ ఆవరణలోనే అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి.

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన షేక్ అహ్మద్ (36) ఇటీవలే దుబాయ్ నుంచి తిరిగొచ్చాడు. అతనికి ఛాతీనొప్పి రావడంతో కుటుంబసభ్యులు అసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు.

- ఆందోళనకు గురిచేస్తున్న గుండెపోటు మరణాలు
- యువకులు కూడా హఠాన్మరణాలకు గురవుతున్న వైనం
- కరోనా సోకినవారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువయ్యాయంటున్న వైద్య నిపుణులు
- అనేకమందిలో రక్తం గడ్డకట్టే గుణం పెరుగుతోందని వెల్లడి
- మానసిక ఒత్తిళ్లు, జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం కూడా కారణమని స్పష్టీకరణ
- క్రీడలు ఆడేటప్పుడు అసౌకర్యంగా అనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలని సూచన

లబ్ డబ్.. సడెన్ స్టాప్!

ఆకస్మిక గుండెపోట్లకు ఎన్నో కారణాలు

ఆకస్మిక గుండెపోట్లకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. కరోనా సోకినవారికి కార్డియో వాస్క్యులర్ జబ్బులు వచ్చే అవకాశాలు అధికమయ్యాయి. కోవిడ్ సందర్భంగా తీవ్రంగా జబ్బుపడినవారికి ప్రమాదం ఎక్కువ. ప్రస్తుతం అనేకమందిలో రక్తం గడ్డకట్టే గుణం పెరుగుతుండడం ఆందోళనకరం. గుండె జబ్బులకు అనేకరకాల వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో కారణమౌతున్నాయి. మానసిక, పని ఒత్తిళ్లు, వాతావరణంలో వివిధరకాల కాలుష్యాలు పెరగడం, జీవనశైలి అలవాట్లు, హైప్రొటీన్ పిజ్జాలు, బర్గర్లు వంటి తిండి ఎక్కువవడం, జిమ్‌లలో అధికంగా శ్రమించడం వంటి వాటితో యువతరం గుండెపోట్ల బారిన పడడం ఇటీవల పెరిగింది. ఇక వైరల్ ఇన్ఫెక్షన్ ప్రభావం 'మయోకార్డియల్ డిస్‌ఫంక్షన్'కు కారణమవుతోంది. యువత బ్యాలెన్స్‌డ్ డైట్ తీసుకోవడం, మెంటల్ స్ట్రెస్ తగ్గించుకోవడం, అర్ధరాత్రిళ్లు, తెల్లారేదాకా మెలుకువగా ఉండడం తగ్గించాలి. ఇలాంటి వాటితో 'సర్కాడియల్ రిథమ్'లో మార్పులొచ్చి హార్మోన్లు, మెటబాలిజమ్‌లో మార్పులొస్తున్నాయి. కుటుంబంలో గుండె సంబంధిత సమస్యలున్న వారుంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.



–డా. డి.శేషగిరిరావు, ప్రముఖ కార్డియాలజిస్ట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకుంటున్న గుండెపోటు మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో కూడా ఇవి సంభవించడం కలవరపరుస్తోంది. కోవిడ్ వచ్చి తగ్గిన వారిలో ఆలస్యంగా అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నట్టు అనేక తాజా అధ్యయనాల్లో వెల్లడౌతోంది. మరోవైపు వయసుతో నిమిత్తం లేకుండా రక్తం గడ్డకట్టే గుణం పెరిగేందుకు దోహదపడేలా జీవనశైలి అలవాట్లు మారడం ఇందుకు కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా 18 నుంచి 25 ఏళ్ల మధ్యనున్న యువత ఆలస్యంగా నిద్రించడం, ఎలాంటి శారీరక శ్రమ, వ్యాయామం లేకుండా సామాజిక మాధ్యమాల్లో, సెల్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు ఇలా వివిధరకాల డిజిటల్ పరికరాలతో కాలక్షేపం చేస్తూ మానసిక ఒత్తిడికి గురికావడం, తదితరాలు ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా నిపుణులు అంచనా వేస్తున్నారు.

పోస్ట్ కోవిడ్‌లో సడెన్ కార్డియాక్ మరణాలు కొద్దిగా పెరిగాయి. దీనితో పాటు యువకుల్లో, ముఖ్యంగా కాలేజీ చదువుతున్న వారిలో 'డ్రగ్స్ అడిక్షన్'అనేది పెరిగింది. కొకైయిన్, గంజాయి వంటి మాదకపదార్థాల వాడకం 'కరోనరీ వాసెస్ ప్లాజెమ్'కు దారితీస్తుంది. కరోనా బారిన పడటం, డ్రగ్స్ వినియోగం వంటి వాటితో గుండెపోటు కేసులు పెరుగుతున్నాయి. పొగ తాగడం, మద్యం అలవాట్లు, డ్రగ్స్ తీసుకోవడం వంటి వల్ల హార్ట్ అటాక్‌కు ఎక్కువ అవకాశాలుంటాయి. యంగ్ జనరేషన్ ఎక్కువగా జంక్ ఫుడ్‌కు అలవాటు పడడం, వాయు కాలుష్యం వంటివి కూడా తోడై గుండెపోటుకు కారణమౌతున్నాయి. గతంలో 40, 50 ఏళ్లకు పైబడిన షుగర్, బీపీ వంటివి ఉన్నవారికి హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు 30 ఏళ్లలోపు వారికే ఇలాంటి సమస్యలు ఎదురౌతున్నాయి. యువతరం కాలేజీల్లో చదువుపరంగా ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. షుగర్, బీపీ వంటి వాటి కంటే కూడా స్ట్రెస్ అనేది యువకుల్లో మరింత ప్రమాదకరమైనదిగా మారింది. గుండె జబ్బులకు సంబంధించి ఫ్యామిలీ హిస్టరీ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. క్రీడలు ఆడేటప్పుడు ఛాతీనొప్పిగా అనిపించినా, బాగా చెమటలు పట్టినా, ఊపిరాడకపోయినా, కొంచెం అసౌకర్యంగా అనిపించినా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. స్మోకింగ్, డ్రగ్స్ వంటివి మానేయాలి. యోగ వంటివి అలవాటు చేసుకోవడం, ధ్యానంతో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం, డాక్టర్ల ద్వారా సందేహాల నివృత్తి చేసుకుంటే ఇది పెద్దసమస్యగా మారకుండా జాగ్రత్త పడవచ్చు.

బీపీ, షుగర్ కంటే స్ట్రెస్ డేంజర్



– డా. ఓరుగంటి సాయి సతీష్, ప్రొఫెసర్, కార్డియాలజీ హెడ్, యూనిట్ 1, నిమ్స్

కవితకు నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

హాజరు కాలేనని తేల్చి చెప్పారు. ఈ మేరకు ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు బుధవారం రాత్రి లేఖ రాశారు.

హడావుడిగా దర్యాప్తు చేయడం ఏమిటి?

ఇంత స్వల్ప కాలంలో విచారణకు రావాల్సిందిగా నోటీసులు జారీ చేయడం, హడావుడిగా దర్యాప్తు చేయడం ఏమిటంటూ ఈడీని కవిత ప్రశ్నించారు. గతంలో ఆయా కోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా విచారించే అవకాశం ఉన్నప్పటికీ నేరుగా ఈడీ కార్యాలయానికి పిలవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. ఒక మహిళను తన నివాసంలో విచారించాలని కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. వీటన్నింటినీ ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని అడిగారు. దర్యాప్తు పేరిట రాజకీయ చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. రాజకీయ కక్షలో భాగంగానే ఇదంతా చేస్తున్నట్లుగా స్పష్టమవుతోందన్నారు. అయినా ఒక సామాజిక కార్యకర్తగా వారం ముందే తన కార్యక్రమాలు ఖరారయ్యాయని, కాబట్టి 11వ తేదీన విచారణకు హాజరవుతానని వివరించారు. అదే సమయంలో దేశ పౌరురాలిగా, ఒక మహిళగా చట్టపరమైన అన్ని హక్కులను తాను ఉపయోగించుకుంటానని స్పష్టం చేశారు. ఇలావుండగా ఈడీ దర్యాప్తుకు సహకరిస్తానని బుధవారం ఉదయం విడుదల చేసిన ఓ లేఖలో కవిత స్పష్టం చేశారు. మరోవైపు గురువారం విచారణకు రాలేనన్న కవిత విజ్ఞప్తిపై ఈడీ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. కాగా తాజా పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని సృష్టించాయి. బుధవారం ఉదయం నుంచి బంజారాహిల్స్ రోడ్ నం.14లోని కవిత నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేడెక్కిన రాజకీయం

ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసుల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. కవితకు ఈడీ నోటీసులు జారీ చేయడాన్ని బీఆర్ఎస్ మంత్రులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలకు ఇది పరాకాష్ట అని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. కాగా కవిత తెలంగాణ తలదించుకునే పని చేసిందంటూ రాష్ట్ర బీజేపీ ధ్వజమెత్తింది. లిక్కర్ కుంభకోణంలో పాత్రధారిని అరెస్టు చేయకుండా ఎలా ఉంటారని ప్రశ్నించింది. మరోవైపు కాంగ్రెస్..ఈడీ నోటీసులు, కవిత అరెస్టు ఊహాగానాలు ఇదంతా ఓ డ్రామా అని విమర్శించింది. ఆ రెండు పార్టీలు కూడబలుక్కుని ఆడుతున్న నాటకమేనని వ్యాఖ్యానించింది.

లాయర్లతో సమాలోచన.. కేసీఆర్‌కు ఫోన్

ఈడీ నోటీసుల నేపథ్యంలో ఉదయం తన నివాసంలోనే న్యాయవాదులతో కవిత సమాలోచనలు జరిపారు. సాయంత్రం ఢిల్లీకి బయల్దేరి వెళ్లేముందు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. 'ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ముందుగా నిర్ణయించిన ప్రకారం దీక్ష కొనసాగించు. బీజేపీ అకృత్యాలను న్యాయపరంగా ఎదుర్కొందాం. పార్టీ పూర్తిగా నీకు అండగా ఉంటుంది..' అని సీఎం భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

10న బీఆర్ఎస్ సమావేశం

బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరగనుంది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ నేతలు, జిల్లాల అధ్యక్షులు, జెడ్పీ చైర్మన్లు తదితరులు హాజరుకానున్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో..రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ కార్యకలాపాలు, తదితర అంశాలపై చర్చించనున్నారు. కాగా కవితకు ఈడీ నోటీసులు, ఇతర తాజా పరిణామాలు, పార్టీ వ్యూహాలపై కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆహ్వానితులు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కేసీఆర్ ఆదేశించారు.

ఢిల్లీ చేరుకున్న కవిత..

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక రోజు దీక్ష ఏర్పాట్లు పరిశీలించడానికి కవిత బుధవారం రాత్రే ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా సీఎం కేసీఆర్ అధికారిక నివాసం తుగ్లక్‌రోడ్ 23కు చేరుకున్నారు. ఆమె అక్కడే బస చేయనున్నారు. ఈడీ విచారణకు సంబంధించి న్యాయనిపుణులతో కవిత చర్చించే అవకాశం ఉందని తెలిసింది.

కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను లొంగదీసుకోలేరు..

ఈడీ నోటీసుల నేపథ్యంలో కవిత బుధవారం ఉదయం ఒక లేఖ విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. 'మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భారత్ జాగృతి ఈ నెల 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష తలపెట్టింది. ఈ క్రమంలోనే గురువారం ఢిల్లీలో విచారణకు రావాల్సిందిగా ఈడీ నాకు నోటీసులు జారీ చేసింది. ఇలాంటి చర్యలతో.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని లొంగదీసుకోవడం కుదరదని, తెలంగాణ తలవంచదని బీజేపీ తెలుసుకోవాలి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం. దేశ అభ్యున్నతి కోసం గొంతెత్తుతాం. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి తెలంగాణ ఎప్పటికీ తలవంచబోదని ఢిల్లీలో ఉన్న అధికారకాంక్షాపరులకు గుర్తు చేస్తున్నా. ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాటం చేస్తాం..' అని కవిత స్పష్టం చేశారు.

నాడు సీబీఐ.. నేడు ఈడీ

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో డిసెంబర్ 11న కవితను విచారించిన సీబీఐ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి గతేడాది డిసెంబర్ 11న హైదరాబాద్‌లో కవితను సీబీఐ విచారించిన విషయం విదితమే. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కుంభకోణంలో సౌత్ గ్రూపునకు చెందిన పలువురు కీలకపాత్ర పోషించారని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. గతేడాది ప్రధాన నిందితుడు సమీర్ మహేంద్రుపై దాఖలు చేసిన చార్జిషీటులో పలుసార్లు కవిత పేరు ప్రస్తావించిన విషయం విదితమే. సాక్ష్యాలు ధ్వంసం చేసే క్రమంలో కవిత కూడా తన ఫోన్లు ధ్వంసం చేశారని దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. ఈడీ విచారణలో నిందితులు సమీర్ మహేంద్రు, దినేష్ అరోరా, అరుణ్ పిళ్‌లై, వి.శ్రీనివాసరావులు కవిత పేరు ప్రస్తావించారు. సోమవారం రాత్రి అరుణ్‌పిళ్‌లైను అరెస్టు చేసిన ఈడీ మంగళవారం ప్రత్యేక కోర్టులో హాజరు పరిచింది. ఈ సందర్భంగా దాఖలు చేసిన రిమాండు రిపోర్టులో అరుణ్ పిళ్‌లై.. కవిత బినామీ అని పేర్కొంది. తాజాగా ఆమెకు కూడా నోటీసులు జారీ చేయడంతో వీరిద్దరినీ కలిపి విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈడీ రికార్డు చేసిన స్టేట్‌మెంట్లు ఇలా ఉన్నాయి.

తాజాగా నోటీసులు జారీ చేసిన ఈడీ

- అరుణ్ పిళ్లై అరెస్టు అనంతర పరిణామం

సమీర్ మహేంద్రు

ఇండో స్పిరిట్స్ వెనక ఉన్నవారెవరని అరుణ్ పిళ్‌లైను సమీర్ మహేంద్రు అడగగా తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉన్నారని సమీర్‌కు పిళ్‌లై చెప్పారని ఈడీ పేర్కొంది. 'ఇండో స్పిరిట్స్ దరఖాస్తుపై సమస్యలు వస్తే తన స్థాయిలో పరిష్కరిస్తానని, అరుణ్ పిళ్‌లై ద్వారా తనకు తెలియజేయాలని సమీర్ మహేంద్రుకు ఎమ్మెల్సీ కవిత తెలిపారు. హైదరాబాద్ వెళ్లినపుడు కవిత ఇంట్లో ఆమె భర్త అనిల్‌తో కలిసి సమీర్ భేటీ అయ్యారు. అరుణ్ తమ కుటుంబానికి సన్నిహితుడని, ఇప్పటికే కలిసి వ్యాపారం చేస్తున్నామని సమీర్‌కు కవిత తెలిపారు.' అని ఈడీ తెలిపింది.

అరుణ్ పిళ్‌లై స్టేట్‌మెంట్

ఎమ్మెల్సీ కవిత, సమీర్ మహేంద్రులు ఫేస్ టైంలో మాట్లాడుకొనే ఏర్పాటు చేశానని పిళ్‌లై తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నట్లు ఈడీ తెలిపింది. హైదరాబాద్‌లో వారిద్దరూ సమావేశం అయ్యేలా ఏర్పాటు చేశానని, ఇండో స్పిరిట్స్‌లో అసలు పెట్టుబడిదారు కవిత అని సమీర్‌కు వివరించారని పేర్కొంది.

దినేష్ అరోరా

ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో తాను ఎమ్మెల్సీ కవిత, అరుణ్ పిళ్‌లై, విజయ్‌నాయర్‌లు సమావేశమైనట్టుగా దినేష్ తెలిపారని ఈడీ పేర్కొంది. 'మద్యం వ్యాపారంపై చర్చించడంతో పాటు ఆప్ నేతలకు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.100 కోట్లు రికవరీపైనా చర్చించారు' అని ఈడీ తెలిపింది.

కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందిపెడితే రాష్ట్రం అగ్నిగుండమే

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: మహిళా దినోత్సవం రోజు ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీచేయడం మహిళలను గౌరవించకపోవడమేనని, కేసీఆర్ కుటుంబమే టార్గెట్‌గా బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించిన కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజలున్నారని, రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఎమ్మెల్సీ కవితను అడ్డం పెట్టుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. సీబీఐ, ఈడీలను కేంద్రం భ్రష్టుపట్టిస్తోందని, బ్యాంక్‌లకు ఎగనామం పెట్టి దేశం దాటిన వాళ్లకు కేంద్రం అండగా నిలుస్తూ, మాటవినని వారిపై కేసులు పెట్టి వేధిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ రాష్ట్రం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసిన కేంద్రం దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన అదానీ గురించి ఎందుకు నోరు మెదపదని మంత్రి నిలదీశారు.

కేసీఆర్‌ను ఎదుర్కోలేక కవితపై కేసులు

మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌ను బీజేపీ ఎదుర్కోలేక ఎమ్మెల్సీ కవితపై కక్షపూరిత కేసులు పెడుతోందని మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. కవితకు ఈడీ నోటీసులు విద్వేషపూరిత రాజకీయాలకు పరాకాష్ట అని పేర్కొన్నారు. కవితకు ఈడీ నోటీసుల నేపథ్యంలో బుధవారం ఒక ప్రకటనలో మంత్రి బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థలను బీజేపీ భ్రష్టు పట్టించి, వాటి విశ్వసనీయతను దెబ్బతీసిందని, ఈడీ, సీబీఐ, ఐటీ నోటీసులు, కేసులు అంటే ప్రజలు నవ్వుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన అదానీ గురించి కేంద్రం ఎందుకు నోరు మెదపదని, ఈడీ, సీబీఐ, ఐటీలు ఎందుకు దర్యాప్తు చేయవని ప్రశ్నించారు. మాటవినని వారిపై కేసులు పెడుతూ... దారికి వచ్చిన వారిపై మాత్రం దయచూపిస్తున్నారని ఆరోపించారు. పోరాటం తెలంగాణ రక్తంలోనే ఉందనీ అది ఈ నేల మాకు వారసత్వంగా ఇచ్చిందనీ కేసులతో బీఆర్ఎస్ ఎదుగుదలను అడ్డుకోలేరని పేర్కొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే నోటీసులు

మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చారని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందనడానికి ఇది నిదర్శనమన్నారు. బీజేపీకి చెందిన ఓ ఎంపీ చేసిన ఆరోపణలను ఆధారం చేసుకుని.. ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. బీజేపీ పాలకులకు కంట్లో నలుసుగా మారిన ఢిల్లీలోని ఆప్, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టే కుట్రలో భాగమే ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇవ్వడమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి కేసులతో బీఆర్ఎస్‌ను నిలువరించాలనుకుంటే అంతకు మించిన మూర్ఖత్వం మరొకటి ఉండబోదని మంత్రి పేర్కొన్నారు.

కవితకు నోటీసులు కక్షసాధింపే..

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు కోరుతూ ఈ నెల 10న ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత దీక్షకు సిద్ధమవుతుంటే ఈడీ నోటీసులు జారీ చేయడం కక్ష సాధింపేనని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడుతూ విపక్షాలను నిలువరించేందుకు, నాయకులను బ్లాక్ మెయిల్ చేసేందుకు సీబీఐ, ఈడీ, ఐటీలను బీజేపీ వాడుకుంటోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని, సీఎం కేసీఆర్ ఎవరికీ తలవంచే రకం కాదని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ ఎండగడుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ కక్షతోనే నోటీసులు

శాసనమండలి చైర్మన్ 'గుత్తా'



నల్లగొండ: రాజకీయ కక్ష సాధింపు ధోరణితోనే ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన అభివృద్ధిని సాధిస్తోందని గవర్నర్ అసెంబ్లీ ఉభయసభల్లో ప్రసంగించి.. బయట మాత్రం పలు ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మహిళల కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

సీబీఐ, ఈడీతో కేంద్రానికేమి సంబంధం?

- తెలంగాణ అంటే మీరు, మీ కుటుంబమేనా..
- లిక్కర్ కుంభకోణాన్ని తెలంగాణ సమాజానికి అంటగడతారా..
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'తొమ్మిదేళ్లుగా తెలంగాణను దోచుకున్నది చాలదన్నట్లు ఢిల్లీలో దోస్తీ కట్టి లిక్కర్ కుంభకోణానికి తెర తీసింది ఎవరు.. ?రోజుకో సెల్‌ఫోన్ పగలగొట్టింది ఎవరు..? అక్రమార్కులతో చేయి కలిపింది ఎవరు..'? అని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను తలవంచమని చెప్పడం లేదని.. తన తప్పు లేకుంటే నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. అంతేగానీ లిక్కర్ కుంభకోణాన్ని తెలంగాణ సభ్య సమాజం మొత్తానికి అంటగట్టే ప్రయత్నం చేయడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బుధవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ''నోటీసులకే ఉలిక్కిపడితే ఎలా.. అరెస్టు చేయలేదు కదా.. ఎందుకు గగ్గోలు పెడుతున్నారు.. నీతిమంతులైతే న్యాయపరంగా ఎదుర్కోండి''అని సూచించారు. ''తెలంగాణ అంటే మీరేనా.. కల్వకుంట్ల కుటుంబానిదేనా..'' అని నిలదీశారు. సీబీఐ, ఈడీతో బీజేపీకి సంబంధం లేదని.. వాటిలో మేం జోక్యం చేసుకోమని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు స్వేచ్ఛ లేదు..

సీఎం కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీలో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా పాలన కొనసాగించారని.. నేడు మహిళా బిల్లు గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ లకు స్వేచ్ఛ లేకుండాపోయిందని.. రాజ్యాంగ వ్యవస్థలో గవర్నర్ వ్యవస్థ ఒకటని.. అలాంటి గవర్నర్ ఒక మహిళ అని కూడా చూడకుండా అవమానం చేస్తూ మంత్రులు మాట్లాడడం చాలా బాధాకరమన్నారు.

లిక్కర్ స్కాం దోషులను మోదీ వదిలిపెట్టరు

- దొంగ దందాతో తెలంగాణ మహిళలు తలదించుకునే పరిస్థితి ఏర్పడింది...
- బీజేపీ అధ్యక్షుడు సంజయ్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వికెట్ పడడంతో పాటు బీఆర్ఎస్ నేతల వికెట్లు క్లీన్ బౌల్డ్ కానున్నాయని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ క్రికెట్ పరిభాషలో వ్యాఖ్యానించారు. లిక్కర్ స్కాం దోషులెవరినీ మోదీ ప్రభుత్వం వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మహిళామోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో సంజయ్ మాట్లాడారు. కవితకు ఈడీ ఇచ్చిన నోటీస్‌లకు తెలంగాణ సమాజానికి, బీజేపీకి ఏమి సంబంధమని ప్రశ్నించారు. ఓ పక్క లిక్కర్ దందాలో ఇరుక్కుని తెలంగాణ తలవంచదని కవిత చెబుతున్నారని, కేసీఆర్ బిడ్డ చేసిన దొంగ దందా వల్ల తెలంగాణ మహిళలు నేడు తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. లిక్కర్ స్కాం, కవితకు నోటీసులపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సెంటిమెంట్‌ను రెచ్చగొడితే పట్టించుకునే పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు లేరని వ్యాఖ్యానించారు. మహిళలకు తెలంగాణలో భద్రత లేకుండా పోయిందనీ ఆరేళ్ల పసిపాప నుండి 60 ఏళ్ల ముసలి మహిళలపై అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉగ్రవాదులకు, రోహింగ్యాలకు పాతబస్తీ అడ్డా

'కేసీఆర్ పొరపాటున మళ్లీ సీఎం అయితే మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసేవాళ్లకు ప్రోత్సాహకాలు ఇస్తారేమో.. పాతబస్తీలో 30 వేల దొంగ బర్త్ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లు సృష్టించారు.. పాతబస్తీ ఉగ్రవాదులకు, రోహింగ్యాలకు అడ్డా అయ్యింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వాళ్లు యథేచ్ఛగా వస్తున్నారు. అందుకే నేను సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తానంటే చాలా మంది విమర్శించారు. ఇప్పుడేమంటారు? 'అని సంజయ్ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు సముచిత స్థాయిలో టికెట్లు ఇచ్చే పార్టీ బీజేపీనేనని, గెలిచే మహిళా నేతలకు తప్పకుండా టికెట్లు ఇస్తామని ఆయన హామీనిచ్చారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి, పార్టీ ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, కార్యదర్శి జయశ్రీ, జాతీయ మహిళా మోర్చా నాయకులు నళిని, కరుణాగోపాల్, తుల ఉమ పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సన్మానించారు

కవిత చేసిన దొంగ దందా ఎవరి కోసం?

'కవిత చేసిన దొంగ దందా, పత్తాల దందా తెలంగాణ సమాజం కోసమా? ఎవరి కోసం? అని బండి సంజయ్ ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 'బిడ్డను కాపాడుకునేందుకు కేసీఆర్ కొత్తకొత్త డ్రామాలు ఆడుతున్నారు. కవిత చేసిన దుర్మార్గపు చర్యలను ప్రజలు ఛీత్కరించుకునే పరిస్థితి. దొంగే.. దొంగ అన్నట్లు కవిత వ్యవహారం ఉంది 'అని మండిపడ్డారు.

క్లుప్తంగా...

కోమటిరెడ్డిపై ఫిర్యాదును ఏఐసీసీకి పంపాం: చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సొంత పార్టీ నేత డాక్టర్ చెరకు సుధాకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన అంశంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై వచ్చిన ఫిర్యాదును ఏఐసీసీకి పంపామని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి వెల్లడించారు. కోమటిరెడ్డి ఎంపీగా ఉండడంతో పాటు ఏఐసీసీ సభ్యుడైనందున ఆయనపై చర్యలు తీసుకునే అధికారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి లేదన్నారు. బుధవారం సాయంత్రం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ భేటీలో చెరకు సుధాకర్‌నుద్దేశించి ఎంపీ వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు వచ్చిన ఆడియో లీక్, కోమటిరెడ్డిపై చెరకు సుధాకర్ ఫిర్యాదుపై చర్చ జరిగింది. సమావేశం అనంతరం చిన్నారెడ్డి మీడియాతో మాట్లాడుతూ సుధాకర్ ఫిర్యాదును పరిశీలించి ఏఐసీసీకి పంపామని చెప్పారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే అనిల్‌కు నోటీసులిచ్చామని, వాటికి అనిల్ సమాధానం ఇవ్వనందున మరోమారు నోటీసులిచ్చామని, 3 రోజుల్లో వివరణ ఇవ్వకపోతే చర్యలుంటాయన్నారు.

న్యాయస్థానంపై నమ్మకం ఉంది: కోమటిరెడ్డి



నార్కట్‌పల్లి: రాజకీయ విమర్శల కారణంగా తనపై కేసు నమోదైందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున మాట్లాడలేనని, తనకు న్యాయస్థానంపై నమ్మకం ఉందన్నారు. ఆయన బుధవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఏప్రిల్ మొదటి వారంలో ట్రయల్ రన్ చేసి 40 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని, ప్రస్తుతం పనులు వేగవంతంగా సాగుతున్నాయని నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ చెప్పారని తెలిపారు. బ్రాహ్మణ వెల్లంలకు నీరు రావాలంటే ముందు శ్రీశైలం సొరంగమార్గం పనులు పూర్తి కావాలన్నారు. దీనిపై గతంలోనే సీఎం కేసీఆర్‌కు లేఖ కూడా రాశానన్నారు. శ్రీశైలం సొరంగ మార్గం పూర్తయితే నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అవుతుందని, ఫ్లోరైడ్, సాగునీటి సమస్యలు తీరుతాయన్నారు.

ఎమ్మెల్సీల ఎంపికలో అగ్రవర్ణాలకే ప్రాధాన్యం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ పదవులకు బీఆర్‌ఎస్ పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థుల్లో అగ్రవర్ణాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చినట్లు స్పష్టమవుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల 18 ఎమ్మెల్సీ పదవుల్లో 14 పదవులను బడుగు, బలహీన వర్గాలకు కేటాయించారని ప్రశంసించారు. కానీ తెలంగాణలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని జాజుల విమర్శించారు.

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఖూనీ: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. ఆయన మఖ్దూం భవన్‌లో బుధవారం దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ విధ్వంసకర చర్యలతో దళితులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. మోదీ ప్రధాని అయిన తర్వాత దళితులపై నేరాలు భారీగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికే సాక్ష్యమని పేర్కొన్నారు.

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లూయెంజా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఒమిక్రాన్ రూపంలో దేశంలోకి కోవిడ్ థర్డ్‌వేవ్ ప్రవేశించి ఏడాది దాటినా ఇంకా దాని రూపాంతరాలు వ్యాప్తిలోనే ఉంటున్నాయని వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు. తమ వద్దకు వస్తున్న ప్రతి ఇద్దరు రోగుల్లో ఒకరు దగ్గు, జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. బాధితుల్లో పిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారే ఎక్కువగా ఉంటున్నారని వివరిస్తున్నారు. కోవిడ్ వ్యాప్తి తగ్గడంతో ప్రజలు మాస్కుల వాడకాన్ని దాదాపుగా మర్చిపోయారని.. రద్దీ ప్రాంతాల్లోనూ ఎవరూ పెద్దగా మాస్కులు వాడటంలేదని విశ్లేషిస్తున్నారు. అందుకే వైరల్ జ్వరాలు ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపిస్తున్నాయని వైద్యులు అంటున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.



వైరస్ లోడింగ్.. జరభద్రం

దేశవ్యాప్తంగా పెరుగుతున్న వైరల్ ఇన్ఫెక్షన్ల కేసులు.. | ప్రతి ఇద్దరిలో ఒకరు జ్వర బాధితులే అంటున్న డాక్టర్లు | ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచన

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- → తరచూ సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.
- → మాస్క్, శానిటైజర్ వాడాలి.
- → కళ్లు, ముక్కు, నోటిని అధికంగా తాకడం, రుద్దడం వంటివి మానాలి.
- → జనసమ్మర్ధ ప్రాంతాల్లోకి మాస్క్ లేకుండా వెళ్లకూడదు.
- → బట్టలు, తువ్వాళ్లు, వాటర్ బాటిళ్ల వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోకూడదు.

బాధితుల్లో దగ్గు అధికం..



గత 2 నెలలుగా ఢిల్లీలో ఇన్‌ఫ్లూయెంజా కేసుల పెరుగుదల అధికంగా ఉంది. చాలా మందిలో దగ్గు ఎక్కువగా ఉంటోంది. ఆస్తమా, అలర్జీ, సీవోపీడీ, ఇతర ఊపిరితిత్తుల సమస్యలున్న వారిలో సమస్యలు మరింతగా పెరుగుతున్నా యి. ఈ వైరస్‌లకు వాయుకాలుష్యం తోడుకావడంతో సమస్య తీవ్రమవుతోంది. ఈ వైరస్‌ల బారినపడిన వారు అజిత్రోమైసిన్ వంటి యాంటీబయోటిక్స్‌ను ఎక్కువగా వాడరాదు. ఇలాంటి వారికి ఫ్లూ వ్యాక్సిన్లు రక్షణనిస్తాయి.

– డాక్టర్ (ప్రొ) గోపీచంద్ ఖిల్నానీ, చైర్మన్, పీఎస్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్, ఢిల్లీ

ఈ వైరస్ ఏమిటో అంతుబట్టట్లేదు



చాలామంది బాధితుల్లో దగ్గు ఎక్కువై కళ్లలో రక్తం పడటం, ఆయాసం, గొంతు బొంగురుపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఒకట్రెండు రోజులు జ్వరం, ఒళ్లునొప్పులు సైతం ఉంటున్నాయి. ఇది ఇన్‌ఫ్లూయెంజాలో కొత్త వేరియెంటా లేక కొత్త మ్యుటేషన్ తీసుకున్న కోవిడ్ ఇన్ఫెక్షనా అనేది (ఆర్టీపీసీఆర్ గుర్తించని) స్పష్టంగా తెలియట్లేదు. దీర్ఘకాలిక ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు ఇన్‌ఫ్లూయెంజా ఫ్లూ షాట్, న్యూమోకోకల్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచిస్తున్నాం. ఇవి ఇన్‌ఫ్లూయెంజా ఏ,బీ, స్వైన్‌ఫ్లూ నుంచి రక్షణనిస్తున్నాయి.

– డాక్టర్ వీవీ రమణప్రసాద్, కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, కిమ్స్ హాస్పిటల్

భయం వద్దు... జాగ్రత్త మరవొద్దు: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: సీజనల్ ఫీవర్లు, ఇన్‌ఫ్లూయెంజా కేసుల పెరుగుదలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు సూచించారు. ప్రతీ ఒక్కరు జాగ్రత్త చర్యలు పాటించాలని, వైద్యుల సూచన మేరకే యాంటీబయాటిక్స్ వాడాలన్నారు. తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. రాష్ట్రంలో సీజనల్ ఫీవర్స్, ఇన్‌ఫ్లూయెంజా కేసుల పెరుగుదల నేపథ్యంలో మంత్రి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాల్లోనూ ఇన్‌ఫ్లూయెంజా కేసులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోనూ స్వల్పంగా కేసులు పెరిగాయని, ఇందులో అధికంగా జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులకు సంబంధించిన అంశాలే ఉన్నాయని చెప్పారు. ఈ లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే చిన్న పిల్లలతో ఓపీ పెరిగిందని, ఇన్‌పేషెంట్ విభాగంలో మాత్రం పెరుగుదల లేదన్నారు. ఈ సమావేశంలో వైద్య కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతి, వైద్య విద్య సంచాలకులు రమేష్ రెడ్డి, ప్రజారోగ్య సంచాలకులుజి.శ్రీనివాస్, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు తెలంగాణ స్వాగతం

ప్రవాసులకు మంత్రి కొప్పుల పిలుపు



సాక్షి, హైదరాబాద్: వాణిజ్య పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా స్వాగతం పలుకుతోందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా బుధవారం ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ప్రైవేటు రంగంలో పెట్టుబడులకు అమెరికాలోని ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలని కోరారు.

తాత్కాలిక ఉద్యోగులకు మంగళం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆవిర్భావం అనంతరం నియమితులైన ఉద్యోగులను తొలగించాలని ప్రభుత్వం వర్సిటీలకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో 2014 జూన్ 2వ తేదీ తర్వాత కాంట్రాక్టు, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులను గుర్తించి తక్షణం తొలగించాలని వీసీలకు ప్రభుత్వం జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓయూ క్యాంపస్‌లోని కళాశాలలు, కార్యాలయాలతో పాటు అనుబంధ కళాశాలల ఉద్యోగులను తొలగించాలని రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మళ్లీ 'ఫ్లూ' పంజా!

▶ మొదటి పేజీ తరువాయి

లక్షణాలున్నట్లు గుర్తించింది. సాధారణ స్వైన్‌ఫ్లూ కంటే దీని తీవ్రత కొంత ఎక్కువేనని పేర్కొంది.

పదేళ్ల క్రితం తగ్గినట్లే తగ్గి..

2009లో హైదరాబాద్‌లో తొలిసారిగా స్వైన్‌ఫ్లూ కేసు నమోదైంది. 2012 వరకు హెచ్1ఎన్1 ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కేసుల తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఆపై కేసుల సంఖ్య క్రమంగా తగ్గి సాధారణ ఫ్లూ జాబితాలో చేరింది. అడపాదడపా కేసులు నమోదవుతున్నప్పటికీ రోగనిరోధకశక్తి పెరగడం, చికిత్స సులభతరం కావడంతో ఆ తర్వాత పెద్దగా ప్రాణనష్టం వాటిల్లలేదు. ప్రస్తుతం ఈ వైరస్ హెచ్3ఎన్2గా రూపాంతరం చెంది బలపడింది. సాధారణంగా చలి ప్రదేశంలో ఈ వైరస్ విస్తరిస్తుంది. ఇందుకు భిన్నంగా వేసవిలోనూ విజృంభిస్తోంది.



ఫీవర్ ఆసుపత్రిలో బారులుతీరిన బాధితులు

జనసమూహాలతో వ్యాపిస్తూ..

ప్రస్తుతం శుభకార్యాల సీజన్ కావడంతో ప్రజలు భారీగా ఒకచోట చేరుతున్నారు. తీర్థయాత్రలు, పర్యాటక ప్రాంతాలకు సైతం వెళ్తున్నారు. ఈ సమయంలో వైరస్ సోకిన వ్యక్తి తుమ్మడం, దగ్గడం వల్ల ఆ వైరస్ గాలిలోకి ప్రవేశించి ఒకరి నుంచి మరొకరికి వేగంగా విస్తరిస్తోంది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని ఐసోలేషన్ కేంద్రాలు ప్రస్తుతం ఫ్లూ బాధితులతో రద్దీగా మారుతున్నాయి. బాధితుల్లో జ్వరం 3–5 రోజులపాటు ఉంటుండగా దగ్గు 10–15 రోజులపాటు వేధిస్తోంది. సకాలంలో వైరస్‌ను గుర్తించకపోవడం, చికిత్సను నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్రమైన నిమోనియాకు కారణమవుతోంది.

రాష్ట్రంలో హెచ్1 ఎన్1 కేసులు

ఏడాది	పాజిటివ్ కేసులు	మరణాలు
2018	1007	28
2019	1388	22
2020	446	05
2021	09	–
2022	343	–

ఫీవర్ ఆస్పత్రిలో కేసులిలా..

తేదీ	ఓపీ	ఐపీ
01	673	38
02	787	36
03	700	27
04	646	31
05	261	11
06	666	41
07	569	18

ఆందోళన అక్కర్లేదు



వైరస్‌లు ఎప్పటికప్పుడు రూపాంతరం చెందుతుంటాయి. హెచ్3ఎన్2 వైరస్ కారకాలపై ఆందోళన అవసరం లేదు. ఇది కూడా ఓ సాధారణ ఫ్లూనే. అయితే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. జన సమూహంలోకి వెళ్లకపోవడం, విధిగా మాస్కులు ధరించడం, రోగనిరోధకశక్తిని పెంచుకోవడం, ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వైరస్ బారినపడకుండా కాపాడుకోవచ్చు. చికిత్సల్లో మోతాదుకు మించి యాంటీబయోటిక్స్ వాడొద్దని ఐసీఎంఆర్ ఇప్పటికే సూచించింది. ఇది సాధారణ మందులతోనే నయమవుతుంది.

– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ ఆస్పత్రి

మాది న్యూట్రిషన్ | మీది పార్టిషన్

కేంద్ర రాజకీయాలపై మంత్రి హరీశ్‌రావు ధ్వజం

- 'ఆరోగ్యమహిళ' కార్యక్రమానికి కరీంనగర్‌లో శ్రీకారం
- శ్రీరామనవమి అనంతరం న్యూట్రిషన్ కిట్ అమలు
- రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాల నిధుల విడుదల



ఆరోగ్య మహిళ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కేంద్రానివి పార్టిషన్ పాలిటిక్స్ అని.. తమవి న్యూట్రిషన్ పాలిటిక్స్ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలోని మహిళల ఆరోగ్యం కోసం ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించ తలపెట్టిన ఎనిమిది రకాల వ్యాధులు, 57 టెస్టులతో కూడిన 'ఆరోగ్య మహిళ' పథకానికి మంత్రి హరీశ్‌రావు కరీంనగర్‌లో బుధవారం శ్రీకా రం చుట్టారు. అనంతరం మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో జరి గిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కేంద్రం హిందూ–ముస్లిం అంటూ ప్రజలను విభజిస్తూ పాలిస్తూ.. పార్టిషన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు. కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ అడిగినా ప్రైవేటు కాలేజీలను సాకుగా చూపి అనుమతి నిరాకరించిందన్నారు. తాము మాత్రం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ఏడాది మెడికల్, నర్సింగ్ కాలేజీలను ప్రారంభిస్తున్నామన్నారు.

50 శాతం మంది మహిళలకు..

తెలంగాణలోని 50 శాతం మంది మహిళలు కేన్సర్, రక్తహీనత, గర్భసంచి, అధిక బరువు, పోషకాహార లోపం వంటి సమస్యలతో బాధపడుతున్నారని హరీశ్‌రావు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్య సమస్యను భర్తకు చెప్పుకోలేక చిన్న సమస్యను పెద్దగా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ కిట్‌తో గర్భిణులకు విశేష సేవలు అందుతున్నాయన్నారు. మహిళా ఆరోగ్యం పేరుతో మహిళలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని చెప్పారు. మెరుగైన సేవల కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 8 రకాల సమస్యలకు 8 వార్డులను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మారై స్కానింగ్ మెషీన్ అందుబాటులోకి తెస్తామని, సమస్య పెద్దది కాకముందే మహిళలు ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని సూచించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఆరోగ్యమహిళ, న్యూట్రిష న్ కిట్స్, రూ.750 కోట్లవడ్డీలేని రుణాలు విడుదల చేసి మూడు కానుకలను అందజేశారన్నారు. రెండో దశ వడ్డీలేని రుణాలను జూన్ లేదా జూలైలో అందజేస్తామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

శ్రీరామనవమి తరువాత న్యూట్రిషన్ కిట్లు


ఆరోగ్య మహిళలో భాగంగా మొత్తం 8 రకాల ఆరోగ్య సమస్యలకు ఆరోగ్య మహిళ ద్వారా పరిష్కారం లభిస్తుందని హరీశ్‌రావు చెప్పారు. రెఫరల్ ఆసుపత్రుల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ మంగళవారం పూర్తిగా మహిళా వైద్య సిబ్బంది ఉండి వైద్యం అందిస్తారని.. ప్రస్తుతం 100 ఆసుపత్రులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో 1200 సెంటర్లకు పెంచుతామని హామీ ఇచ్చారు. అటెండర్ నుంచి డాక్టర్ దాకా ఆ క్లినిక్‌లో అంతా మహిళలే ఉంటారన్నారు. శ్రీరామనవమి తరువాత రాష్ట్రవ్యాప్తంగా న్యూట్రిషన్ కిట్స్ అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

వాటాకు మించి ఏపీ నీటి వినియోగం

- ఇకముందు తరలించకుండా అడ్డుకోండి
- కేఆర్‌బీఎంబీకి తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాలను వాటాకు మించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాడేసిందని, ఇకముందు నీటిని తరలించకుండా అడ్డుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌బీఎంబీ)ను తెలంగాణ కోరింది. ఈ మేరకు కేఆర్‌ఎంబీ చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్ లేఖ రాశారు. కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి జలాశయాలకు 971.29 టీఎంసీల జలాలు రాగా.. ఆంధ్రప్రదేశ్ 619.047 టీఎంసీలు (74.45 శాతం), తెలంగాణ 212.885 టీఎంసీలు (25.55 శాతం) వినియోగించుకున్నాయని వివరించారు. ఉమ్మడి జలాశయాలు (శ్రీశైలం, నాగార్జునసాగర్)లలో ఏపీ ఇప్పటికే 38.723 టీఎంసీల నీటిని అదనంగా వాడుకుందని పేర్కొన్నారు. తెలంగాణకు 108.901 టీఎంసీల వాటా మిగిలి ఉందని గుర్తుచేశారు. ఇకపై ఉమ్మడి జలాశయాల నుంచి నీటిని ఏపీ తరలించకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి కృష్ణా డెల్టాకు రోజుకు 1 టీఎంసీ నీటిని తరలిస్తున్నారని.. తక్షణమే దీన్ని అడ్డుకోవాలని గణాంకాలతో సహా ఈఎన్‌సీ మురళీధర్ నివేదించారు.

కొత్తగా 25 కరోనా కేసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 3,996 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 25 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి 21 మంది కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది.

కేటీఆర్‌ను కలిసిన ప్రీతి కుటుంబసభ్యులు

అండగా ఉంటానని మంత్రి హామీ



కేటీఆర్ కాళ్లపై పడి న్యాయం చేయాలని వేడుకుంటున్న ప్రీతి కుటుంబ సభ్యులు

సాక్షి, మహబూబాబాద్/ వరంగల్ లీగల్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కాకతీయ వైద్య కళాశాల విద్యార్థిని ప్రీతి కుటుంబసభ్యులు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో బుధవారం మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ప్రీతి స్వగ్రామం పాలకుర్తి నియోజకవర్గంలోని గిర్నీతండా. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ప్రీతి తల్లిదండ్రులు నరేందర్, శారద తదితరులను ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో కేటీఆర్ దగ్గరికి తీసుకెళ్లారు. అంతకు ముందు ప్రీతి చిత్రపటానికి కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రీతి తల్లిదండ్రులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సైఫ్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

ప్రీతి మృతి కేసులో నిందితుడు సైఫ్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను వరంగల్ రెండో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి సత్యేంద్ర బుధవారం తిరస్కరించారు. నిందితుడు సైఫ్‌ను పోలీస్ కస్టడీ కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పిటిషన్ కూడా కోర్టు తిరస్కరించింది. రెండు గంటలకు పైగా సాగిన సుదీర్ఘ వాదనల అనంతరం ఉభయుల పిటిషన్లను తిరస్కరిస్తూ జడ్జి సత్యేంద్ర ఆదేశాలు జారీ చేశారు. బాధితులు నేరుగా కోర్టుకు విన్నవించే అవకాశంతో ప్రీతి తండ్రి నరేందర్.. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎం.సత్యనారాయణగౌడ్‌ను కలిశారు. కేసు పురోగతి, తన సందేహాలపై ఆయనతో చర్చించారు.

వన్ నేషన్.. వన్ దోస్త్

- దేశసంపదను అదానీకి అప్పగిస్తున్న ప్రధాని
- ప్రజల కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి అండగా ఉండాలి
- ప్రజలపై భారం మోపే మోదీకి కర్రుకాల్చి వాతపెట్టాలి
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్



తొర్రూరులో జరిగిన సభకు హాజరైన మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, మహబూబాబాద్: గత ఎన్నికల్లో దేశ ప్రధాని నరేంద్ర మోదీ వన్ నేషన్...వన్ రేషన్ అనే నినాదంతో ప్రజల ముగింటికి వచ్చారని, కానీ ప్రస్తుతం వన్ నేషన్.. వన్ దోస్త్‌గా వ్యవహరిస్తూ తన స్నేహితుడు అదానీకి రూ.వేల కోట్లు దోచిపెడుతున్నారని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రూ.14.75 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. జన్‌ధన్ ఖాతాలు ఓపెన్ చేస్తే ధనాధన్‌గా అకౌంట్లలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన పీఎం మోదీ ఎవ్వరికీ రూపాయి వేయలేదన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దీన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ఇక్కడ అమలవుతున్న పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు.

ఇక్కడ ఏ మంత్రి అయినా మాట్లాడతారు..

తెలంగాణ అభివృద్ధిని వివరించేందుకు ఇక్కడ ఏ మంత్రి అయినా గంటల కొద్దీ చెబుతారని.. మీరు ఏం చెప్పగలరని కేటీఆర్ బీజేపీ నేతలను ప్రశ్నించారు. నల్లధనం వెలికితీసి పేదలకు పంచుతామన్న ప్రధాని మోదీ... అదానీ వంటి బడా కంపెనీలకు అప్పజెప్పిన డబ్బులతో ఎమ్మెల్యేలను, ఎంపీలను కొని పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచినా తననెవరూ అడిగే వారు లేరని విర్రవీగుతున్న ప్రధానికి కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి పాటుపడుతున్నామని చెప్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తరలించింది నిజం కాదా అని నిలదీశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ములుగు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

మన ప్రభుత్వాన్ని కడుపులో పెట్టుకోవాలి

ప్రజలకు ఏం కావాలి.. ఏ పథకం అమలు చేస్తే ప్రజలు బాగుంటారని అనునిత్యం ఆలోచించే కేసీఆర్.. ఆయన నాయకత్వంలో పని చేస్తున్న మంత్రులంతా ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నామని కేటీఆర్ చెప్పారు. ప్రజల కోసం పాటుపడుతున్న నాయకులను, ప్రభుత్వాన్ని ప్రజలు కడుపులో పెట్టుకుని చూసుకోవాలని కోరారు. ఒకప్పుడు నేను రానుబిడ్డో అని పాటలు పాడుకున్న సర్కారీ దవాఖానాలకు ప్రజలు క్యూ కడుతున్నారని చెప్పారు. నాడు కరెంటు ఉంటే వార్త అని, ఇప్పుడు కరెంట్ పోతే వార్తగా మారిందన్నారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, ఆరూరి రమేష్, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యమే అతి గొప్ప కానుక, తృప్తియే అతి గొప్ప సంపద, విశ్వాసమే గొప్ప సంబంధం.

– బౌద్ధ ధర్మం

సాక్షి

గురువారం, మార్చి, 9

సవాలుకు సిద్ధమవుదాం!

గ్రీష్మ ఋతువు ఇంకా మొదలుకానే లేదు. కానీ శిశిరంలోనే, ఇంకా చెప్పాలంటే ఫిబ్రవరిలోనే గ్రీష్మ తాపం మొదలైపోయింది. 1901 నుంచి గత 122 ఏళ్ళలో ఎన్నడూ లేనంతటి సగటు పగటి ఉష్ణోగ్రత (29.54 డిగ్రీలు) ఫిబ్రవరిలో నమోదైంది. నిరుడు మార్చి కూడా ఇలాగే భారత ఉపఖండమంతటా చండ్రనిప్పులు చెరిగింది. దీన్ని బట్టి ఇక ఈ వేసవి ఎలా ఉండనుందో ఇప్పటికే అర్థమైపోయింది. దేశంలో ఇటు వేసవిలో, అటు శీతకాలంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. దేశంలో వాతావరణంపై అధ్యయనం చేసే 'సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ' (సీస్టెప్) ఈ సంగతి వెల్లడించింది. ఒక్కమాటలో వాతావరణ సంక్షోభం ఇక ఎప్పుడో నిజమయ్యే జోస్యం కానే కాదు. ఇప్పటికే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, ఆకస్మిక వర్షాలతో తరచూ సంభవిస్తున్న సంఘటన. ఈ వేసవిలో భానుప్రతాపం తీవ్రంగా ఉండనుందన్న హెచ్చరికలతో, స్వయంగా ప్రధాని మోదీ రంగంలోకి దిగి, ఈ సోమవారం నిపుణులతో సమావేశం జరపడం గమనార్హం.

గత రెండు దశాబ్దాల (2000 – 2019) డేటా చూస్తే, కనివిని ఎరుగని ఉష్ణోగ్రతలతో ప్రపంచ వ్యాప్తంగా ఏటా సగటున 50 లక్షల మంది మరణిస్తున్నారు. ఇది 2021 జూలైలో ప్రచురితమైన 'ది లాన్సెట్' అధ్యయనం తేల్చిన మాట. మన దేశంలోనే 7.4 లక్షల మంది చనిపోతున్నారు. దేశంలో వాతావరణ మార్పులతో దుర్మరణాలు 55 శాతం పెరిగాయి. ఇక, కేవలం 30 ఏళ్ళలో (1990 – 2019) వేసవిలో మన కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల నుంచి 0.9 డిగ్రీల మేర పెరిగాయి. దేశంలో నూటికి 54 జిల్లాల్లో చలికాలంలోనూ ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. చర్మాన్ని చీల్చే ఎండతో వ్యవసాయం సహా వాతావరణ ఆధారిత రంగాలు ప్రభావితమై, జీవనోపాధి దెబ్బ తింటోంది. దాదాపు 167.2 బిలియన్ పని గంటలు నష్టం. తక్కువ వర్షపాతం, ఎక్కువ ఉష్ణోగ్రతలతో గోదుమల దిగుబడి 2020–21తో పోలిస్తే 2021–22లో దాదాపు 30 లక్షల టన్నులు పడిపోయింది.

రానురానూ భూతాపోన్నతితో పాటు వడగాడ్పులు, పర్యవసానాలూ పెరుగుతాయని వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ సంఘం ఆరో అంచనా నివేదిక సారాంశం. ఈ నేపథ్యంలోనే ప్రకృతి వైపరీత్యాల ముప్పు తగ్గింపు జాతీయ వేదిక (ఎన్పీడీఆర్ఆర్) సైతం ఈసారి 'మారుతున్న వాతావరణానికి తగ్గట్టు స్థానిక సంసిద్ధత' అనే అంశాన్ని చేపట్టింది. రేపు శుక్రవారం జరిగే ఈ 3వ సదస్సును ప్రధానే ప్రారంభిస్తుండడం విశేషం. జోషీమఠ్‌లో భూపాతాలు సహా పలు అంశాలపై చర్యల్ని ఇందులో చర్చించనున్నారు. ముంచుకొస్తున్న మార్పులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం స్వాగతనీయం. వాతావరణ సవాలుపై చర్యలకు ప్రభుత్వనిధుల కేటాయింపు తగ్గిందన్న వార్తలే విషాదం.

పసిఫిక్ మహాసముద్రంలో పవనాల సహజ మార్పు వల్ల ఈ ఏడాది ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణ ధోరణుల్లో సంక్షోభం తప్పకపోవచ్చని శాస్త్రవేత్తల హెచ్చరిక. ఈ 2023లో ఉష్ణవాతావరణ ధోరణి అయిన ఎల్ నినో మళ్ళీ విరుచుకుపడే ప్రమాదం నూటికి తొంభై పాళ్ళుందట. అదే జరిగితే, ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల మేర పెరుగుతాయి. అంటే, ఈ శతాబ్దం చివరికి భూతాపోన్నతిని ఏ స్థాయికి నియంత్రించాలని ప్రపంచ నేతలు అంగీకరించారో ఆ చెలియలికట్టను ఇప్పుడే చేరుకుంటాం. దీనివల్ల 70 – 90 శాతం మేర పగడపు దిబ్బలు కనుమరుగైపోతాయట. ఇవన్నీ యావత్ ప్రపంచానికి, వ్యవసాయ ఆధారిత భారత్‌కు ప్రమాద ఘంటికలు. ఈ అత్యవసర పరిస్థితిని తట్టుకోవాలంటే 2030 కల్లా వర్ధమాన దేశాలు ఏటా 30 వేల కోట్ల డాలర్లు ఖర్చు చేయాలని ఐరాస అంచనా. ప్రపంచ జనాభాలో 12 శాతమే ఉన్నా, గ్రీన్ హౌస్ వాయువుల్లో 50 శాతానికి బాధ్యులైన ధనిక దేశాలు వర్ధమాన దేశాలకు అండగా నిలవాలి.

మన వద్ద మార్చి, మే మధ్య ఉష్ణపవనాలకు తోడు మరో సమస్య రానుంది. వినియోగం బాగా పెరిగే వేసవిలో విద్యుత్ కొరత సహజం. గత అయిదేళ్ళలో దేశంలో సౌర విద్యుదుత్పత్తి 4 రెట్లు పెరిగింది గనక నడిచిపోయింది. అది పగటివేళ వరకు ఓకే. కొత్తగా థర్మల్, హైడ్రోపవర్ సామర్థ్యాలను పెంచుకోనందు వల్ల రాత్రి వేళల్లో కష్టం కానుంది. ఈ వేసవి రాత్రుళ్ళలో గిరాకీ, సరఫరాల మధ్య 1.7 శాతం లోటు రానుంది. ఒక్కమాటలో, ఈ వేసవిలో రాత్రిపూట దేశంలో కరెంట్ కష్టాలు తీవ్రం కానున్నాయి. ఆందోళన పడాల్సింది లేదని ప్రభుత్వాధికారులు పైకి అంటున్నా, త్వరితగతిన థర్మల్, హైడ్రో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోకుంటే ఈ వేసవిలో ప్రజలకు కష్టాలు తప్పవు. ముఖ్యంగా రాత్రింబవళ్ళు నడిచే ఆటో, ఉక్కు, ఎరువుల తయారీ పరిశ్రమలు చిక్కుల్లో పడతాయి.

ముందే ఒక అంచనా రావడంతో నగర వ్యూహకర్తల మొదలు గ్రామీణ రైతుల దాకా అందరూ ఇప్పుడిక నష్టనివారణ చర్యలకు దిగాలి. భూ, జల నిర్వహణల్లో తగు మార్పులు చేసుకోవాలి. త్వరిత దిగుబడినిచ్చే కొత్త పంట రకాలపై రైతులకు మార్గదర్శనం చేయాలి. స్థానిక పాలనాయంత్రాంగాలు ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాలి. నీడనిచ్చే ఉద్యానాలు, నీటి వసతి లాంటి పరిష్కార మార్గాలు చూపాలి. అహ్మదాబాద్‌లో 2010లో గాడ్పులకు 1300కు పైగా మరణించాక, సిద్ధం చేసిన కార్యాచరణ ప్రణాళిక ఏటా 1200 మరణాల్ని నివారిస్తున్నట్టు అంచనా. అలాంటివి అంతటా అమలు చేయాలి. ఉష్ణతాపంతో తలెత్తే ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొనేలా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను సమాయత్తం చేయాలి. వాతావరణ సంక్షోభాలు ఇక నిత్యకృత్యం కానున్నందున వీటి దుష్ప్రభావాన్ని దీటుగా ఎదుర్కొనేలా పటిష్ఠమైన విధాన రూపకల్పనే పాలకుల తక్షణ కర్తవ్యం.

ఒక చారిత్రక ప్రణాళిక



మల్లెపల్లి లక్ష్మయ్య

మానవ జాతి చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన ఘట్టం – 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' వెలువడటం. ప్రపంచ నడకను ఈ సిద్ధాంతం సమూలంగా మార్చివేసింది. మానవ పురోభివృద్ధికి సరికొత్త దారులు వేసింది. 'ద కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' మొట్టమొదటగా వచ్చిన జర్మన్ భాషా ప్రచురణకు ఈ సంవత్సరం ఫిబ్రవరి 24న 175 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ సిద్ధాంత స్ఫూర్తితోనే రష్యా, చైనా విప్లవాలు మొదలుకొని ఎన్నో ప్రజాస్వామ్య విధానాలు అమలులోకి వచ్చాయి. భారత దేశంలో కూడా నేడు మనం అనుభవిస్తున్న జీవితాలు, అమలు జరుగుతున్న విధానాలు ఎన్నో కమ్యూనిస్టు భావజాల ప్రభావం నుంచి వచ్చాయంటే అతిశయోక్తి కాదు. దోపిడీ, అణచివేత ఉన్నంత వరకూ కమ్యూనిస్టు ప్రణాళిక సజీవ సిద్ధాంతంగానే ఉంటుంది.

''చెల్లాచెదురుగా ఉండే ప్రజలను, ఉత్పత్తి సాధనాలను, ఆస్తులను బూర్జువా వర్గం నిర్మూలిస్తున్నది. దీని ఫలితంగా రాజకీయ కేంద్రీకరణ ఏర్పడుతున్నది. బూర్జువా వర్గం తన గుత్తాధిపత్యాన్ని పెంచుకుంటున్నది. వివిధ ప్రయోజనాలను కలిగిన ప్రాంతాలను, స్వంత శాసనాలను, ప్రభుత్వాలను, పన్నులను కలిగి ఉన్న రాష్ట్రాలను తన ఆధిపత్యంలో ఒకే శాసనం, ఒకే జాతీయత, ఒకే భూ సరిహద్దు, ఒకే పన్నుల వ్యవస్థను రూపొందించి ఒకే జాతి ముద్దగా చేస్తున్నది.'' 1848 ఫిబ్రవరి 24న ప్రకటించిన 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో పేర్కొన్న విషయమిది.

అంతర్జాతీయ కార్మిక సమాఖ్య అయిన కమ్యూనిస్టు లీగు సంస్థ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికా రచన బాధ్యతను తమకు అప్పగించిందని ఈ ప్రణాళిక రచయితలు ఫ్రెడరిక్ ఎంగెల్స్, కారల్ మార్క్స్ 1872 నాటి ప్రచురణకు రాసిన ముందుమాటలో పేర్కొన్నారు. మొదట ఈ ప్రణాళిక జర్మన్ భాషలో రాశారు. ఆ తర్వాత రచయిత మిస్ హెలెన్ మెక్‌ఫర్లేన్ జర్మన్ నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించారు (మేనిఫెస్టో ఆఫ్ ద కమ్యూనిస్ట్ పార్టీ). ఇది 1850లో రెడ్ రిపబ్లికన్ పత్రికలో లండన్‌లో అచ్చయ్యింది. 1848 లోనే ఫ్రెంచిలో ఫ్రెంచి విప్లవానికి కొన్ని నెలల ముందు పారిస్‌లో అచ్చయింది. రష్యా, డేనిష్, పోలిష్ భాషలన్నింటిలోకీ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక అనువాదమైంది. మొదటిగా వచ్చిన జర్మన్ ప్రచురణకు ఈ సంవత్సరం ఫిబ్రవరి 24న 175 ఏళ్ళు పూర్తయ్యాయి.

కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ప్రభావం, పరిణామాల గురించి చెప్పాలంటే ఎన్ని పేజీలైనా సరిపోవు. ఇది మానవ జాతి చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన ఘట్టంగా, ప్రపంచ మార్గాన్ని నిర్దేశించిన సిద్ధాంత గ్రంథంగా నిలిచిపోయింది. అప్పటి వరకు ఉన్న ప్రపంచ నడకను ఈ సిద్ధాంతం సమూలంగా మార్చివేసింది. మానవ పురోభివృద్ధికి సరికొత్త దారులు వేసింది. అది కేవలం విప్లవ పోరాటాల జయకేతనం మాత్రమే కాదు, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక రంగాలను సంపూర్ణంగా మలుపు తిప్పింది. ఈ రచన సాగించే నాటికి కారల్ మార్క్స్ వయసు 29 ఏళ్ళు, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌కు 27 ఏళ్ళు మాత్రమే. ఇద్దరు నవ యువకులుగా ఉన్న సమయంలోనే పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులను పెకిలించే నవ సమాజ నిర్మాణానికి పునాదులు వేసే అద్భుతమైన సిద్ధాంత గ్రంథాన్ని ప్రపంచానికి అందించారు.

కారల్ మార్క్స్ అప్పటికే తొమ్మిదికి పైగా సిద్ధాంత గ్రంథాలను రాశారు. 1841లో 'ద డిఫరెన్స్ బిట్వీన్ డెమొక్రిటియన్ అండ్ ఎపిక్యురన్ ఫిలాసఫీ ఆఫ్ నేచర్' పేరుతో మొదలైన మార్క్స్ రచన, పరిశోధనల ప్రయాణం 1848కి వచ్చేసరికి కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను అందించింది. మార్క్స్ రచనలలో మరొక విశేషమైన రచన

కొత్త కోణం



'దాస్ కాపిటల్' మొదటిభాగం 1867లో వచ్చింది. మార్క్స్ తన జీవితం అంతా కార్మిక వర్గ ప్రయోజనాల కోసం మాత్రమే ఆలోచించినట్టు మనకు తెలుస్తున్నది. కమ్యూనిస్టు ప్రణాళిక ఒక రాజకీయ డాక్యుమెంటుగా కనిపించవచ్చు. కానీ అందులో తాత్విక సంవాదం ఎక్కువగా కనిపిస్తుంది. భూస్వామ్య సమాజంపై పెట్టుబడిదారీ విధానం విజయం సాధించి, సమాజంపై తన దుర్మార్గమైన దోపిడీ పంజాను విసురుతున్న తీరును కళ్ళకు కట్టినట్టుగా ఈ ప్రణాళిక చూపిస్తున్నది. దాదాపు డెబ్బై పేజీల రచనలో నాలుగు భాగాలున్నాయి. మొదటి భాగం: బూర్జువాలు– కార్మికులు. రెండవ భాగం: కార్మికులు – కమ్యూనిస్టులు. మూడవ భాగం: సామ్యవాద – కమ్యూనిస్టు సాహిత్యం. నాలుగవ భాగంలో వివిధ ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టుల వైఖరి ఉంటాయి.

ఇందులో మొదటి భాగం ముఖ్యమైనది. బూర్జువాలు– కార్మికులు అధ్యాయంలో ఆ రోజున్న సామాజిక స్వరూపాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థ దుర్మార్గాన్ని సంక్షిప్తంగా ప్రపంచం ముందుంచారు. ఈ రోజు మనం చూస్తున్న కార్పొరేట్ వ్యవస్థ దారుణమైన చర్యలను అత్యంత సూక్ష్మంగా వివరించారు. మొదటి పేరాలో పేర్కొన్న అంశం ఈ రోజు మనం చూస్తున్న ఆర్థిక, రాజకీయ వ్యవస్థకు అద్దం పడుతున్నది. ''ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం బూర్జువా వర్గపు వ్యవహారాలను నిర్వహించే ఒక యంత్రాంగంగా, అంగంగా మారిపోయింది'' అని పేర్కొన్నారు. ఇటీవల మన దేశపు కార్పొరేట్ కంపెనీలకు ప్రస్తుత ప్రభుత్వం ఒక సబార్డినేట్‌గా పనిచేస్తున్నదనడంలో ఎటువంటి సందేహం లేదు. అంతేకాకుండా, ''గతంలో ప్రజల భక్తి, గౌరవాలకు పాత్రమైన వృత్తులన్నింటినీ బూర్జువా వర్గం దిగజార్చింది. వైద్యులు, న్యాయవాదులు, కవులు, శాస్త్రవేత్తలను తన కింద పనిచేసే కూలివాళ్ళుగా మార్చి వేసింది'' అంటూ చేసిన వ్యాఖ్య మన కళ్ళ ముందు అత్యంత స్పష్టంగా అనుభవంలోకి వచ్చింది.

''యంత్రాలు విస్తృతంగా ఉపయోగంలోకి రావడం వల్ల కార్మికుల శ్రమలో వ్యక్తిగత ప్రత్యేకత పూర్తిగా అంతరించింది. కార్మికుడికి ప్రాధాన్యత కరువైంది. కార్మికుడు యంత్రానికి తోకగా మారిపోయాడు. అతనికి ఉండవలసింది చాకచక్యం మాత్రమే. గానుగెద్దులాంటి యంత్రంలో తానో యంత్రంగా మారిపోయాడు'' అంటూ చేసిన వివరణ ఈరోజు అత్యంత వాస్తవ దృశ్యంగా మనకు దర్శనమిస్తోంది. అది కార్మికుడికి కేవలం పొట్టపోసుకోవడానికి కావాల్సిన వసతులను మాత్రమే ఏర్పాటు చేస్తుందనీ, యంత్రాల వాడకమూ, శ్రమ విభజనా పెరిగే కొద్దీ కార్మికుడు తన ఉనికిని కోల్పోతాడనీ కమ్యూనిస్టు ప్రణాళిక ఆనాడే హెచ్చరించింది. దిగువ మధ్య తరగతివాళ్లు, చిన్న చిన్న వ్యాపారస్తులు, దుకాణదారులు, చేతి పనివాళ్ళు, రైతులు క్రమంగా తమ ఉపాధిని కోల్పోతారనీ, పెట్టుబడిదార్లతో పోటీ పడలేక దివాళా తీస్తారనీ కూడా కారల్ మార్క్స్, ఎంగెల్స్ ఆనాడే ప్రకటించారు. ఇప్పుడు ఇది మరింత తీవ్రమైంది. దాదాపు అన్ని రంగాల్లో ఒకరిద్దరు పెట్టుబడిదార్లు మాత్రమే తమ గుత్తాధిపత్యాన్ని చలాయిస్తున్నారు. ఇది అప్పటికన్నా ఇప్పుడు మరింతగా అసమానతలను తీవ్రతరం చేస్తున్నది.

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ పరిస్థితులను వివరించి మాత్రమే ఊరుకోలేదు. ఆనాటి బూర్జువా దోపిడీని స్పష్టంగా విశ్లేషించి, దానికి పోరాటాలు మాత్రమే పరిష్కారంగా చూపారు. సంఘర్షణ, పోరాటాలు లేకుండా సమాజం ప్రగతిని సాధించలేదని ప్రకటించారు. ఇందులోనే కార్మికవర్గం నాయకత్వాన్ని ప్రతిపాదించిన వర్గపోరాటాల చరిత్రను ఉదహరించారు. కార్మిక వర్గానికి ఒక సందేశాన్ని కూడా ఈ ప్రణాళికలోనే అందించారు. 'పోరాడితే పోయేది లేదు, బానిస సంకెళ్ళు తప్ప', 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' నినాదాలను ప్రపంచానికి ఆయుధాలుగా అందించారు.

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ అందించిన సిద్ధాంత స్ఫూర్తితో ప్రపంచంలో ఎన్నో గొప్ప మార్పులు వచ్చాయి. రష్యా, చైనా విప్లవాలు మొదలుకొని ఎన్నో ప్రజాస్వామ్య విధానాలు అమలులోకి వచ్చాయి. భారత దేశంలో కూడా ఈనాడు మనం అనుభవిస్తున్న జీవితాలు, అమలు జరుగుతున్న విధానాలు ఎన్నో కమ్యూనిస్టు భావజాల ప్రభావం నుంచి వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలో దోపిడీ, అణచివేత, అసమానత, వివక్షతలు ఉన్నంత వరకూ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక సజీవ సిద్ధాంతంగానే ఉంటుంది. ఇది అక్షర సత్యం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నేర్చుకోవాల్సిన పాఠాలు



స్వీడన్ పాఠాలు: స్వీడన్ లాక్‌డౌన్లు విధించలేదు, జనాలకు మాస్కుల్ని బలవంతం చేయలేదు, పాఠశాలల్ని మూసేయలేదు. అధికంగా కనబడే వారి మరణాలు యూరప్‌తో పోల్చితే అత్యల్పం. కోవిడ్‌కు స్వీడన్ స్పందనే సరైనదని ఇప్పుడు అర్థమవుతోంది. మిగతా ప్రపంచమే తప్పు.

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్టు న్యాయవాది

మహిళలకు సమానంగా...



యూఎస్‌లో మహిళలకు (ఎక్కువగా తెల్లవాళ్లు) 1920లో సమాన ఓటుహక్కు లభించింది. యూకే మహిళలకు అదే హక్కు 1928లో వచ్చింది. అదే సంవత్సరం భారత జాతీయ కాంగ్రెస్ మహిళలకు సమాన ఓటు హక్కు కోసం నిబద్ధురాలైంది. అది 1951–52లో వాస్తవ రూపం దాల్చింది.

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ఎంపీ

వెనకున్నది ఎవరు?



డేటా పాయింట్. దుబాయ్‌లో ఏ పేరూలేని ఒక ఉబర్ డ్రైవర్ అయిన అమృత్‌పాల్ సింగ్‌ను హఠాత్తుగా గతేడాది తదుపరి భింద్రన్‌వాలే స్థాయికి ఎక్కించేశారు. కచ్చితంగా ఎవరో ఈ పాత్రకు అతడిని పెంచిపోషించారు. దుబాయ్ వదిలిన తర్వాత, ఇండియా రావడానికి ముందు ఆయన ఎక్కడ ఆగాడో తెలుసా? జార్జియా. అక్కడ కూడా ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయి.

– దొరేస్వామి, వ్యాఖ్యాత

భాషలు రుద్దకూడదు



నేను ఏడు భాషలు మాట్లాడుతాను. ఒక భాషను నేర్చుకోవడం, మాట్లాడటం అంటే ఆ భాషా ప్రజలను గౌరవించడం. నేను పనిచేసే జనాల అందరి భాషలూ నేర్చుకున్నాను. నేను నా భాషను రుద్దను. కానీ ఎవరైనా నా భాషను అగౌరవపరిస్తే నేను దానికి వ్యతిరేకంగా నిలబడుతాను. హిందీని బలవంతంగా రుద్దడం ఆపాలి.

– ప్రకాశ్ రాజ్, నటుడు

ఫాసిస్టుల మీద పోరాడాలి

ఎన్నో పోరాటాలతో, త్యాగాలతో ప్రపంచంలో ప్రజాస్వామిక హక్కులు ఆవిష్కరించబడ్డాయి. నమ్మిన విశ్వాసాల కోసం నిలబడే స్వేచ్ఛ ప్రతి మనిషికీ ఉన్నది. అవి రాజకీయ విశ్వాసాలు కావచ్చు, ఇతర వ్యక్తిగత, మత ధార్మిక విశ్వాసాలూ కావచ్చు. లౌకిక, ప్రజాస్వామిక భావనలు కావచ్చు. 1789 ఫ్రెంచి విప్లవంలో మొదటగా 'ప్రజాస్వామ్యం' అనే నినాదం ఆవిష్కరించిన దగ్గర నుంచి, సమాజ పరిణామ క్రమంతోపాటు, ఆ భావన సైతం విస్తృతం, విశాలమైంది.

భారతదేశంలో ఆంగ్లేయుల వలస వాదానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యోద్యమం లౌకిక, ప్రజాస్వామిక విలువలను ప్రోది చేసింది. సకల మతాలు, కులాలు, విభిన్న సంస్కృతులు ఒకటిగా దేశ స్వాతంత్ర్యం కోసం సంఘర్షించాయి. భారత పాలక వర్గాలకు అధికారం వచ్చిన తర్వాత లౌకిక, ప్రజాస్వామిక పాలనను అందిస్తుందని ఎంతో విశ్వాసంతో ఆశించారు. భారత రాజ్యాంగం ఆ విలువలను ప్రతి మనిషికీ ఇస్తుందని, ప్రతి మనిషీ ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో జీవించే స్వేచ్ఛా వాయువులిస్తారని ఎంతగానో ఆశించారు.



కామ్రేడ్ రవన్న

భారత రాజ్యాంగంలో ఆమోదించిన కొద్దిపాటి హక్కులు కూడా ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఒక పక్క నిరుద్యోగం, పేదరికం, అసమానతలతోపాటు, సకల రంగాలలో సంక్షోభాలు ఎదురవుతున్నాయి. మరో పక్క మత ఉన్మాదం, మత విద్వేషం కట్టలు తెంచుకుని మంది మీద స్వైర విహారం చేస్తున్నది. ప్రగతి నిరోధక, సంకుచిత భావజాలం మనుషులను ఉన్మాదులుగా మారుస్తోంది. తిండి మీద, కట్టు బొట్టు మీద, విశ్వాసాల మీద, స్వేచ్ఛా హక్కుల మీద, భావ ప్రకటనల మీద ఆంక్షలు, నిషేధాజ్ఞలను విధిస్తున్నది. మొత్తంగా స్వాతంత్ర్యోద్యమం రూపొందించుకున్న రాజ్యాంగాన్నే ధ్వంసం చేసి, మనువాద రాజ్యాంగ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. విద్య, సంస్కృతి, చరిత్ర, వివిధ పౌర ప్రజాస్వామిక సంస్థలనూ, వ్యవస్థలనూ మొత్తం కాషాయీకరించి జర్మనీ తరహా నాజీయిజంను దేశంలో తీసుకువచ్చే యత్నాలు వేగంగా జరుగుతున్నాయి. కొద్ది మంది కుబేరుల; అమెరికా లాంటి సామ్రాజ్యవాదుల బడా పెట్టుబడి, ఫైనాన్స్ క్యాపిటల్‌తో... మోదీ, షాల పాలన దేశంలో ఫాసిజానికి బాటలు పరిచింది.

ఈ స్థితిలో ఫాసిస్టు వ్యతిరేక పోరాటం ప్రతీ ప్రజాస్వామికవాది, లౌకికవాది, కమ్యూనిస్టుల కర్తవ్యం కావాలి. యూరోప్‌లో తలెత్తిన ఫాసిజం పరిణామ క్రమం నుంచి నేటి బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిజం వరకు వివరంగా అర్థం చేసుకోవడానికి కామ్రేడ్ రవన్న 7వ వర్ధంతి సందర్భంగా ప్రసంగ పాఠాలు ఏర్పాటు చేశాం. దేశ భక్తియుత శక్తులతో, ప్రజాస్వామికవాదులతో ఫాసిస్టు వ్యతిరేక పోరాట కర్తవ్యాలను నిర్దేశించుకుని ఐక్య పోరాటాలు నిర్మిద్దాం. ఆ లక్ష్యసాధనలో భాగంగా ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నాం. జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నాం.

– సీపీఐ (ఎమ్ఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కమిటీ

(రేపు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ రవన్న స్మారక సదస్సు)

నాయకులే బాగుపడ్డారు...

అభిప్రాయం



కూరపాటి వెంకట నారాయణ

తెలంగాణ రాష్ట్రం వస్తే నిర్లక్ష్యానికి గురి అయిన సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కల్వకుంట్ల చంద్రశేఖర రావు వంటి వారు ప్రజలకు విశ్వాసం కలిగించారు. కానీ రాష్ట్రం ఏర్పడిన గత తొమ్మిదేళ్లలో పేద ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కాకపోవడమే కాదు, అవి మరింత దిగజారాయి.

రాష్ట్ర ప్రజలు గత ఎనిమిదేళ్లలో ఐదు లక్షల కోట్ల అప్పు భారాన్ని నెత్తికి ఎత్తుకోవలసి వచ్చింది. 8 ఏళ్ల వార్షిక బడ్జెట్ల మొత్తం 15 లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంలో పెద్ద మొత్తం కార్పొరేట్ కాంట్రాక్టర్లకు, రాజకీయ నాయకులకు, ఆధిపత్య వర్గాలకు, లంచగొండి అధికారులకు చేరిందని ఉద్యమకారులు, మేధావులు ఆవేదన చెందుతున్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు పెద్దపీట వేస్తున్నామని ప్రచారాలు చేస్తూ ఈ వ్యవస్థలన్నింటినీ నిర్లక్ష్యానికి గురిచేసి కోలుకోలేని దుఃస్థితికి ప్రస్తుత తెలంగాణ పాలకులు చేర్చారని ఆందోళన వ్యక్తమవుతోంది. పాలకపక్ష కుతంత్రాలతో చెక్కలు ముక్కలైన కొన్ని ప్రతిపక్షాలుకొంత కాలం స్తబ్దంగా ఉండడం వల్లా, అందులో చాలా మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు జంపు జిలానీలుగా మారి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం వల్లా... ప్రజల మౌలిక సమస్యలైన విద్యా, వైద్యం, ఉపాధి, వ్యవసాయ రంగాలు; పేదల ఇండ్ల నిర్మాణం, సామాజిక న్యాయం వంటివాటిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా గట్టిగా అడిగేవారు లేకుండా పోయారు.

2023 రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న కొలదీ ప్రతిపక్షాలు ప్రజల గొంతుకలై ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రారంభించాయి. 'కేజీ టు పీజీ' అని చెప్పి 900 గురుకులాలను అద్దె భవనాలలో ఏర్పాటు చేసి అరకొర వసతులు, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాలలను చూపించి ప్రభుత్వ వర్గాలు అద్భుత విజయం అన్నట్లు ప్రచారం చేస్తున్నాయి. కానీ గత ఎనిమిది ఏళ్లుగా రాష్ట్రంలోని 30 వేల ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు వేయికి పైగా; ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వందకు పైగా; డిగ్రీ కళాశాలలు, 11 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలవుతూ ఉన్నాయి. బాలికల టాయిలెట్స్ వంటి కనీస వసతులు లేని పరిస్థితిలో ఇవి ఉన్నాయి. ఎయిడెడ్ కళాశాలలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు... లైబ్రరీలు, హాస్టల్ వసతులు, అధ్యాపకుల నియామకాలు లేక చతికిలపడుతున్నాయి.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా కనీసం ప్రథమ చికిత్స చేయలేని అవస్థలో ఉన్నాయనటంలో అతిశయోక్తి లేదు. వీటిలో డాక్టర్లు, నర్సులు లేకపోవడం; మందుల కొరత కారణంగా పేదలకు వైద్యం అందడం లేదు. విద్య, వైద్యానికి కనీసం 30 నుండి 40 శాతం బడ్జెట్ కేటాయింపులు అవసరం ఉండగా కేవలం పది – పదిహేను శాతం కేటాయిస్తున్నారు. అయినా వాటినీ ఖర్చు పెట్టడం లేదని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

నిరుద్యోగ సమస్య ఏ మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ఉపాధి లభించక యుక్త వయస్సులో కూడా వివాహాలు జరగక మానసిక ఒత్తిడులకు గురై యువత నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతే... నాయకులు పదవులు పొంది కోటీశ్వరులవుతున్నారనేది ప్రధాన విమర్శ. 'నమ్మి నానపోస్తే పుచ్చి బుర్రలు అయినట్టు' మన తెలంగాణ ఉద్యమ నాయకులను నమ్మితే ఏం జరిగిందో ప్రజలు చవి చూశారు. తమకు మరోసారి ఇలాంటి చేదు అనుభవాలు ఎదురుకాకూడదని ప్రజలు ఆశిస్తున్నారు.

ప్రతిపక్షాలు అధికారానికి వస్తే భారీ ప్రాజెక్టుల ఖర్చుపై విచారణ చేస్తామనీ, 'ధరణి' వ్యవస్థను రద్దు చేస్తామనీ, హైదరాబాద్ భూముల అమ్మకాన్ని నిలిపివేస్తామనీ అంటున్నాయి. అదేవిధంగా ఉచితంగా... విద్య, వైద్యం; రైతుల రుణమాఫీ కూడా ప్రస్తావనకు వస్తున్నది. ఇలాంటి మాటలు, వాగ్దానాలు తెలంగాణ ఉద్యమం కాలంలోనే కాకుండా గత తొమ్మిది సంవత్సరాల నుండి కేసీఆర్ చేస్తూనే ఉన్నారు. వింటూనే ఉన్నాం. మళ్లీ ప్రజలు మోసపోకూడదని ప్రజాస్వామ్య వాదులూ, మేధావులూ అంటున్నారు.

వృద్ధాప్య ఆసరా పెన్షన్లు భార్యాభర్తలిద్దరికీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. చిన్నా చితక ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి తల్లి దండ్రులకు కూడా పెన్షన్లు ఇవ్వాలి. కళ్యాణ లక్ష్మికి బదులు ప్రతి పేద ఇంటిలో జన్మించిన ఆడపిల్లలకు నెల రోజుల లోపే కనీసం 20 వేల రూపాయలు డిపాజిట్ చేయాలి.

కౌలుదారులూ, పేద రైతులూ పండించే వరి, మొక్కజొన్న పంటలకు మార్కెట్ ధరతో పాటు క్వింటాల్‌కు అదనంగా 300 నుండి 500 రూపాయల వరకు బోనస్ చెల్లించాలి. లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలి. పంట నష్టానికి నష్టపరిహారం, ఇతర పనిముట్లకు సబ్సిడీలు పునఃప్రారంభించాలి. విద్య, వైద్య రంగంలో పాలకులు చెబుతున్న మాటలు కార్యరూపంలో పెట్టాలి. అప్పుడే ప్రజలకు ప్రభుత్వం పట్ల నమ్మకం కుదురుతుంది.

వ్యాసకర్త యూజీసీ ఎమెరిటస్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ

ఆత్మవిశ్వాసం ముఖ్యం

ఒకానొక జ్ఞాని ధ్యానం చేస్తున్న సమయమది. ఉన్నట్టుండి ఆయన ధ్యానానికి ఆటంకం కల్పిస్తూ ఓ చప్పుడు వినిపించింది. ఆయన కళ్ళు తెరచి చూసేసరికి ఎదురుగా ఓ చిట్టెలుక కనిపించింది. దానిని చూసి 'ఏం కావాలి' అని అడిగారు జ్ఞాని.

'పిల్లిని చూస్తే నాకు భయంగా ఉంది. నన్నొక పిల్లిగా మార్చి మీరు పుణ్యం కట్టుకోండి' అంది చిట్టెలుక. సరేనని జ్ఞాని వెంటనే ఆ చిట్టెలుకను పిల్లిగా మార్చేశారు. మూడు రోజుల తర్వాత మళ్ళీ జ్ఞాని ధ్యానానికి ఆటంకం కలిగింది. జ్ఞాని కళ్ళు తెరచి చూసేసరికి ఎదురుగా పిల్లి కనిపించి 'నన్ను ఓ కుక్క వెంటాడుతోంది, దాంతో ఏ కుక్కను చూసినా భయం నన్ను కలవరపరుస్తోంది. కనుక నన్ను ఇప్పటికిప్పుడు ఓ కుక్కగా మార్చేస్తే దర్జాగా బతుకుతాను' అంది. ఇంతేనా అంటూ జ్ఞాని ఆ పిల్లిని కుక్కగా మార్చేశారు.

జ్యోతిర్మయం

ఓ రోజు హఠాత్తుగా ఆ కుక్క... జ్ఞాని ముందు ప్రత్యక్షమైంది. 'ఏమిటీ, చాలా కాలా నికి వచ్చావు... ఏమైంది' అన్నారు జ్ఞాని. 'ఇప్పుడు నన్ను పులి భయం వెంటాడుతోంది. దయ చేసి నన్ను పులిగా మార్చేస్తే బాగుంటుంది' అంది కుక్క. సరేనని జ్ఞాని ఆ కుక్కను పులిగా మార్చేశారు.

చాలా నెలల తర్వాత ఆ పులి జ్ఞాని వద్దకు వచ్చి ఓ వేటగాడు తనను తరుముతున్నాడనీ కనుక ఒక వేటగాడిలా మార్చేస్తే బాగుంటుందనీ అంది. అలాగే అని జ్ఞాని దానిని ఓ వేటగాడిగా మార్చేశారు.

ఏడాదైంది. ఓరోజు ఆ వేటగాడు జ్ఞాని ముందు ప్రత్యక్ష మయ్యాడు. 'ఇప్పుడు నీకేం కావాలి' అడిగారు జ్ఞాని.

'నాకిప్పుడు మనుషులను చూస్తే భయమేస్తోంది' అంటూ ఏవేవో కారణాలు చెప్పడం మొదలుపెట్టాడు ఆ వేటగాడు. అప్పుడు జ్ఞాని అతని మాటలకు అడ్డు తగిలి... 'ఓ చిట్టెలుకా, నిన్ను ఎలా మారుస్తేనేం... నీ భయం నిన్ను వదిలిపోవడం లేదు. నీకున్నది చిట్టెలుక హృదయమే... నువ్వు చిట్టెలుకగా ఉండటమే అన్ని విధాలా సబబు' అని చెప్పేశారు. కనుక ఆత్మవిశ్వాసం లేకపోతే ఎన్ని అవకాశాలు వచ్చినా దేనినీ సాధించలేమనేది అందరూ గ్రహించాలి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.విదియ రా.8.04 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: హస్త తె.5.11 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి చిత్త, వర్జ్యం: ప.12.46 నుండి 2.27 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.11 నుండి 10.58 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: రా.10.51 నుండి 12.33 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.18, సూర్యాస్తమయం: 6.04.

క్లుప్తంగా...

ఆన్‌లైన్‌లో భద్రాద్రి 'నవమి' టికెట్లు

భద్రాచలం: భద్రాచలంలో ఈనెల 30న జరగనున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం, 31న నిర్వహించే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలను వీక్షించే భక్తుల కోసం సెక్టార్ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ఈవో రమాదేవి తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా కూడా టికెట్లు విక్రయించనున్నట్లు వివరించారు. ఉత్సవాలకు నేరుగా హాజరయ్యే అవకాశం లేని భక్తులు పరోక్షంగా గోత్ర నామాలతో కల్యాణం జరిపించుకునేందుకు రూ.5 వేలు, రూ.1,116 టికెట్లను వెబ్‌సైట్ ద్వారా, కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రూ.5 వేల రుసుముకు శ్రీస్వామి వారి మూలవరుల శాలువా, జాకెట్ ముక్క, కుంకుమ, తలంబ్రాలు, మిస్రీ ప్రసాదం పోస్టల్ లేదా కొరియర్ ద్వారా పంపిస్తామని తెలిపారు. రూ.1,116 టికెట్ తీసుకున్న వారికి శ్రీస్వామి వారి కల్యాణ కండువా, జాకెట్ ముక్క, కుంకుమ, తలంబ్రాలు, మిస్రీ ప్రసాదం పంపుతామని పేర్కొన్నారు. టికెట్ల కోసం భక్తులు WWW.bhadrachalamonline.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉరితాళ్లతో మహిళల నిరసన


ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న మహిళలు

అక్కన్నపేట (హుస్నాబాద్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితుల్లోని వివాహితలు బుధవారం ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కొందరు మహిళలు మోకాళ్లపై నిలబడి.. చేతులు జోడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నెలల తరబడి నిరసన తెలుపుతున్నా.. ఈ ప్రభుత్వానికి ఆడబిడ్డల గోస పట్టదా? అని ప్రశ్నించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. మరోపక్క, గుడాటిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మూసివేత, కట్ట నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

నవ వధువుది ఆత్మహత్యే..


పూర్ణిమ (ఫైల్)

ఖలీల్‌వాడి: ఈ నెల 2న నిజామాబాద్ సుభాష్‌నగర్‌లోని సుధా హైట్స్ అపార్ట్‌మెంట్ పైనుంచి పడి చనిపోయిన పూర్ణిమ (26)ది ఆత్మహత్యేనని టౌన్ సీఐ వెంకట నారాయణ తెలిపారు. భర్త వేధింపులు తాళలేక ఆమె బలవన్మరణానికి పాల్పడిందని, భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వివరాలివి. రెండు నెలల క్రితం హమాల్‌వాడికి చెందిన పూర్ణిమకు, విశాల్‌తో వివాహం జరిగింది. పూర్ణిమ ఐటీసీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ.. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంట్లోనే ఉంటోంది. భర్త విశాల్ బిల్డింగ్ కాంట్రాక్ట్ వ్యాపారం చేస్తున్నాడు. పెళ్లయిన రెండు నెలల్లోపే.. పూర్ణిమ నివసిస్తున్న అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు పైనుంచి పడి చనిపోవడంపై.. ఆమె కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం జరిపిన విచారణలో పూర్ణిమను భర్త విశాల్ వేధించేవాడని వెల్లడైంది. అపార్ట్‌మెంట్‌లోని సీసీ పుటేజ్, చుట్టుపక్కల వారిని విచారించాక ఆమెది ఆత్మహత్యగా నిర్ధారించి.. భర్తపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉత్తమ సేవలకు ప్రాచుర్యం కల్పించాలి


డీజీపీని కలిసిన మహిళ పాత్రికేయులు

సాక్షి, హైదరాబాద్: మహిళా పోలీస్ అధికారులు అందిస్తున్న ఉత్తమ సేవలకు మీడియా ద్వారా ప్రాచుర్యం కల్పించాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రింట్, ఎలక్ట్రానిక్, న్యూస్ గ్రూప్‌లకు చెందిన పలువురు మహిళా జర్నలిస్టులను డీజీపీ అభినందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళా జర్నలిస్టులతో డీజీపీ తన కార్యాలయంలో భేటీ అయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీలు మహేష్‌భగవత్, సంజయ్‌కుమార్ జైన్, విజయ్‌కుమార్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, తరుణ్ జోషి, డీఐజీ ఎం.రమేష్ పాల్గొన్నారు. డీజీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో కొన్నేళ్లుగా మహిళల నియామకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులు.. మహిళా జర్నలిస్టుల పని విధానం, వేధింపుల నిరోధానికి ఉన్న అంతర్గత కమిటీల పనితీరుపై మాట్లాడారు. కోవిడ్-2ను ఎదుర్కోవడానికి పోలీస్ శాఖ చేపట్టిన చర్యలను తెలిపే కాఫీటేబుల్ బుక్‌ను జర్నలిస్టులకు డీజీపీ బహూకరించారు.

మాది చతుర్ముఖ వ్యూహం

మేం 72 స్థానాల్లో గెలుస్తాం • బీఆర్ఎస్‌కు 25కి మించి రావు... • 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో గెలుపొందేందుకు అవసరమైన వ్యూహాలు, అంచనాలు తమకున్నాయని, ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఎ. రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పాలసీ, క్యాలుక్యులేషన్, కమ్యూనికేషన్, ఎగ్జిక్యూషన్ (పీసీసీఈ) అనే చతుర్ముఖ వ్యూహంతో తాము ముందుకెళుతున్నామని ఆయన చెప్పారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 72 స్థానాలు వస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు 25కి మించిరావని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీల డీఎన్ఏ ఒక్కటే అన్న రేవంత్, టీఆర్ఎస్, కేసీఆర్‌లు గతమని వ్యాఖ్యానించారు.

• హాథ్‌సే హాథ్‌జోడో యాత్రల్లో భాగంగా గురువారం కరీంనగర్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో అనేక అంశాలపై ఆయన మాట్లాడారు. రేవంత్ ఏమన్నారంటే...!



మాతో పోటీపడే వారు లేరు

పార్టీ సభ్యత్వ నమోదును మేం క్యాజువల్‌గా తీసుకోలేదు. చాలా క్యాలుక్యులేటెడ్‌గా చేశాం. ఈ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ గెలవాలన్నా 80లక్షల ఓట్లు అవసరమని మా అంచనా. 75-80 లక్షల ఓట్ల వరకు వస్తే గెలుస్తాం. మా పార్టీలో 43 లక్షల మంది సభ్యులుగా చేరారు. రాష్ట్రంలోని 36,594 పోలింగ్ బూత్‌లలో 42వేల మందిని బూత్ ఎన్‌రోలర్స్‌గా చేర్చాం. పార్టీ సానుభూతిపరులు, కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలనుకునే వారు కాకుండానే 43 లక్షల మంది కాంగ్రెస్ పార్టీలో బాహాటంగానే సభ్యత్వం తీసుకున్నారు.

ఫిరాయింపులే వారికి టాస్క్

రాష్ట్రంలో మాతో పోటీ పడే ప్రధాన రాజకీయ పక్షాలయిన బీఆర్ఎస్, బీజేపీల డీఎన్ఏ ఒక్కటే. రూ. వేల కోట్లు పెట్టి ఎన్నికలు చేయడంలో, ఫిరాయింపులను ప్రోత్సహించడంలో ఆ రెండు పార్టీలది ఒకటే వైఖరి. ఎన్నికల హామీలు, మేనిఫెస్టో అమలు ఏ పార్టీకయినా ఒక టాస్క్ లాంటిది. కానీ ఆరెండు పార్టీలకు ఫిరాయింపులే ప్రధాన టాస్క్. గతంలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ గురించి మాట్లాడేవాళ్లు కాదు. వాళ్లకి బీజేపీనే పోటీ అన్నట్టు వ్యవహరించే వాళ్లు. కానీ, హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రల తర్వాత పరిస్థితి మారింది. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మా తోక పట్టుకుని నడిచే పరిస్థితి వచ్చింది. యాత్రలో భాగంగా నేను ఎక్కడకు వెళ్తే కేటీఆర్ అక్కడకు వెళ్తున్నారు.

శైవం మీద దాడి కాదా..?

కేసీఆర్‌కు వైష్ణవం మీద నమ్మకం ఉండొచ్చు కానీ శైవంమీద దాడి చేయకూడదు. శ్మశానాలను కూడా వదలకుండా వైష్ణవాన్ని రుద్దే ప్రయత్నం చేశాడు. శ్మశానాలంటే శైవ కేంద్రాలు కానీ వాటికి వైకుంఠ ధామాలు అని పేరు పెట్టాడు. కేసీఆర్ హయాంలో ఆచారాల శాశ్వత విధ్వంసం జరుగుతోంది.

అప్పుడేం చెప్పారు? ఇప్పుడేం చేస్తున్నారు?

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో చేసిన పనులకు, చెప్పిన మాటలకు పూర్తి భిన్నంగా ఇప్పుడు కేసీఆర్, బీఆర్ఎస్ వైఖరి ఉంది. గతంలో ద్రోహులు, దుర్మార్గులు, తెలంగాణ వ్యతిరేకులుగా చిత్రీకరించిన వారందరినీ ఇప్పుడు వెంట పెట్టుకుని తిరుగుతున్నారు.

కేసీఆర్ ముసలోడయ్యాడు

ఇప్పుడు టీఆర్ఎస్, కేసీఆర్ అనేది గతం. తాను ముసలోడిని అయ్యానని ఆయనే చెపుతున్నాడు. ఆ పార్టీ మంత్రులు కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలంటున్నారు. అందుకే ఆ పార్టీ విషయంలో టీఆర్ఎస్-కేసీఆర్‌లు గతం, బీఆర్ఎస్-కేటీఆర్‌లే భవిష్యత్తు. కేటీఆర్ తండ్రి చాటు బిడ్డ. ఇక, బీజేపీ విషయంలో బండి సంజయ్ ప్రజలతో సంబంధం లేని వ్యక్తి. గత 23 ఏళ్లుగా ప్రజల మధ్యన ఉంటూ, తొమ్మిదేళ్ల కాలంలో టీఆర్ఎస్, కేసీఆర్‌లతో కొట్లాడిన రేవంత్‌ను చూడండి. ఈ మూడు కాంబినేషన్లను చూసి ఓట్లు ఎవరికి వేయాలో ప్రజలు నిర్ణయించుకోవాలి.

మాకు 38శాతానికి పైగానే ఓట్లు

వచ్చే ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై మా అంచనాలు మాకున్నాయి. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ కేవలం 25 స్థానాల్లోపే పరిమితం అవుతుంది. ఆ పార్టీకి 28-32 శాతం ఓట్లు మాత్రమే వస్తాయి. బీజేపీకి 12-13 శాతం ఓట్లు వస్తాయి కానీ, సీట్లు సింగిల్ డిజిట్‌కు మించవు. ఎంఐఎం మళ్లీ 3.5 శాతం ఓట్లతో 7-8 స్థానాలకే పరిమితం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ 38శాతం కంటే ఎక్కువ ఓట్లతో 72 స్థానాల్లో గెలుస్తుంది.

మొదటి దశ యాత్రలు పూర్తయ్యాకే

కరీంనగర్‌లో కాంగ్రెస్ పని అయిపోయింది. అంతా బీజేపీనే అన్నారు. ఇప్పుడు నేను హాథ్‌సే హాథ్‌జోడో యాత్రలకు వెళ్తుంటే వేలాది మంది స్వచ్ఛందంగా వస్తున్నారు. మొదటి దశలో భాగంగా మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్ పార్లమెంటు స్థానాల్లో నేను యాత్ర చేస్తా. ఆ తర్వాత ఏం చేయాలన్నది పార్టీ నేతలందరం కూర్చుని నిర్ణయించుకుంటాం. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గొడవలూ లేవు. అందరం కలిసే ఉన్నాం. నా యాత్రకు అందరూ వస్తారు.'అని చెప్పారు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి.

60 మంది దాకా అభ్యర్థులు ఖరారయ్యారు

అభ్యర్థుల విషయానికి వస్తే మా పార్టీలో 50 శాతానికిపైగా అభ్యర్థులు ఇప్పటికే ఖరారయినట్టే. చాలా చోట్ల పోటీ చేసే అభ్యర్థుల విషయంలో స్పష్టత ఉంది. 60మందికి పైగా నేతల పేర్లు ప్రకటించడమే తరువాయి. వారంతా ఎవరి పని వారు చేసుకుంటున్నారు.

కేసీఆర్ పాలన మహిళలకు ల్యాండ్‌మైన్

- బయటకు అడుగుపెడితే ఏం జరుగుతుందోనని మహిళల్లో ఆందోళన
- మహిళా కమిషన్ ఒక డమ్మీ వ్యవస్థ.. గవర్నర్‌కే గౌరవం లేదు
- ట్యాంక్‌బండ్‌పై ధర్నా కార్యక్రమంలో వైఎస్ షర్మిల ధ్వజం
- అనుమతి లేదంటూ అరెస్టు చేసిన పోలీసులు


ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం మహిళలకు ఒక ల్యాండ్‌మైన్‌లా తయారయ్యిందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ఎక్కడ బయటకు అడుగేస్తే ఎవరు వేధిస్తారోననే భయం మహిళల్లో నెలకొందన్నారు. బంగారు తెలంగాణలో మహిళలకు రక్షణ కరువైందని, రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళలకు రక్షణ కరువైందని నిరసిస్తూ ట్యాంక్‌బండ్‌పై నల్లబ్యాడ్జీలతో షర్మిల మౌనదీక్ష చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలకు సంబంధించి వేల కేసులు నమోదయ్యాయన్నారు. ఆయా ఘటనలకు పాల్పడిన వారిలో ఎక్కువగా బీఆర్ఎస్ కార్యకర్తలే ఉన్నారని ఆమె ఆరోపించారు. సీఎం కేసీఆర్‌ను మహిళా ద్రోహిగా అభివర్ణించారు. రాష్ట్రంలో మహిళా కమిషన్ డమ్మీగా మారిందని, ఒక మహిళా గవర్నర్‌కు కనీస గౌరవం సైతం లభించడం లేదని ఆక్షేపించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కవిత, చైతన్యారెడ్డి, కల్పనాగాయత్రీ, ఝాన్సీరెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కోఆర్డినేటర్ వాడుక రాజ్‌గోపాల్, అధికార ప్రతినిధి గట్టు రాంచందర్‌రావు పాల్గొన్నారు. కాగా, దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు షర్మిలను అరెస్టు చేశారు. కాగా, దీక్షకు ముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫిలింనగర్‌లో బుధవారం చాకలి ఐలమ్మ విగ్రహానికి వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు షర్మిల పూలమాల వేసి నివాళులర్పించారు.

షర్మిల 'బస్తీబాట' వాయిదా:..

వైఎస్ షర్మిల తలపెట్టిన గ్రేటర్ హైదరాబాద్ బస్తీ బాటపై ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆ పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గ్రేటర్ అధ్యక్షుడు వాడుక రాజగోపాల్ ఆరోపించారు. గురువారం చేపట్టాల్సిన పాదయాత్రకు పోలీసులు అనుమతిని నిరాకరించడంతో బస్తీబాట వాయిదా పడిందన్నారు.

బీసీ, ఎస్సీలను అవమానిస్తారా?

- ఖమ్మం టీడీపీలో భగ్గుమన్న విభేదాలు
- మహిళా దినోత్సవాల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ

ఖమ్మం అర్బన్: ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జ్ కాట్రగడ్డ ప్రసూన సమక్షంలో నిర్వహించిన కార్యక్రమం రసాభాసగా మారి మూడు గంటల పాటు ఉద్రిక్తతకు దారితీసింది. టీడీపీ నాయకురాలు రజని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు పార్టీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లును పిలవలేదని, ఫ్లెక్సీలో ఆయన ఫొటో కూడా పెట్టకుండా అవమానించారని తెలుగు యువత అధ్యక్షుడు నల్లమల రంజిత్, మరికొందరు నిలదీయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరస్పరం దాడులు చేసుకోవడంతో రంజిత్, మరికొందరికి స్వల్పగాయాలు కావడంతో పాటు చొక్కాలు చిరిగాయి. రాష్ట్ర నాయకురాలు ప్రసూన పార్టీని భ్రష్టు పట్టించేలా వ్యవహరిస్తున్నారని, ఎస్సీ, బీసీలను కూడా ఆసభ్యకరంగా దూషించారని రంజిత్ వర్గం కార్యకర్తలు ఆరోపించారు. ప్రసూన క్షమాపణ చెబితేనే ఆమె కారును కదలనిస్తామంటూ వాహనం ఎదుట కూర్చుని నినాదాలు చేశారు. అయితే మహిళా దినోత్సవం రోజున ఓ మహిళ అని కూడా చూడకుండా కుట్ర పూరితంగా దాడి చేశారంటూ ప్రసూన సైతం పార్టీ కార్యాలయంలోనే మూడు గంటల పాటు ఉన్నారు. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న రంజిత్‌తో పాటు మరికొందరిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు.

మహిళలను మరింత గౌరవించాలి

- మహిళా దినోత్సవాల్లో మంత్రి సత్యవతి రాథోడ్
- 27 మంది మహిళలకు రాష్ట్రస్థాయి అవార్డులు ప్రదానం


బెలూన్లు వదిలి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: సృష్టిలో స్త్రీ లేకపోతే జీవం లేదని, జనన, గమనాలకు మూలం స్త్రీలేనని రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. సమాజంలో మార్పులు రావాలని, కుటుంబ పోషణతోపాటు సమాజ అభ్యున్నతికి పాటుపడుతున్న మహిళలను ఇంకా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, అతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, శాసనమండలి ఉప సభాపతి డాక్టర్ బండ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆరోగ్యలక్ష్మి ప్రతి జిల్లాలోని ఐదు సెంటర్లలో నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని 1200 సెంటర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, మహిళలకు అందించే ఒక్కో కిట్‌లో రూ.4వేల విలువ గల ఆహార వస్తువులు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన 27 మందిని ఎంపిక చేయగా, వారిలో ఒక్కొక్కరికి రూ.లక్ష చెక్కును అందజేసి, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందరరాజు యాదవ్, కేయూ ఉపకులపతి టి.రమేష్, జెడ్పీ చైర్మన్లు డాక్టర్ సుధీర్, అంగోతు బిందు, గండ్ర జ్యోతి, రాష్ట్ర సంగీత అకాడమీ చైర్మన్ దీప్తి రెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనర్ భారతి హోలీ కేరి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ప్రతిష్ట మంటగలిపారు

• కవితపై బీజేపీ నేత గూడూరు ధ్వజం


కార్మికురాలి పాదాలు కడుగుతున్న గూడూరు నారాయణరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్ర రాష్ట్ర మహిళల ప్రతిష్టను మంటగలిపిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నేత గూడూరు నారాయణరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన బుధవారం భువనగిరి మున్సిపల్ మహిళా కార్మికుల పాదాలు కడిగారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న మద్యం వినియోగాన్ని నిర్మూలించాలని పోరాడకుండా కవిత లిక్కర్ స్కాంలో చిక్కుకున్నారని ధ్వజమెత్తారు. దురదృష్టవశాత్తూ రాష్ట్రానికి చెందిన ఏకైక మహిళగా కవితను ప్రభుత్వం పరిగణిస్తోందని, రాష్ట్రంలోని రెండు కోట్ల మందికిపైగా మహిళల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. వరంగల్‌లో మెడికో ప్రీతి మృతిపై పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలివి తక్కువగా మాట్లాడారని ఆరోపించారు. మహిళల సంక్షేమానికి కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయట్లేదన్నారు. అనంతరం ఆయన భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని మహిళా కార్మికులకు సర్టిఫికెట్లు, చీరలను అందజేశారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'కొండగట్టు' దొంగల అరెస్ట్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాశ్

మల్యాల(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వసతి గృహాల్లో మంగళవారం ఉదయం చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రమణమూర్తి, ఎస్సై చిరంజీవితో కలిసి డీఎస్పీ ప్రకాశ్ వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన దూలం శశాంక్, తోకల నితిన్, ఎనగందుల పవన్‌చందు, మరో ఇద్దరు మైనర్లు జల్సాలకు అలవాటు పడ్డారు. హోలీ సందర్భంగా కొండగట్టులో దొంగతనం చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఓ కారును అద్దెకు తీసుకుని అంజన్న సన్నిధికి చేరారు. మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో భక్తులు స్వామివారి దర్శనానికి వెళ్లగా.. మారుతీ నిలయంలోని 11, 16 నంబర్ల గదుల తాళాలు పగులగొట్టారు. భక్తుడు సంధానవేని సంతోష్‌కు చెందిన సెల్‌ఫోన్, అసోంకు చెందిన సంజీత్‌దాస్‌కు చెందిన మరో మొబైల్ ఫోన్, గోదావరిఖనికి చెందిన గుగులోత్ రమేశ్‌కు చెందిన మరో ఫోన్‌తో పాటు రూ.నాలుగు వేల నగదు అపహరించారు. దీంతో సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. దొంగలమర్రి చెక్‌పోస్టు వద్ద సీఐ, ఎస్సై ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఈ ఐదుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని విచారించగా చోరీ చేసింది వారేనని తేలింది. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లోనే దొంగలను పట్టుకున్న సీఐ రమణమూర్తి, ఎస్సై చిరంజీవిని డీఎస్పీ ప్రకాశ్ అభినందించారు.

నేడు కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ సభ

• హాజరు కానున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భగేల్, ఏఐసీసీ నేత జైరాం రమేశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ కేంద్రంగా గురువారం కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగసభ నిర్వహిస్తోంది. హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా తొలిదశలో మూడు పార్లమెంటు నియోజకవర్గాల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి యాత్రలు పూర్తయిన సందర్భంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. సభకు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్‌భగేల్, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తదితరులు హాజరు కానున్నారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే ఈ సభకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత తరుణంలో విద్య, వైద్యం, స్టార్టప్స్ తదితర రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తరుణి క్లాతింగ్ సంస్థ డైరెక్టర్ దివేష్ మాల్వే తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని వీ హబ్ వేదికగా తరుణి క్లాతింగ్ ఆధ్వర్యంలో 'సమానమైన భవిష్యత్తును సృష్టించడం కోసం మహిళా నాయకుల దృక్పథం' అనే అంశంపైన చర్చ నిర్వహించారు.

క్లుప్తంగా...

నారీ శక్తికి సలాం: మోదీ

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రగతిలో మహిళలు అమూల్య పాత్ర పోషిస్తున్నారంటూ కొనియాడారు. మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందంటూ ట్వీట్ చేశారు. మన్ కీ బాత్‌లో క్రోడీకరించిన మహిళల స్ఫూర్తి గాథలను షేర్ చేశారు. నారీశక్తి ఫర్ న్యూ ఇండియా అంటూ హాష్‌ట్యాగ్ జత చేశారు. భారత మహిళల స్ఫూర్తిదాయకత్వంపై 'హర్ స్టోరీ, మై స్టోరీ...' శీర్షికతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాసిన వ్యాసాన్ని కూడా ప్రధాని షేర్ చేశారు. ''త్రిపుర నుంచి తిరిగొస్తూ వ్యాసం చదివా. ఎంతో స్ఫూర్తిదాయకంగా అనిపించింది. అతి సాధారణ స్థాయి నుంచి దేశ అత్యున్నత అధికార పీఠం దాకా ఎదిగిన ఒక స్ఫూర్తిదాయక మహిళ ప్రయాణాన్ని కళ్లకు కట్టిన ఆ వ్యాసాన్ని అందరూ చదవాలి'' అని సూచించారు. అన్ని రంగాల్లోనూ దేశాభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర అంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ కూడా కొనియాడారు.

సిసోడియాకు ప్రాణ హాని

నేరగాళ్లతో కలిపి ఉంచారు: ఆప్

న్యూఢిల్లీ: మద్యం విధానం కేసులో అరెస్టైన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాకు తిహార్ జైల్లో ప్రాణ హాని ఉందని పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన్ను ఒకటో నంబర్ జైల్లో కరడుగట్టిన నేరగాళ్లతో కలిపి ఉంచారని ఆప్ అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. ''ధ్యానం చేసుకోవడానికి వీలుగా విపాసన సెల్‌లో ఉంచాలన్న సిసోడియా విజ్ఞప్తి చేశారు. అందుకు కోర్టు కూడా సమ్మతించినా జైలు అధికారులు మాత్రం తోసిపుచ్చారు'' అని విమర్శించారు. దీనిపై కేంద్రం బదులివ్వాలని తీరాలన్నారు. ఆప్ ఆరోపణలను జైలు వర్గాలు తోసిపుచ్చాయి. ''సిసోడియాతో పాటున్న ఖైదీల్లో అంతా సత్ప్రవర్తన గలవారే. గ్యాంగ్‌స్టర్లెవరూ లేరు'' అని చెప్పాయి.

ఇరాన్‌లో 'బాలికలకు విషం'... యునెస్కో ఆందోళన

దుబాయ్: ఇరాన్‌లో ను విద్యకు దూరం చేసేందుకు వారి స్కూళ్లపైకి విష వాయువులు వదులుతున్న ఉదంతాలపై యునెస్కో ఆందోళన వెలిబుచ్చింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరింది. స్కూళ్లలో బాలికలకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని సూచించింది. ఇరాన్‌లో జరుగుతున్న పరిణామాలను తన మనసును తీవ్రంగా కలచివేస్తున్నాయని యునెస్కో సారథి ఆడ్రే అజౌలే అన్నారు.

రైలెక్కి రయ్.. రయ్...

విమానాల కంటే మేలు • రైలు ప్రయాణాలకే జనం మొగ్గు • యూరప్‌లో కొత్త పోకడ



ఇంటి నుంచి కాలు బయట పెడితే విమానాలు ఎక్కడమే వారికి తెలుసు. రయ్యిమంటూ గాల్లో తేలిపోతూ గమ్యస్థానాలకు చేరుకోవడాన్ని ఇష్టపడతారు. అలాంటిది ఇప్పుడు వారిలో కూడా మార్పు వస్తోంది. హాయిగా రాత్రిపూట రైలెక్కి బెర్త్ వాల్చితే ఉదయానికల్లా ఊరు చేరుకోవడంలో ఎంత సదుపాయముందో యూరప్ వాసులు గ్రహించారు. చుకు బుకు చుకు బుకు రైలును, అదిరిపోయే దాని స్టైలును, ఆ ప్రయాణంలోని మజాను ఆస్వాదిస్తున్నారు. విమాన ప్రయాణాలతో పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి యూరప్‌లో పలు దేశాలు కూడా రైలు ప్రయాణాలకు ప్రజలను ప్రోత్సహిస్తున్నాయి. దాంతో వారు కూడా తక్కువ దూరాలకు విమానానికి బదులుగా రైలు వైపే మొగ్గు చూపిస్తున్నారు...

యూరప్‌లో రైలు ప్రయాణాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని డచ్ విమానయాన సంస్థ కేఎల్ఎమ్ వంటివి రైలు రవాణా నెట్‌వర్క్‌లో భాగస్వాములవుతున్నాయి. యూరోపియన్ కమిషన్ కూడా 2021ని ఇయర్ ఆఫ్ యూరోపియన్ రైల్‌గా ప్రకటించి రైలు ప్రయాణికులకు భారీగా ప్రోత్సాహకాలు కల్పించింది. హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టడం, రైలు టికెట్ ధరల్ని తగ్గించడం వంటి చర్యలతో ఇప్పుడు చాలామంది రైలు జర్నీయే సో బెటరని అంటున్నారు. ముఖ్యంగా స్వల్ప దూర ప్రయాణాలకు రైళ్లల్లో వెళ్లడానికి యూరప్ పౌరుల్లో 62% మంది ఇష్టపడుతున్నారని తాజా సర్వేలో తేలింది. 1990 తర్వాత మళ్లీ ఇప్పుడు రాత్రిళ్లు ప్రయాణించే స్లీపర్ రైళ్లకు హఠాత్తుగా డిమాండ్ పెరిగింది.

ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాలు...

యూరప్‌లో విమాన ప్రయాణాల వల్ల వెలువడుతున్న కాలుష్యం ఏటా పెరుగుతూనే ఉంది. ఈ పెరుగుదల 2013–2019 మధ్య ఏడాదికి సగటున 5% చొప్పున నమోదైంది! ఈ నేపథ్యంలో యూరప్ దేశాలు కేవలం స్వల్ప దూరాల విమానాలను మాత్రమే నిరుత్సాహపరుస్తూ అధిక దూరం ప్రయాణించే విమానాలకు ప్రోత్సాహకాలు కొనసాగించడాన్ని పర్యావరణవేత్తలు వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల వచ్చే పెద్దగా ఒరిగేదేమీ ఉండదంటూ పెదవి విరుస్తున్నారు.

వాటి కాలుష్యమే అధికం

ప్రపంచవ్యాప్తంగా అధిక దూరాలు ప్రయాణించే విమానాల నుంచి వెలువడే కాలుష్యమే ఎక్కువ! జర్నల్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ జియోగ్రఫీ తాజా నివేదిక ప్రకారం 500 కి.మీ. కంటే తక్కువ దూరం ప్రయాణించే విమానాల యూరోపియన్ యూనియన్‌లో 27.9 % కాగా వాటి నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు 5.9%. 4 వేల కి.మీ. కంటే అధిక దూరం వెళ్లే విమానాలు కేవలం 6.2% మాత్రమే. కానీ వాటినుంచి వెలువడే కాలుష్యం ఏకంగా 47 శాతం! అలాంటప్పుడు కేవలం తక్కువ దూరాలు ప్రయాణించే విమానాల రద్దుతో ఒరిగే ప్రయోజనాలేమిటన్న ప్రశ్న వినిపిస్తోంది.

రైల్వేలకున్న అడ్డంకులివే..!

కొన్ని దశాబ్దాలుగా విమాన ప్రయాణానికే అలవాటు పడడంతో చాలా మార్గాల్లో రైలు సదుపాయం లేదు. కొత్త ట్రాక్‌లు నిర్మించడం, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచడం వంటి చర్యలు ఇంకా తీసుకోవాల్సి ఉంది. చాలా దేశాల్లో విమాన ప్రయాణాల కంటే రైలు ప్రయాణాలు ఎక్కువ ఖరీదు. అధిక చార్జీలు కూడా రైలు ప్రయాణానికి అడ్డంకిగా మారింది. యూరప్ రైలు ఆపరేటర్లకు లాభార్జనే ధ్యేయం. మార్కెట్ షేర్ కంటే అధిక లాభాలు ప్రజల నుంచి గుంజాలని చూస్తుంటాయి. ఇవన్నీ రైల్వేల విస్తరణకు అడ్డంకిగా మారుతున్నాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఫ్లైట్ షేమ్ ఉద్యమంతో దశ మారిన రైల్వే

యూరప్‌లో ప్రజలు రైలు ప్రయాణానికి మొగ్గుచూపించడానికి ఫ్లైట్ షేమ్ ఉద్యమం ప్రధాన కారణం. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి స్వీడన్‌కు చెందిన టీనేజ్ ఉద్యమకారిణి గ్రేటా థెన్‌బర్గ్ 2019లో ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్య రాజ్యసమితి పర్యావరణ సదస్సుకి హాజరవడానికి ఆమె విమాన ప్రయాణం చెయ్యకుండా అట్లాంటిక్ సముద్రంలో నౌకలో కొద్ది రోజుల పాటు ప్రయాణించి మరీ అమెరికా చేరుకున్నారు. విమానం నడపడానికి భారీగా చమురు ఖర్చు చేయడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని అందుకే విమానానికి బదులుగా పడవలు, రైళ్లు, బస్సుల్లో ప్రయాణించాలని గ్రేటా థెన్‌బర్గ్ పిలుపునిచ్చారు. ఈ ఉద్యమ ప్రభావంతో యూరప్ వాసులు విమానాలకి బదులుగా రైలు ప్రయాణంపై ఆసక్తి చూపించడం మొదలుపెట్టారు.

యూరప్ దేశాలు తీసుకుంటున్న చర్యలివే...

- జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, స్పెయిన్, ఇటలీ వంటి దేశాలన్నీ రైలు ప్రయాణానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.
- తక్కువ దూరం ఉండే మార్గాల్లో ఫ్రాన్స్ ప్రభుత్వం విమానాలను రద్దు చేసింది. ఆయా మార్గాల్లో కొత్త రైళ్లను నడపడం ప్రారంభించింది.
- రెండున్నర గంటల కంటే తక్కువ సమయం పట్టే రెండు ఊళ్ల మధ్య రైళ్లలోనే ప్రయాణం చేయడం తప్పనిసరి చేసింది.
- దీని వల్ల దేశీయంగా విమానం ద్వారా వెలువడే గ్రీన్‌హౌస్ వాయువుల్ని 3% తగ్గించగలిగింది.
- 2020లో ఆస్ట్రియా ప్రభుత్వం రైలులో ప్రయాణిస్తే మూడు గంటల కంటే తక్కువ సమయం పట్టే అన్ని మార్గాల్లోనూ విమానాలను రద్దు చేసింది.
- ఆస్ట్రియాలో 350 కి.మీ. కంటే తక్కువ దూరం విమానాల్లో వెళ్లే ప్రయాణికుల నుంచి 30 యూరోల పన్ను వసూలు చేస్తోంది.
- మరోవైపు 2050 నాటికి 2.5 గంటల కంటే తక్కువ సమయాల్లో వెళ్లే విమానాలన్నీ రద్దు చేయడానికి స్పెయిన్ సన్నాహాలు చేస్తోంది.

బాల్యంలో నిమోనియా బారిన పడితే...

పెద్దయ్యాక ఇన్ఫెక్షన్ల ముప్పు



లండన్: బాల్యంలో నిమోనియా వంటివాటి బారిన పడ్డవారికి పెద్దయ్యాక శ్వాసపరమైన ఇన్ఫెక్షన్ల ముప్పు అధికమని ఓ అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా 26 నుంచి 73 ఏళ్ల మధ్య వయసులో శ్వాస సంబంధిత సమస్యలతో మరణించే ప్రమాదమూ ఎక్కువేనని అది తేల్చింది. ''రెండేళ్లు, అంత కంటే తక్కువ వయసులో బ్రాంకైటిస్, నిమోనియా వంటివాటి బారిన పడేవారిలో పెద్దయ్యాక శ్వాస సంబంధిత వ్యాధులతో అకాల మరణం సంభవించే ఆస్కారం ఇతరులతో పోలిస్తే 93 శాతం ఎక్కువ'' అని వివరించింది. దీర్ఘకాలిక శ్వాస సమస్యలు పెద్ద ఆరోగ్య సమస్యగా మారాయి. వీటివల్ల 2017లో ప్రపంచవ్యాప్తంగా 39 లక్షల మంది మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో చాలా మరణాలకు క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) కారణమని అధ్యయనం పేర్కొంది. అందుకే శ్వాస సంబంధిత సమస్యలను చిన్నతనంలోనే సంపూర్ణంగా నయం చేయడంపై మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉందని అధ్యయనానికి సారథ్యం వహించిన ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్‌కు చెందిన జేమ్స్ అలిన్సన్ అభిప్రాయపడ్డారు. దీని ఫలితాలు ద లాన్సెట్ జర్నల్లో ప్రచురితమయ్యాయి.

అంగారకుడిపై సూర్యకిరణాలు



వాషింగ్టన్: ఫొటోలో కనిపిస్తున్నవేమిటో తెలుసా? అంగారకునిపై కనువిందు చేస్తున్న సూర్య కిరణాలు. కుజ గ్రహంపై సూర్య కిరణాలు మన కంటపడటం ఇదే తొలిసారి! మార్స్‌పై పరిశోధనలు చేస్తున్న క్యూరియాసిటీ రోవర్ తాజాగా వీటిని తన కెమెరాలో బంధించింది. దిగంతాల మీదుగా సూర్యుడు అస్తమిస్తున్న క్రమంలో మేఘాలన్నింటినీ ప్రకాశవంతం చేస్తున్న తీరును ఫొటోలో గమనించవచ్చు. కుజునిపై మేఘాలు ఉపరితలానికి 60 కిలోమీటర్ల ఎత్తున నీరు, మంచుతో కూడి ఉన్నాయని నాసా అంచనా. కుజ గ్రహాన్ని వాసయోగ్యం చేసుకుని అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలకు కేంద్రంగా మార్చుకోవాలని అమెరికా భావిస్తోంది. ఈ క్రమంలో అక్కడి వాతావరణం, దాని కూర్పు, ఇతర స్థితిగతులను తెలుసుకోవడానికి దాని మేఘాలను విశ్లేషించడం కీలకం.



గాయపడ్డ సైనికులకు సహాయ చర్యలందించే డ్రిల్స్‌లో పాల్గొన్న బ్రిటన్ యువరాణి కేట్ మిడిల్టన్. ఐరిష్ గార్డ్స్‌లో కల్నల్‌గా నియమితురాలైన నేపథ్యంలో ఆమె తాజాగా ఇలా 1వ బెటాలియన్‌ను సందర్శించారు.

రెండోసారి త్రిపుర సీఎంగా మాణిక్ సాహా



కార్యక్రమంలో సీఎం సాహాతో ప్రధాని మోదీ

అగర్తలా: త్రిపుర ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి బీజేపీ నేత మాణిక్ సాహా ప్రమాణస్వీకారం చేశారు. అగర్తలాలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో సాహా చేత రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్య ప్రమాణం చేయించారు. సాహాతోపాటు మరో ఎనిమిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. 60 సీట్లున్న త్రిపుర అసెంబ్లీలో బీజేపీ 32 స్థానాల్లో గెలిచి మెజారిటీ మార్కును సాధించి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాహాను ప్రధాని అభినందించారు. మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో ముగ్గురు గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు, బీజేపీ కూటమి పార్టీ ఇండీజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) పార్టీ నేత కూడా ఉన్నారు. సీఎం రేసులో ఉన్నట్లు వార్తలొచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్యే ప్రతిమా బౌమిక్ కేబినెట్‌లో చేరలేదు. ఎన్నికల తర్వాత హింసాత్మక ఘటనలకు నిరసనగా విపక్ష వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించాయి.

తిప్రా మోతా చీఫ్‌తో షా భేటీ

'గ్రేటర్ తిప్రాల్యాండ్' సాధన కోసం ఉద్యమసంస్థగా మొదలై తర్వాత రాజకీయ పార్టీగా మారిన తిప్రా మోతా తరఫున ఆరుగురు సభ్యుల ప్రతినిధుల బృందం బీజేపీ అగ్రనేత అమిత్ షాతో భేటీ అయింది. అగర్తలాలో మొదలైన భేటీలో తిప్రా మోతా చీఫ్ ప్రద్యోత్ కిశోర్ దేవ్ బర్మన్, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, నూతన సీఎం మాణిక్ సాహా సైతం పాల్గొన్నారు. చిన్న రాష్ట్రాన్ని ముక్కలు చేయబోమని, త్రిపుర ట్రైబల్ అటానమస్ కౌన్సిల్‌కు శాసన, ఆర్థిక, కార్యనిర్వాహక అధికారాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని బీజేపీ మొదట్నుంచీ చెబుతున్న విషయం తెల్సిందే.

పూర్తిగా మహిళా సిబ్బందితో 90 విమాన సర్వీసులు

న్యూఢిల్లీ: ఆకాశంలో సగం అనే నారీశక్తి నినాదానికి మరింత మద్దతు పలికింది ఎయిర్‌ఇండియా. మార్చి ఒకటోతేదీ నుంచి 90 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను పూర్తి మహిళా సిబ్బందితోనే నడిపింది! బుధవారం సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. తమ మొత్తం 1,825 మంది పైలెట్లలో 15 శాతం మంది అంటే 275 మంది పైలెట్లు మహిళలేనని పేర్కొంది. ఎయిర్‌ఇండియా మొత్తం సిబ్బందిలో 40 శాతానికిపైగా నారీమణులే ఉండటం విశేషం. కాక్‌పిట్ క్రూలో 15 శాతం అతివలే. 'ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ మంది కమర్షియల్ ఉమెన్ పైలెట్లు ఉన్న దేశం భారత్' అని ఎయిర్ ఇండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ చెప్పారు. 'వైమానిక రంగ సంబంధ వృత్తులను ఎంచుకుంటున్న భారతీయ మహిళల సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించగలిగే అవకాశం వచ్చింది' అని ఆయన అన్నారు.

మెరుగైన స్నేహబంధం కోసం

ఎదురుచూస్తున్నాం

ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ భారత పర్యటనపై మోదీ



బుధవారం గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో హోలీ వేడుకలో అల్బనీస్

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: భారత్– ఆస్ట్రేలియా బలీయ స్నేహబంధం కోసం ఎదురుచూస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా బుధవారం అహ్మదాబాద్ చేరుకున్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్‌నుద్దేశిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం అహ్మదాబాద్ చేరుకున్న అల్బనీస్ నేరుగా సబర్మతీ ఆశ్రమానికి వెళ్లి మహాత్మునికి నివాళులర్పించారు. 'వాణిజ్యం, భద్రత వంటి అంశాల్లో క్రియాశీలకంగా ఉన్న భారత్‌తో బహుముఖ బంధాలను బలపరుచుకునేందుకు ఆస్ట్రేలియాకు లభించిన అద్భుత అవకాశం ఇది. నూతన సాంకేతికత, ఆవిష్కరణలకు చోదక శక్తి భారత్. మా దేశంలో పెద్దసంఖ్యలో వైవిధ్య భారత్, ఆస్ట్రేలియా ప్రజల వల్లే మా దేశం ఇంతగా అభివృద్ధి చెందింది' అని భారత్‌కు విచ్చేసిన సందర్భంగా అల్బనీస్ వ్యాఖ్యానించారు.

భారతీయ డిగ్రీలకు ఆస్ట్రేలియాలో గుర్తింపు

'ఆస్ట్రేలియా–భారత్ విద్యార్హత గుర్తింపు వ్యవస్థ'ను అందుబాటులోకి తెస్తున్నట్లు అల్బనీస్ ప్రకటించారు. అంటే ఆస్ట్రేలియా చదువుకుంటున్న, చదివిన భారతీయ విద్యార్థుల డిగ్రీలను ఇండియాలో అనుమతిస్తారు. అలాగే భారత్‌లో చదివిన డిగ్రీనీ ఆస్ట్రేలియాలో గుర్తింపునకు అనుమతిస్తారు. మరోవైపు గాంధీనగర్‌లోని గిఫ్ట్ సిటీలో ఆస్ట్రేలియాకు చెందిన డీకెన్ యూనివర్సిటీ తన అంతర్జాతీయ బ్రాంచ్ క్యాంపస్‌ను నెలకొల్పనుంది. ఆస్ట్రేలియా నాలుగేళ్లపాటు చదవనున్న భారతీయ విద్యార్థులకు 'మైత్రి' పేరిట ఉపకారవేతనం సైతం అందిస్తామని అల్బనీస్ చెప్పారు.

నేడు మోదీతో కలిసి టెస్ట్ మ్యాచ్ వీక్షణ

బుధవారం గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో కలిసి హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం అహ్మదాబాద్‌లోని మోతెరా నిర్మించిన నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియా నాలుగో టెస్ట్ మ్యాచ్ తొలి రోజు ఆటను ప్రధాని మోదీతో కలిసి వీక్షిస్తారు. అల్బనీస్‌తో కలిసి మ్యాచ్ చూసేందుకు మోదీ సైతం బుధవారమే అహ్మదాబాద్ చేరుకున్నారు. తర్వాత అల్బనీస్ ముంబై చేరుకుంటారు. శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ముర్మును మర్యాదపూర్వకంగా కలుస్తారు. తర్వాత మోదీతోపాటు ఇరుదేశాల వార్షిక సదస్సులో పాల్గొంటారు. సమగ్ర వ్యూహాత్మక ఒప్పందం తదితరాలపై చర్చించనున్నారు. ప్రధానిగా అల్బనీస్‌కు ఇదే తొలి భారత పర్యటన.

మళ్లీ కశ్మీర్‌పై పాక్ ఏడుపు

ఐరాస వేదికగా ప్రస్తావన • దీటుగా తిప్పికొట్టిన భారత్

ఐక్యరాజ్య సమితి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో జరిగిన ఒక చర్చాకార్యక్రమంలోనూ కశ్మీర్ అంశాన్ని లేవదీసి పాకిస్తాన్ భారత్‌పై తన అక్కసును మరోసారి వెళ్లబోసుకుంది. దీంతో భారత్ ఘాటుగా స్పందించింది. పాకిస్తాన్ చేసే ద్వేషపూరిత, తప్పుడు ప్రచారాలకు కనీసం స్పందించాల్సిన అవసరం తమకు లేదని భారత్ తేల్చిచెప్పింది. నెలపాటు మొజాంబిక్ దేశ అధ్యక్షతన ఐరాస భద్రతా మండలిలో సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులోభాగంగానే ' మహిళలు, శాంతి, భద్రత' అంశంపై చర్చలో పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ అసంబద్ధంగా జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రసంగించారు. ఆ తర్వాత ఐరాస భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంభోజ్ మాట్లాడారు. ' బిలావల్ వ్యాఖ్యానాలు పూర్తిగా నిరాధారం. పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో చేసిన ప్రసంగమిది. మహిళలకు భద్రతపై చర్చాకార్యక్రమాన్ని మేం గౌరవిస్తున్నాం. మహిళా దినోత్సవ కాల విలువకు గుర్తించాం. ఈ అంశంపైనే మనం దృష్టిసారిద్దాం. అసందర్భంగా పాక్ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలపై కనీసం స్పందించాల్సిన అగత్యం భారత్‌కు లేదు. గతంలో చెప్పాం. ఇప్పుడూ, ఇకమీదటా చెప్పేది ఒక్కటే. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమే. దాయాదిదేశం పాక్‌తో పొరుగుదేశ సంబంధాలను సాధారణస్థాయిలో కొనసాగించాలని భారత్ మొదట్నుంచీ ఆశిస్తోంది. అలాంటి వాతావరణం నెలకొనేలా చూడాల్సిన బాధ్యత పాక్‌పై ఉంది. కానీ ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారి శత్రుత్వాన్ని పెంచుకుంటోంది' అని రుచిరా ఘాటుగా వ్యాఖ్యానించారు. పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ బలగాలపై దారుణ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని బాలాకోట్‌లో కొనసాగుతున్న జైషే మొహమ్మద్ ఉగ్ర శిబిరంపై భారత వాయుసేన మెరుపుదాడి తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా విడదీశాక భారత్‌పై పాక్ ఆక్రోశం మరింతగా ఎగసింది.

ఫారిన్ ఏజెంట్ బిల్లుపై రణరంగంగా జార్జియా

తిబ్లిస్: జార్జియా ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఒక బిల్లు రణరంగానికి దారితీసింది. ఆ బిల్లుని వ్యతిరేకిస్తూ నిరసనకారులు రాజధాని తిబ్లిస్‌లోని పార్లమెంటు భవనాన్ని ముట్టడించారు. నిరసనకారుల్ని అడ్డుకోవడానికి పోలీసులు వాటర్ కెనాన్లు ప్రయోగించడంతో పరిస్థితులు అదుపు తప్పాయి. పోలీసులకు, నిరసనకారులకి మధ్య జరిగిన ఘర్షణలో 50 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు. ప్రతిపక్ష నాయకుడు జురాబ్ జపారిడ్జ్ సహా 66 మందిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. జురాబ్‌ను బాగా కొట్టినట్టుగా కూడా వార్తలు వెలువడ్డాయి. జార్జియా ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుపై స్వదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దీని ప్రకారం 20 శాతానికి పైగా విదేశీ నిధులు కలిగిన స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలు తమని తాము విదేశీ ఏజెంట్లుగా ప్రకటించుకోవాల్సి ఉంటుంది. అలా ప్రకటించుకోకపోతే జైలు శిక్షతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తారు.

సంయుక్త నిసార్ ఇస్రో చేతికి

బెంగళూరు: అమెరికాకు చెందిన నాసా, భారత్‌కు చెందిన ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ఉపగ్రహం ఇస్రో చెంతకు చేరింది. నాసా–ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్(నిసార్)ను అమెరికాలోని కాలిఫోర్నియాలో తయారుచేయగా ఆ దేశ వాయుసేనకు చెందిన సీ–17 విమానం దానిని బెంగళూరుకు తీసుకొచ్చింది. ' నిసార్ భారత్‌కు బుధవారం వచ్చేసింది. ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ తుది ఇంటిగ్రేషన్ మొదలైంది' అని చెన్నైలోని అమెరికా కాన్సులేట్ జనరల్ బుధవారం ట్వీట్ చేసింది. వ్యవసాయ సంబంధ మ్యాపింగ్, కొండచరియలు విరిగే ప్రమాదమున్న ప్రాంతాల గుర్తింపు తదితరాల కోసం నిసార్‌ను వినియోగించనుంది. ఏపీలోని సతీశ్ ధవన్ అంతరిక్ష ప్రయోగం కేంద్రం నుంచి వచ్చే ఏడాదిలో ఈ ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించనుంది.



ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ నివాసంలో ఆయనతో పాటు హోలీ సంబరాల్లో పాల్గొన్న విదేశాంగ మంత్రి జైశంకర్, అమెరికా వాణిజ్య మంత్రి గినా రైమాండో



బుధవారం అహ్మదాబాద్‌లో అంబరాన్నంటిన హోలీ వేడుకలు

రోజంతా కేజ్రీవాల్ ధ్యానం

గాంధీ విగ్రహం వద్ద నివాళులు



న్యూఢిల్లీ: దేశాభ్యున్నతి కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం రోజంతా ధ్యానం, పూజలు, ప్రార్థనలు చేశారు. అవి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం దాకా కొనసాగినట్టు ఆప్ ట్వీట్ చేసింది. అంతకుముందు ఉదయం ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీ సమాధిని కేజ్రీవాల్ సందర్శించి నివాళులర్పించారు. హోలీ సందర్భంగా దేశం కోసం ప్రార్థనలు చేస్తానని కేజ్రీవాల్ మంగళవారమే పేర్కొన్నారు. దేశం కోసం మంచి పనులు చేస్తున్న వారిని జైళ్లపాలు చేస్తున్నారని, దోచుకుంటున్న వారిని మాత్రం వదిలేస్తున్నారని ఆరోపించారు.

సాక్షి కరీంనగర్
గురువారం । 9 । మార్చి । 2023

విశిష్ట పురస్కారం

రాష్ట్ర మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధరంగాల్లో విశిష్టసేవలు అందించిన 27మంది మహిళలకు అవార్డులు, రూ.లక్ష నగదు, ప్రశంసపత్రం అందించారు. కరీంనగర్ జిల్లా నుంచి సాహిత్యం విభాగంలో నినాదబట్ల అరుణ అవార్డు అందుకున్నారు.






ఉమెన్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు







మంత్రులు గంగుల కమలాకర్, హరీశ్‌రావు చేతుల మీదుగా సారె అందుకుంటున్న మహిళా ఆఫీసర్లు శ్వేతామహంతి, గరిమా అగర్వాల్, ప్రియాంక, జువేరియా, సబితా కుమారి

కడుపు కోతలు వద్దు

- మహిళలకు మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి
- కరీంనగర్‌లో ఆరోగ్య మహిళ పథకం ప్రారంభం
- క్రిటికల్‌కేర్ యూనిట్‌కు శంకుస్థాపన
- జిల్లా ఆస్పత్రిలో రేడియాలజీ హబ్ ప్రారంభం, ఎంఆర్‌ఐ స్కాన్‌కు హామీ
- ఆడబిడ్డల కళ్లలో ఆనందం కోసం అద్భుత పథకం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల



బుట్టిరాజారాంకాలనీ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ పథకం లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్: ముహూర్తాల పేరుతో సిజేరియన్లు చేపిస్తే అటు తల్లికి, ఇటు బిడ్డకు నష్టాన్ని చేకూరుస్తుందని... అత్యవసరమైతే తప్ప కడుపు కోతలు చేయించవద్దని తల్లులకు వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో అత్యధికంగా జరుగుతున్న సిజేరియన్లపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న కాన్పుల్లో 90 శాతం సిజేరియన్లే చేస్తున్నారని అన్నారు. తల్లి ఆరోగ్యం దెబ్బతిని భవిష్యత్తులో గర్భసంచి తొలగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన చెందారు. వీటన్నింటిని అధిగమించేందుకే మహిళా దినోత్సవ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' పథకాన్ని ప్రకటించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలుకానున్న ఈ కార్యక్రమం కరీంనగర్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. బుధవారం కరీంనగర్ పట్టణంలోని బుట్టిరాజారాం కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో 50 అదనపు పడకలు, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో 100 అదనపు పడకలను, తెలంగాణ డయాగ్నోస్టిక్ అనుబంధ రేడియాలజీ హబ్‌ను ప్రారంభించారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలో నిర్మాణం చేయబోయే క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.

పేద మహిళల కోసమే ఆరోగ్య పథకం

మార్క్‌ఫెడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి మహిళలు తాము పడుతున్న ఆరోగ్య సమస్యలు భర్తలకు, బయటకు చెప్పుకోవడానికి బిడియ పడుతుంటారని, కొందరు ఆర్థిక ఇబ్బందులు, మరికొందరు ఆస్పత్రిలో మగ డాక్టర్లకు సమస్యలు చెప్పుకోలేక హాస్పిటల్‌కు వెళ్లడమే మానేశారని అన్నారు. ఇలాంటి వారికోసమే ఆరోగ్య మహిళ పథకం ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. మహిళలు సాధారణంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల సమస్యలకు వైద్య సేవలు, 57 రకాల పరీక్షలు చేస్తామని అన్నారు. సర్జరీలు, ఇతర అడ్వాన్స్‌డ్ వైద్య పరీక్షల కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశామని, తల్లి బాగుంటేనే కుటుంబం బాగుంటుందన్న ఆశయంతో ఈ పథకం ప్రారంభిస్తున్నామన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఆడబిడ్డ కళ్లలో ఆనందం చూడాలని..

రాష్ట్ర పౌరసరఫరాలు, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఆడబిడ్డ కళ్లల్లో ఆనందం చూడాలని ఆరోగ్య మహిళ అనే అద్భుతమైన పథకం చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్ ది అని అన్నారు. ఈ పథకాన్ని కరీంనగర్ గడ్డ నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందని, ప్రపంచంలోని ఏ దేశంలో కూడా అమలు చేయని గొప్ప పథకం ఇది అని కొనియాడారు. ఈ ఒక్కరోజు కాదు ప్రతిరోజు మహిళా దినోత్సవం కావాలని ఆకాంక్షించారు.

మహిళా అధికారులకు సన్మానం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్వేతా మహంతి, అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్న మాల, డీఆర్‌డీవో శ్రీలత, డీసీవో శ్రీమాల, డీఎంవో పద్మావతి, రిసోర్స్ పర్సన్స్‌లను చీరసారెతో ఘనంగా సన్మానించారు. మేయర్ సునీల్‌రావు, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, సీపీ సుబ్బరాయుడు, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్, అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ ప్రచార బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, కమలాకర్, తదితరులు



మార్క్‌ఫెడ్ మైదానంలో సభకు హాజరైన మహిళలు

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

కరీంనగర్‌టౌన్: హార్ట్ ఎటాక్ బారిన పడుతున్న వారిని తక్షణమే కాపాడే విధానం సీపీఆర్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని వైద్య, ఆరోగ్యమంత్రి హరీశ్‌రావు తెలిపారు. జిల్లాకేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి సౌజన్యంతో నిర్వహించే కార్డియాక్‌హెల్త్ స్క్రీనింగ్, మీ గుండె పదిలం అనే కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో కరోనా తరువాత ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు చేసుకుంటూ.. కార్డియాక్ అరెస్ట్, హార్ట్‌ఎటాక్ వంటి హృద్రోగ సమస్యలు వస్తున్నాయని అన్నారు. సీపీఆర్ విధానం ద్వారా ఛాతి పైభాగంలో నొక్కడం, నోటిద్వారా శ్వాస అందించడం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని యువతకు గుండెపరీక్షలు, మందులు అందించేందుకు ముందుకు వచ్చిన మంత్రి కమలాకర్‌ను అభినందించారు. మంత్రి కమలాకర్ మాట్లాడుతూ.. కార్డియాక్ అరెస్ట్ కారణంగానే కొన్ని నెలలక్రితం వాకింగ్‌కు వెళ్లిన తన సోదరుడు చనిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. తనవద్ద ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత ఉన్నా ఏం చేయలేని పరిస్థితి ఎదురైందన్నారు. యువత గుండె పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హుజూరాబాద్ అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గందె రాధిక

హుజూరాబాద్: మున్సిపల్ పాలకవర్గ సభ్యులు రాజకీయాలు పక్కనపెట్టి హుజూరాబాద్ పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక కోరారు. పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 8మంది కౌన్సిలర్లు హాజరైనప్పటికీ మున్సిపల్ యాక్ట్ జీవో 216 ఆధారంగా తనకు ఉన్న అధికారాలను ఉపయోగించి 64అంశాలకు గాను 59అంశాలను ఆమోదించినట్లు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలో రూ.4 లక్షలతో కుక్కలను, కోతులను పట్టుకోవడం, పట్టణం, విలీన గ్రామాల్లోని ఏడు ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలకు రూ.1.25లక్షలు కేటాయించారు. ఉగాదికి పట్టణంలోని పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లకు రూ.30,200, వేసవి దృష్ట్యా గ్రీన్‌షెడ్ల ఏర్పాటుకు రూ. రూ.2 లక్షలు కేటాయించేందుకు ఆమోదించారు. వేసవిలో మొక్కలకు నీటిని అందించేందుకు రూ.3.50 లక్షలతో 4నెలల పాటు రెండు ట్యాంకర్లు ఏర్పాటు చేయనున్నారు. పట్టణ పురపాలక సంఘానికి 14వ ఆర్థిక సంఘం 2018–19లో కేటాయించిన 5 పనులను రద్దుచేసి, వాటిస్థానంలో రూ.35.53 లక్షలతో జేసీబీ కొనుగోలు చేసేందుకు సీడీఎంఏ ఆమోదానికి పంపించారు. మిగితా నిధులు పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు కేటాయించేలా 64 అంశాలకు గాను 59 అంశాలు ఆమోదించారు. మిగతా ఐదు అంశాలను వాయిదా వేసినట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బైపాస్ బాధిత రైతుల నిరసన



సింగాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో బైపాస్ రోడ్డు బాధిత రైతులు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారికి తమ భూములు ఇవ్వబోమంటూ పేర్కొన్నారు. రహదారి విస్తరణతో తమ విలువైన వ్యవసాయ భూములు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న రహదారినే విస్తరణ చేయాలని కోరారు. వ్యవసాయం మీదనే తమ కుటుంబాలు ఆధారపడ్డాయని వివరించారు.ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. రైతులు కొరు లింగారెడ్డి, పాయిరాల చక్రపాణి, ఇజ్జిగిరి మల్లికార్జున్, రాజయ్య, సదానందం, గట్టయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సీఈ రాజేందర్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి(హెచ్)లోని తెలంగాణ సీడ్ కంపెనీ గోదాంలను వైద్య కళాశాల తరగతి గదులుగా మార్చుతూ చేపడుతున్న మరమ్మతు పనులను బుధవారం టీఎస్ఎంఎస్‌ఐడీసీ హైదరాబాద్ సీఈ పి.రాజేంద్రకుమార్ పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, టీఎస్ఎంఎస్‌ఐడీసీ ఎస్ఈ పి.దేవేందర్ కుమార్, ఈఈ ఎ.రవీందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.రత్నమాల, కాంట్రాక్టర్లు మధుసూదన్ రాజు, సలాఉద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌లో కాంగ్రెస్ బహిరంగసభ




సభాస్థలంలో కొబ్బరికాయ కొడుతున్న కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా గురువారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో భారీ బహిరంగసభకు కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పెద్దఎత్తున జనసమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్‌భగేల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. బహిరంగసభలో పార్టీ ముఖ్యులు జైరాం రమేశ్, కొప్పుల రాజు, మాణిక్‌రావుథాక్రే, మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్.ఎస్.బోసురాజు, రోహిత్‌చౌదరి, నదీం జావెద్, టి.జీవన్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దనసరి సీతక్క, పోడెం వీరయ్య, టి.జగ్గారెడ్డి, జానారెడ్డి, షబ్బీర్‌అలీ, పొన్నాల లక్ష్మయ్య, పొన్నం ప్రభాకర్, బలరాంనాయక్, రేణుకాచౌదరి, సరేష్‌షెట్కార్, సిరిసిల్ల రాజయ్య, అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, వి.హన్మంతరావు పాల్గొననున్నారు. ముందుగా సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ చౌక్ నుంచి అంబేద్కర్‌స్టేడియం వరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్‌సేహాథ్ జోడో పాదయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో బహిరంగసభ జరగనుంది. సభ ఏర్పాట్లను స్థానిక నేతలు పర్యవేక్షించారు. సభాస్థలిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ధరణి.. సమస్యలేంటి?

- క్షేత్రస్థాయి సమస్యలపై ఆరా
- నివేదిక పంపాలని సర్కార్ ఆదేశం



జిల్లాలో అనధికారికంగా సమస్యలిలా..	
మ్యుటేషన్లు:	1,054
సక్సేషన్లు:	750
జీఎల్ఎం:	1,067
టీఎం–33:	1,804
కేసుల్లో పట్టా పుస్తకాలు:	320
జీపీఏ:	87
పీవోబీ(నిషేధిత భూములు):	539

కరీంనగర్ అర్బన్: ధరణిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించింది. రెవెన్యూ సమస్యలనుంచి రైతులకు, పట్టాదారులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ధరణి పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. కార్యాచరణకు వచ్చేసరికి బాధితులకు సమస్యలు ఎక్కువయ్యాయి. ఆ వివరాలను మండలాల వారీగా సిద్ధం చేసి పంపించాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కార్యాలయాల్లో రెవెన్యూ సిబ్బంది దస్త్రాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

తాజా లెక్కల ప్రకారం.. 5,621

జిల్లాలోని 16 మండలాల పరిధిలో ధరణికి సంబంధించి 5,621 సమస్యలు ఉన్నట్లు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికే తమ సమస్యలు పరిష్కరించాలని మీసేవా కేంద్రాల్లో ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. మరికొన్ని నిబంధనల ప్రకారం పరిష్కారం కాలేనివి ఉన్నాయి. అన్ని ఆధారాలు, పాత దస్త్రాలు ఉన్నప్పటికీ పనులు కావడం లేదని ప్రజావాణిలో చాలావరకు అర్జీలు వస్తున్నాయి. దీంతో ఎలాంటి అర్జీ పెట్టుకోవాలనేదానిపై అవగాహన ఉన్న సిబ్బందిని నియమించి సూచనలు చేస్తున్నారు.

నాయబ్ తహసీల్దార్లకే బాధ్యతలు.?

తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతలను నాయబ్ తహసీల్దార్లకు అప్పగించే అవకాశముంది. రాష్ట్రంలో పలుచోట్ల ఇప్పటికే అమలవుతోంది. తహసీల్దార్లు ఇతర పనుల్లో ఉండటం, ప్రొటోకాల్ తదితర వాటిని పర్యవేక్షించాల్సి ఉండటంతో నాయబ్ తహసీల్దార్లకే బాధ్యతలు ఇవ్వనున్నారు. ధరణితో ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా మండలాల ప్రజల నుంచి కొంతకాలంగా విన్నపాలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు తహసీల్దార్లపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. అప్పట్లో ఒకరిద్దరు నాయబ్ తహసీల్దార్లకు సైతం రిజిస్ట్రేషన్ల బాధ్యతలు అప్పగించారు.

రేపు అంగారిక టౌన్ షిప్ ప్రీ బిడ్

కరీంనగర్ అర్బన్: అంగారిక టౌన్‌షిప్‌లో సందేహాల నివృత్తి కోసం ఈ నెల 10న ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లోని అంగారిక టౌన్ షిప్‌లో తుది విడతగా 157 ప్లాట్లు వేలం వేయనున్నట్లు వివరించారు. ఈ నెల 17 నుంచి 19 వరకు వాసర గార్డెన్‌లో వేలం ఉంటుందని పేర్కొన్నారు. 10న ఉదయం 11గంటలకు నుస్తులాపూర్ రైతు వేదికలో అవగాహన సదస్సు(ప్రీ బిడ్) నిర్వహించబడుతుందని, ప్రీ- బిడ్ సమావేశంలో సందేహాల నివృత్తి కోసం దరఖాస్తుదారులు, ఔత్సాహికులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.10,000 డిపాజిట్‌ను జిల్లా కలెక్టర్, కరీంనగర్ (రాజీవ్ స్వగృహ) పేరున డిమాండ్ డ్రాఫ్ట్ తీసి జెడ్పీ ఆఫీసు ఆవరణలో ఉన్న సుడా ఆఫీసులో సమర్పించాలని అన్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌కు ఇద్దరు బలి

- ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి..
- ఒకదాన్ని మరోటి ఢీకొన్న రెండు బైక్‌లు
- అతివేగం.. అదుపుతప్పడంతో ఇద్దరు మైనర్ల మృతి
- నగరంలో మంగళవారం అర్ధరాత్రి తరువాత ఘోర ప్రమాదం



జియాఉద్దీన్(ఫైల్)



ఫౌజాన్‌ఖాన్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: ఇద్దరూ మైనర్లే.. చేతిలో బుల్లెట్‌లా దూసుకెళ్లే బైక్‌లు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మరికొందరు స్నేహితులతో కలిసి రోడ్డెక్కారు. వేగంగా దూసుకెళ్తున్నారు. కొద్దిదూరం వెళ్లిన తరువాత ముందుగా వెళ్తున్న ఓ వ్యక్తిని ఈ మైనర్లలోని ఓ బైక్ ఢీకొట్టింది. రెండు బైక్‌లు కిందపడ్డాయి. వెనకాలే వేగంగా వస్తున్న మరో మైనర్ బైక్ ఈ రెండు బైక్‌లను ఢీకొట్టి అదుపుతప్పి కిందపడింది. కరీంనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మైనర్లు మరణించారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితుడు కరుణాకర్, కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన మహ్మద్ ఫౌజానాఖాన్(17) ప్రస్తుతం కరీంనగర్ రజ్వీచమన్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఇతడి స్నేహితుడు కార్ఖానాగడ్డ ప్రాంతానికి చెందిన జియాఉద్దీన్(17), మరికొందరు స్నేహితులతో కలిసి నాలుగైదు బైక్‌లపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కరీంనగర్ కోర్టు వైపు నుంచి బస్టాండ్ వైపుగా వేగంగా వెళ్తున్నారు. ఇదే సమయంలో కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ విలాసాగరం కరుణాకర్ తనతో పనిచేసే మనీశ్‌ను బైక్‌పై ఎక్కించుకుని స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్క్ విజన్ ఐ ఆప్టికల్స్ వద్దకు చేరుకోగానే వెనకనుంచి అజాగ్రత్తగా వేగంగా బైక్ నడుపుకుంటూ వస్తున్న మహ్మద్ ఫౌజానాఖాన్ కరుణాకర్‌ను ఢీకొట్టాడు. రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురు వ్యక్తులు కిందపడ్డారు. ఇంతలో వెనకాలే బైక్‌పై వేగంగా వస్తున్న జియాఉద్దీన్ సైతం కిందపడిన రెండు బైక్‌లను ఢీకొట్టి డివైడర్‌పై పడ్డాడు. ఈ ఘటనలో ఫౌజానాఖాన్, జియాఉద్దీన్‌కు తీవ్రగాయాలు కాగా.. సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. కరుణాకర్‌కు నడుం, కాళ్లకు గాయాలు కాగా ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెనకాలే కూర్చున్న మనీశ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కరుణాకర్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతులిద్దరూ ప్రస్తుతం ఓ ప్రయివేటు కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. అయితే అర్ధరాత్రి దాటిన తరువాత ఆరుగురు యువకులు బైక్‌రేస్ నిర్వహిస్తుండగా.. ముందుగా వచ్చిన రెండు బైక్‌లు అదుపుతప్పి ఈ ప్రమాదానికి గురైనట్లు స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డప్పుకొట్టి.. ఫర్నిచర్ తీసుకెళ్లి..

- చొప్పదండిలోని ఓ ప్రయివేటు కళాశాలలో సంఘటన
- పన్ను చెల్లించనివారిపై మున్సిపల్ అధికారుల కొరడా
- సకాలంలో బకాయిలు చెల్లించాలి: మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి: పట్టణంలో ఇంటి, వాణిజ్య, పరిశ్రమల పన్నుబకాయిలను సకాలంలో చెల్లించాలని, లేకుంటే ఆస్తులు జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలువురు బకాయిదారుల వద్దకు మున్సిపల్ వాహనాలతో వెళ్లి ఫర్నిచర్ స్వాధీనం చేసుకున్నారు. ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన కుర్చీలను మున్సిపల్ వాహనంలో తరలించారు. డప్పు చాటింపు ద్వారా బకాయిలు చెల్లించకుంటే ఫర్నిచర్, తదితర ఆస్తులు జప్తుచేస్తామని ప్రకటించారు. ఈ నెల 31లోగా చెల్లించకుంటే రెండుశాతం వడ్డీ కూడా విధిస్తామన్నారు. ఆస్తిపన్ను, నీటిపన్ను, లైసెన్స్ ఫీజు, ప్రకటనల బకాయిలు సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల దౌర్జన్యం

ఈ నెలాఖరులోగా ఇంటి పన్నులు చెల్లిస్తామని చెప్పినా వినకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది గీర్వాణీ కళాశాలపై దౌర్జన్యం చేశారని కళాశాల కరస్పాండెంట్ కొండ గంగయ్య ఆరోపించారు. కళాశాలకు మున్సిపల్ రోడ్డు, డ్రైయినేజీ లేదని, వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేదని, స్థానిక కౌన్సిలర్, చైర్‌పర్సన్‌కు తెలియజేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కళాశాలపై దౌర్జన్యానికి పాల్పడిన మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



చాటింపు వేయిస్తున్న మున్సిపల్ కమిషనర్



మున్సిపల్ వాహనంలో ఫర్నిచర్ తరలింపు

క్లుప్తంగా

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

• వైఎస్సార్‌టీపీ నాయకులు నగేశ్, కుమార్



కొత్తపల్లి(కరీంనగర్): రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, వారిపై రోజుకో అఘాయిత్యం జరుగుతోందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నగేష్, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్ ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కరీంనగర్‌లో కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ముఖ్యమంత్రి అయితేనే మహిళలకు రక్షణ, సరైన న్యాయం లభిస్తాయని పేర్కొన్నారు. మహిళా నాయకులు రజితారెడ్డి, కవిత, దీనాదేశాయ్, అంజలి, స్వరూప, అరుణ, నాయకులు సలీం, శివరాం, రవీందర్‌రెడ్డి, శేఖర్, బలాల, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచండి

• డీఈవో జనార్దన్‌రావు



కొత్తపల్లి(కరీంనగర్): పదోతరగతి విద్యార్థులు పరీక్షలు చక్కగా రాసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని డీఈవో సీహెచ్‌వీ జనార్దన్‌రావు అన్నారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందుల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి, విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. వచ్చే నెలలో జరగబోయే వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని ఆరా తీశారు. వందశాతం ఉత్తీర్ణతతోపాటు విద్యార్థులు అధిక మార్కులు తెచ్చుకునేలా ఉపాధ్యాయులు ప్రయత్నించాలని సూచించారు. ఈ మేరకు వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసూదనాచారి, హెచ్‌ఎం తుమ్మ ఆనందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తిమ్మాపూర్(మానకొండూర్): అలుగునూర్ కాకతీయ కాలువ సమీపంలోని స్టేజి వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో వేణు, రాజులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని ఎస్సై ప్రమోద్ రెడ్డి పరిశీలించారు. బాధితులకు అలుగునూర్‌లో ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించిన అనంతరం ఇంటికి పంపించినట్లు పేర్కొన్నారు.

ఎల్‌ఎండీలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

• మృతుడు ఉత్తరప్రదేశ్ కూలీ

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని ఎలగందుల శివారు ఎల్‌ఎండీలో స్నానానికి వెళ్లి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కూలీ మృతి చెందినట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణానగర్‌కు చెందిన చోటు కుమార్(20), మరికొందరు కొత్తపల్లి మండలంలోని బావుపేట కేదారి గ్రానైట్ కంపెనీలో రేకుల షెడ్డు వేయడానికి వచ్చారు. మంగళవారం హోలీ వేడుకల్లో పాల్గొని, ఎల్‌ఎండీలో స్నానం చేయడానికి వెళ్లారు. కుమార్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి, మృతిచెందాడు. అతను ఈత రాక చనిపోయినట్లు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సునీల్ యాదవ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒక్కసారి నమోదు.. 54 ఏళ్ల వరకు చెల్లుబాటు

• మూడేళ్లకోసారి ఆటో రెన్యువల్
• ఎంప్లాయ్‌మెంట్ కార్డు తీసుకునే విధానంలో మార్పులు



కరీంనగర్: గతంలో ఎంప్లాయిమెంట్ కార్డు తీసుకోవడం, రెన్యువల్ చేసుకోవడం గగనంగా ఉండేది. 2019 నుంచి ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చింది. www.employment.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా పేరు నమోదు చేసుకునేవారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గతేడాది సెప్టెంబర్ నుంచి ఒక్కసారి పేరు నమోదు చేసుకుంటే ఆ అభ్యర్థి వయసు 54 ఏళ్లు వచ్చేవరకు ఎంప్లాయ్‌మెంట్ కార్డు చెల్లుబాటు, మూడేళ్లకోసారి ఆన్‌లైన్‌లోనే ఆటో రెన్యువల్ అవుతుంది. అయితే కార్డు తీసుకున్న తర్వాత అదనపు విద్యార్హతలు సాధిస్తే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 54 ఏళ్ల వరకు కార్డు చెల్లుబాటయ్యే అభ్యర్థుల జాబితాను www. ncs.gov.in జాతీయ స్థాయి వెబ్‌సైట్‌కు బదిలీ చేస్తారు.

జిల్లాలో 17 వేల మంది..

కరీంనగర్ జిల్లాలో సుమారు 17 వేల మందికిపైగా నిరుద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిరంతరాయంగా కొనసాగుతోంది. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వాలే నేరుగా నోటిఫికేషన్ జారీ చేస్తుండటం, మరికొన్ని ప్రభుత్వ శాఖలు ఎంప్లాయ్‌మెంట్ అధికారి కార్యాలయంతో నిమిత్తం లేకుండా విడిగానే నోటిఫికేషన్లు ఇస్తున్నాయి. దీంతో ఈ కార్యాలయాల ప్రాముఖ్యం తగ్గింది. అర్హులైన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రతినెలా జిల్లాల వారీగా జాబ్ మేళాలను జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గత ఆర్థిక సంవత్సరంలో జాబ్ మేళాల ద్వారా సుమారు 800 మందికి పైగా వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు.

కొన్ని శాఖల్లో తప్పనిసరి..

మెజారిటీ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు ఎంప్లాయిమెంట్ కార్డు తప్పనిసరి కాదు. అయినప్పటికీ కొన్ని శాఖల్లో నియామకాలకు మాత్రం దీన్ని పరిగణలోకి తీసుకుంటున్నారు. కారుణ్య నియామకాలు, వైద్యారోగ్య, న్యాయ తదితర శాఖల నియామకాల్లో ఎంప్లాయిమెంట్ కార్డు ఆప్షన్ ఉంది. అలాగే నిరుద్యోగ భృతికి నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఒకవేళ దీన్ని అమలు చేస్తే కార్డు తప్పనిసరి అవుతుందని అధికారులు చెబుతున్నారు.

కార్డు తీసుకోండి



చదువు పూర్తయిన వారు ఎంప్లాయిమెంట్ కార్డు తీసుకోవాలి. దీనితో తక్షణ ప్రయోజనాలు ఉండనప్పటికీ ఉద్యోగ అవకాశాలకు మాత్రం దోహదపడుతుంది. ప్రైవేట్ రంగంలో అవకాశాలకు మార్గం కల్పిస్తుంది. స్వయం ఉపాధి కోసం రుణ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. భవిష్యత్‌లో ప్రభుత్వ విధానాలు మారితే కార్డు ప్రాముఖ్యం పెరుగుతుంది. ఆన్‌లైన్‌లోనే నిరుద్యోగిగా నమోదయ్యే అవకాశం, ఆటో రెన్యువల్, 54 ఏళ్ల వయసు వరకు చెల్లుబాటులో ఉండనున్నందున నిరుద్యోగులు ఎంప్లాయ్‌మెంట్ కార్డు తీసుకోవాలి.

– దేవేందర్‌రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి



కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ మహిళా నాయకులు

కరీంనగర్: దేశంలోని మహిళలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ తదితర రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిన్నెర మల్లవ్వ, బీర్ల పద్మ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద బుధవారం మహిళా సమాఖ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వరకట్న వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి భద్రత కోసం పాలక ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని లేనిపక్షంలో మహిళలందరం ఏకమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కొట్టె అంజలి, నగర మహిళా నాయకులు పోతుగంటి శారద, కొత్తపెల్లి పుష్ప, స్వప్న, భాగ్యలక్ష్మి, అనిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

కరీంనగర్‌లోని కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చట్టం చేసినప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు కందుకూరి కృష్ణవేణి, ఉపాధ్యక్షురాళ్లు ధ్యావ అన్నపూర్ణ, మాదాసు యమున, సహాయ కార్యదర్శి నరాల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను నిషేధించండి



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

కరీంనగర్: శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను తెలంగాణ నుంచి నిషేధించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలు విద్యార్థులను వేధిస్తూ వారి ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని ఆరోపించారు. అనేక ప్రాంతాల్లో అనుమతి లేకున్నా, ఒకచోట అనుమతితో మరోచోట తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆయా విద్యాసంస్థల పీఆర్వోలు అడ్మిషన్ల కోసం వస్తే విద్యార్థులు, వారి తల్లితండ్రులు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, వసతిగృహాల అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టళ్ల విద్యార్థుల కలిసి, ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, అజయ్, కిరణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మహిళా పేషెంట్‌కు తీవ్ర గాయాలు

• ఆసుపత్రి రెండో అంతస్తు పైనుంచి పడటంతో ఘటన
• కరీంనగర్ తరలించిన వైద్యులు



బాధితురాలికి ప్రథమ చికిత్స అందిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు ఓ మహిళా పేషెంట్ కింద పడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌కు చెందిన పైడిపెల్లి సరోజన జ్వరం, ఫిట్స్ తదితర అనారోగ్య సమస్యలతో మంగళవారం దవాఖానాకు వచ్చింది. వైద్యులు పరీక్షించి, ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకున్నారు. ఆమెకు తోడుగా భర్త రవీందర్ ఉన్నాడు. ఆసుపత్రి రెండో అంతస్తులోని వార్డులో ఉన్న సరోజన బుధవారం తెలవారుజామున 5.30 గంటల సమయంలో బాత్‌రూంకు వెళ్లడానికి మెట్ల వద్దకు వచ్చింది. అకస్మాత్తుగా అక్కడి నుంచి కింద పడింది. పెద్ద శబ్దం రావడంతో ఉలిక్కిపడిన ఆమె భర్త, వైద్య సిబ్బంది వెంటనే వెళ్లి చూశారు. తీవ్రంగా గాయపడిన సరోజనను ఎమర్జెన్సీ వార్డుకు తరలించి, ప్రథమ చికిత్స అందించారు. తలకు కుట్లు వేసిన అనంతరం బాధితురాలిని వైద్యులు కరీంనగర్‌లోని చల్మెడ ఆసుపత్రికి తరలించారు. ఆమె రెండో అంతస్తు నుంచి ఎలా పడిందో ఎవరూ సరిగా చెప్పలేకపోతున్నారు. ఈ సంఘటనతో ఇన్‌పేషెంట్లు ఆందోళనకు గురయ్యారు.

స్పెషల్ ఎడ్యుకేటర్‌గా గుర్తింపు



శ్రీనివాస్ రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పునరావాస మనస్తత్వవేత్త అట్ల శ్రీనివాస్ రెడ్డి అదనపు విద్యార్హతగా స్పెషల్ ఎడ్యుకేటర్ ఇన్ మెంటల్ రిటార్డేషన్‌లో గుర్తింపు పొందారు. సంబంధిత పత్రాన్ని రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బుధవారం ఆయనకు ప్రదానం చేసింది. సాధారణంగా మెదడు అభివృద్ధికి ఏదైనా ఆటంకం కలిగితే మెంటల్ రిటార్డేషన్ ఏర్పడే ప్రమాదం ఉంటుందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గర్భిణులు మద్యం సేవించడం వల్ల పుట్టే పిల్లలలో మానసిక మాంద్యం ఏర్పడవచ్చని, సరైన ప్రినేటల్ కేర్ పొందడం, ప్రినేటల్ విటమిన్ తీసుకోవడం ద్వారా మేధో వైకల్యాలతో పుట్టే పిల్లల సంఖ్యను తగ్గించవచ్చని పేర్కొన్నారు.

12న ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐలి విజయ్‌భాస్కర్, ఎం.కృష్ణమూర్తి గౌడ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 10లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 98484 39169 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బైక్ దహనం.. ఒకరిపై కేసు

చొప్పదండి: పట్టణంలోని జ్యోతినగర్‌లో బైక్ దహనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జ్యోతినగర్‌కు చెందిన కనకయ్య ఇంటి పక్కన జాతరగొండ శ్రీనివాస్ రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. కొంతకాలంగా కనకయ్య భార్యను చూస్తూ వేధిస్తున్నాడు. ఈ విషయంపై ఆమె అత్త శ్రీనివాస్‌ను నిలదీసింది. ఈ క్రమంలో కనకయ్య కుటుంబసభ్యులు మంగళవారం అతని అన్న గృహప్రవేశానికి వెళ్లారు. గొడవను మనసులో పెట్టుకున్న శ్రీనివాస్ మంగళవారం వారి ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనాన్ని దహనం చేశాడు. బాత్‌రూం తలుపులు పగులగొట్టాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బాధితులు వెంటనే ఇంటికి వచ్చారు. కానీ అప్పటికే బైక్ పూర్తి కాలిపోయింది. తమకు రూ.40 వేల నష్టం వాటిల్లిందని కనకయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

కొత్తపల్లి(కరీంనగర్): చింతకుంట పంచాయతీ పరిధి సరస్వతి పవర్ ప్లాంట్ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 మధ్య ఉంటుందన్నారు. రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మృతి చెందినట్లు పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

25 మందికి జరిమానా

మంథని: 144 సెక్షన్ అమలులో ఉండగా ధర్నా నిర్వహించిన కేసులో బుధవారం మంథని కోర్టు న్యాయమూర్తి 25 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. 2018 మార్చి 13న మంథని అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన 27 మందిపై కేసు నమోదైందన్నారు. వీరిలో ఇద్దరు మృతిచెందగా మిగతా 25 మందిని కోర్టులో హాజరుపరిచామన్నారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారన్నారు.

మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



గోదావరిఖని(రామగుండం): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్జీ-1 జీఎం కె.నారాయణ అన్నారు. బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు కె.పద్మ, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, లేడీస్ క్లబ్ మెంబర్లు బినాసింగ్, నీరజ, సీనియర్ పీవో సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

'మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయండి'



గోదావరిఖని(రామగుండం): మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయాలని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం యైటింక్లయిన్ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. సేవా అధ్యక్షురాలు సవిత, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణి ఆత్మహత్య



పుష్పలత (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): మహిళా దినోత్సవం రోజు ఓ గర్భిణి ఆత్మహత్య చేసుకోవడం గోదావరిఖని గంగానగర్‌లో విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. గంగానగర్‌కు చెందిన బరిగెల పుష్పలత(33) భర్త, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. కొన్నేళ్లుగా అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తోంది. ఈ క్రమంలో కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులకు వెళ్లి, చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఆశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి పేర్కొన్నారు.

పత్తి ధరల్లో కోత విధిస్తే కఠినచర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న కార్యదర్శి రెడ్డినాయక్

జమ్మికుంట(హుజూరాబాద్): మార్కెట్‌యార్డు నుంచి మిల్లులకు తరలించిన పత్తికి ధరల్లో కోత విధిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ అన్నారు. బుధవారం జమ్మికుంట మార్కెట్ కార్యాలయంలో ఖరీదు, అడ్తి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరూ మార్కెట్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. పత్తిపై నీరు చల్లకుండా, తేమ శాతం తక్కువగా ఉండి, నాణ్యమైన పత్తిని తీసుకువస్తే మంచి ధర పలుకుతుందని రైతులకు చెప్పాలన్నారు. నీరు చల్లిన పత్తిని మార్కెట్‌యార్డుకు తీసుకువస్తే కొనుగోలు చేయరన్న విషయాన్ని అన్నదాతలు గమనించాలని సూచించారు.

క్వింటాల్ పత్తి రూ.7,500

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,500 పలికింది. బుధవారం మార్కెట్‌కు 50 వాహనాల్లో 728 క్వింటాళ్ల పత్తిని రైతులు విక్రయానికి తీసుకురాగా మోడల్ ధర రూ.7,350, కనిష్ట ధర 6,800ను వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 12 మంది రైతులు 13 క్వింటాళ్ల పత్తిని తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,200, మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,100కు కొనుగోలు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందించిన ఆర్టీసీ అధికారులు

కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ జోన్ పరిధిలోని (కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్) అన్ని డిపోలకు చెందిన వివిధ విభాగాల 150 మంది మహిళా ఉద్యోగులతో కరీంనగర్‌లోని జోనల్ వర్క్‌షాప్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధా పరిమళ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆడవారికి మగవారితో సమానంగా అభివృద్ధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు ఆటలపోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వప్న కుమారి, కరీంనగర్ జోనల్ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ మంజుల, కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్, వర్క్ మేనేజర్ సుగుణాకర్, చంద్రయ్య, భూపతిరెడ్డి, కిషన్, రాజశేఖర్, రమేశ్, సత్తయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

• డాక్టర్ మద్యం మత్తులో వైద్యం చేశాడమే కారణమని బాధితుల ఆరోపణ
• పోలీసులకు ఫిర్యాదు



మొగిలి (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్)/ సైదాపూర్ (హుస్నాబాద్): పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. అయితే డాక్టర్ మద్యం మత్తులో వైద్యం చేయడం వల్లే చనిపోయాడని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఎస్సై యూనిస్ అహ్మద్ అలీ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన మొగిలి(58) అనే గీత కార్మికుడు అనారోగ్య కారణాలతో సోమవారం సాయంత్రం ఇంటి వద్దే పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు తొలుత హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. వైద్యుడు సుధాకర్‌రావు మద్యం మత్తులో ఉండి, సరైన చికిత్స చేయకపోవడం వల్లే తన తండ్రి మృతిచెందాడని మొగిలి కుమారుడు మారుతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సదరు వైద్యుడిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొత్త గనులు, క్వార్టర్లు ఏమయ్యాయి?

• సింగరేణి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది
• ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆరోపించారు. బుధవారం ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-2ఏ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు తమ ప్రాణాలను పణంగాపెట్టి, సంస్థను లాభాల్లోకి తీసుకువస్తే ఆ సొమ్మునంతా సర్కారు దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ఫలితంగా కొత్త బొగ్గు గనులు ఈ ప్రాంతానికి రావడం లేదని, దీంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణికి రావాల్సిన రూ.వంద కోట్లు మాఫీ చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. మారు పేర్ల మార్పు, కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, నూతన రిక్రూట్‌మెంట్, పది వేల నూతన క్వార్టర్ల నిర్మాణం ఎటు పోయాయని ప్రశ్నించారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల పక్షాన పోరాడే ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. నాయకులు నర్సింహారెడ్డి, సదానందం, ధర్మపురి, వంగ లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్‌యాదవ్, ఆరెపల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

రెవెన్యూ అధికారులతోపాటు 21 మందిపై కేసు

• తప్పుడు పత్రాలతో భూమి విరాసత్
• ఆలస్యంగా వెలుగులోకి ఘటన

శంకరపట్నం(మానకొండూర్): తప్పుడు పత్రాలతో భూమిని విరాసత్ చేసిన రెవెన్యూ అధికారులతోపాటు 21 మందిపై కేశవపట్నం పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని గొల్లపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ కాసు అయిలయ్యకు సంబంధించి వారసత్వంగా వచ్చిన భూమిని ఆయన సోదరుడి కుమారులు భీమరాజు, రామరాజులకు అప్పటి తహసీల్దార్ జగత్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత, ఆర్‌ఐ అరుణ, వీఆర్వో మమతలు విరాసత్ చేశారని బాధితుడు ఆరోపించారు. దీనిపై హుజూరాబాద్ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కేసు నమోదు చేయాలని న్యాయమూర్తి కేశవపట్నం పోలీసులను ఆదేశించారు. ఈ విషయమై ఎస్సై చంద్రశేఖర్‌ను బుధవారం వివరణ కోరగా నాలుగు రోజుల క్రితం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించాలి



గోదావరిఖని(రామగుండం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఓటు వేసే అవకాశం ఇవ్వాలన్నారు. ఈ నెల 13న నిర్వహించే ఎన్నికల సమావేశానికి కాంట్రాక్టు కార్మిక సంఘాలను కూడా ఆహ్వానించాలని విన్నవించారు.

క్లుప్తంగా

ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కరీంనగర్‌కల్చరల్: రామచంద్రాపూర్ కాలనీ దేవుళ్లపురిలోని పంచముఖ హనుమదీశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్మించిన సీతారామ చంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. నమిలకొండ రమణాచార్యస్వామి బృందం నిర్వహణలో ఉదయం పుణ్యాహవాచనం, అంకురార్పణ, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం హవనములు, జలాధివాసం జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, కమిటీ బాధ్యులు కంకణాల భాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, పెర్మారావు, జితేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, సతీశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట



మహిళను సన్మానిస్తున్న చైర్మన్, కమిషనర్

కొత్తపల్లి: మహిళల సంక్షేమానికి, భద్రతకు, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కొత్తపల్లి(హెచ్) మున్సిపల్ సమావేశ మందిరంలో ఆర్పీలు, ఏఎన్‌ఎంలు, మహిళా గ్రూపు సభ్యులతో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, టీఎల్‌ఎఫ్ సంధ్య, ఆర్పీలు మాధవి, లత తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు.

తడి పొడి వరి సాగుపై అవగాహన



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీకాంత్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో బుధవారం పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తడి పొడి విధానంలో వరిపంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తడి పొడి సాగు విధానంలో పొలానికి క్రమపద్ధతిలో నీరు పెట్టిన అనంతరం ఆరబెట్టాలన్నారు. నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. పొలంలో రంధ్రాలున్న ప్లాస్టిక్ పైపును ఉపయోగించి పొలానికి నీటిని పెట్టడంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని వివరించారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి జన్మనక్షత్ర పూజలు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రం (ఉత్తర) సందర్భంగా ఉదయం గణపతి హవనం, స్వామికి విశేష అభిషేకం, అలంకరణ, సాయంత్రం అభిషేక అర్చనలు, పడిపూజ నిర్వహించారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో కాంతారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం, చీరలు పంపిణీ



కరీంనగర్‌టౌన్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఆశాజ్యోతి పాజిటివ్ పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం క్రిస్టియన్ కాలనీలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాజిటివ్ సొసైటీ పీడీ టి.మమత, సురేందర్‌రెడ్డి, లావణ్య, శ్రీనివాస్, కిశోర్, దేవయ్య, దాసరి మల్లేశం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కరీంనగర్: వేసవికాలం దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం కరీంనగర్ లాజిస్టిక్స్ వద్ద కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం కె.భానుకిరణ్ బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్గో ఇన్‌చార్జి ఆర్.రామక్రిష్ణ, ఆర్‌ఎంఈ జి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంక్ కాలనీలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సుజయ్



అల్ఫోర్స్‌లో మహిళా ఉపాధ్యాయినిలను సన్మానించిన నరేందర్‌రెడ్డి



కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో..



జిల్లా కోర్టులో మహిళా అడ్వకేట్లను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు



మహిళలను సన్మానించిన శ్రీరాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ బాధ్యులు



గోపాల్‌పూర్‌లో..



భత్రాజు మహిళా సంఘం ఆధ్వర్యంలో..



దుర్శేడ్‌లో..



అచీవర్స్ పాఠశాలలో..

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కరీంనగర్/సప్తగిరికాలనీ/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం కరీంనగర్‌తోపాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళా ఉద్యోగులు, కార్మికులను సన్మానించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ..

పలు విద్యాసంస్థల్లో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా ఉపాధ్యాయినిలను సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషుల కంటే ఎక్కువగా రాణిస్తున్నారన్నారు. మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా విద్యాసంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న రవీందర్‌రెడ్డి



రేకుర్తి ప్యారడైజ్‌లో మహిళలను సన్మానించిన డా.ప్రతిమారెడ్డి



మానేరు విద్యాసంస్థల్లో..



వింధ్యావాలీ పాఠశాలలో..



భగవతి పాఠశాలలో..



సప్తగిరి పాఠశాలలో..



కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాలలో..

జానపద కళారూపాలను బతికించుకోవాలి

విద్యానగర్: అంతరించిపోతున్న జానపద కళారూపాలను బతికించుకోవాల్సిన బాధ్యత కళాకారుల మీద ఉందని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షురాలు తాళ్లపెల్లి నాయకులు సంధ్య, దివ్య, రేణుక, కవిత, చక్రం రజిత, బొడ్డు సురేశ్, రాజమల్లు, ప్రియాంక, సరిత, వినోద, సంధ్య, లత, మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

సీపీఆర్‌పై అవగాహన

కరీంనగర్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బందికి బుధవారం కార్డియో పల్మనరీ రెసిస్టేషన్ (సీపీఆర్)పై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఆకస్మిక గుండెపోటు మరణాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్డియాక్ అరెస్ట్‌తో ఒక్కసారిగా కుప్పకూలి పోయినప్పుడు ఆ వ్యక్తికి దగ్గర ఉన్న వారు ఎలా స్పందించాలనే అంశంపై వివరించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో మనిషిని ఎలా బ్రతికించవచ్చో నేర్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ అక్షయ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ రోహిణి, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ తానయ్య, అకౌంట్స్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

కూలర్లు అందజేత



కూలర్లు అందజేస్తున్న ఎల్‌ఐసీ మహిళా ఉద్యోగులు

కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో కార్ఖానాగడ్డలో గల ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల ఆశ్రమానికి ఆరు కూలర్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్‌రావు హాజరై మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు మార్చి 8ని ఒక సెలబ్రేషన్‌లా కాకుండా సామాజిక బాధ్యత నెరవేర్చాల్సిన రోజుగా గుర్తించడం సంతోషమని అభినందించారు. అనంతరం వేంకటేశ్వర ఆలయ పరిసరాల్లో వంద మంది పేదలకు అన్నదానం చేశారు. మహిళా సబ్ కమిటీ కన్వీనర్ వాణి, డివిజన్ నాయకులు రవీంద్రనాథ్, రామ్మోహన్‌రావు, వెంకటరమణ, వామన్‌రావు, సూర్యకళ, బసవేశ్వర్, సుధారాణి, శ్రీదేవి, శ్రీలత, అనుపమ, అనసూయ, స్వాతి, మాధవి, పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు పుస్తకం అందజేత



కరీంనగర్‌కల్చరల్: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి హరీశ్ రావుకు బుధవారం మంత్రి గంగుల కమలాకర్ అనుమతితో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ 'అత్యంత ప్రతిభావంతులు ఏడు అలవాట్లు' అనే పుస్తకాన్ని ఇచ్చి స్వాగతం పలికారు.

సౌకర్యాలు కల్పించండి

విద్యానగర్(కరీంనగర్): రానున్న రంజాన్ పండుగ సందర్భంగా సౌకర్యాలు కల్పించాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, ఆతిన, అలిబాబా అజర్ దబీర్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్, మేయర్, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం అందజేశారు.

'ఆకాశ సముద్రాలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కవయిత్రి షహనాజ్ ఫాతిమా రాసిన 'ఆకాశ సముద్రాలు' పుస్తకాన్ని బుధవారం ఫిల్మ్‌భవన్‌లో అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఆవిష్కరించారు. సమాజాన్ని చాలా నిశితంగా పరిశీలించి షహనాజ్ ఫాతిమా ఈ పుస్తకం రాశారన్నారు. అన్ని కవితలు ఆలోచింపజేసేలా ఉన్నాయని తెలిపారు. ఆమె కలం నుంచి మరిన్ని కవితలు జాలువారాలని అన్నారు. తెరవె అధ్యక్షుడు కందుకూరి అంజయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమంలో కవులు నిర్మలారాణి, పొన్నం రవిచంద్ర, పుప్పాల శ్రీరాం, పీఎస్ రవీంద్ర, మడుపు ముత్యంరెడ్డి, సీవీ కుమార్ పాల్గొన్నారు.

బైక్ రైడింగ్, సైలెన్సర్ల శబ్దాలపై చర్యలు చేపట్టాలి

విద్యానగర్(కరీంనగర్): నగరంలో రాత్రివేళల్లో యువత బైక్ రైడింగ్‌లు, పెద్ద పెద్ద శబ్దాలు కలిగిన సైలెన్సర్లను బిగించుకొని ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై సీపీ సుబ్బరాయుడు చర్యలు తీసుకోవాలని సున్ని మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మొయిజొద్దీన్ ఖాదిరి యూసుఫ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నగరంలో ద్విచక్రవాహనాల వేగాన్ని నియంత్రించాలన్నారు. కళాశాలల వద్ద, పలు డివిజన్లలో యువతకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని విన్నవించారు. బైక్ రైడింగ్‌లకు పాల్పడే వారిని గుర్తించి వారి వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్: ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నందికొండ విద్యాసాగర్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, 2003 డీఎస్సీ, ఆలస్యంగా పోస్టింగ్ పొందిన డీఎస్సీ 2002 వారికి పాత పెన్షన్ విధానం వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీచేయాలని డిమాండ్ చేశారు. పండిత, పీఈటీ అప్‌గ్రేడ్ విషయంలో కోర్టు కేసు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎల్‌ఎఫ్‌ఎల్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ వాయిదాలను వెంటనే మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



వైభవంగా తాపాల లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లోని శ్రీతాపాల లక్ష్మీనర్సింహస్వామి 24వ వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మధుసూదనాచార్యుల ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊరడి మంజుల, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ గోనె నర్సయ్య, మాజీ చైర్మన్ మంద రాజమల్లు, ఆలయ కమిటీ అధ్యక్షుడు దాడి సంపత్, ఉపాధ్యక్షుడు దాడి శ్రీనివాస్, సభ్యులు దాడి మోహన్, చంద్రయ్య, రాజయ్య, రాములు, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ సాయిక్రిష్ణ ఫీడర్ పరిధిలోని భగత్‌నగర్, ముకరంపుర, తెలంగాణచౌక్ నుంచి మున్సిపల్ ఆఫీసు వరకు, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, కలెక్టరేట్ కాంప్లెక్స్ ప్రాంతాలు, స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలోని చేపల మార్కెట్ నుంచి సంతోష్‌నగర్ రోడ్ నం.9 వరకు గల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ గాంధీ, బ్యాంక్‌కాలనీ, కాపువాడ ఫీడర్ల పరిధిలోని సైన్స్ వింగ్ కళాశాల, నాఖాచౌరస్తా, హుస్సేనిపుర, ఖాన్‌పుర, గాంధీ ఎక్స్ రోడ్, కాపువాడ, మారుతీనగర్, వరాహస్వామి ఆలయం, ఎస్‌ఎస్ గార్డెన్స్, అశోక్‌నగర్, బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

క్లుప్తంగా...

విశాఖలో ప్రతిష్టాత్మక ఐసీఐడీ 25వ కాంగ్రెస్

- 75వ ఐఈసీ సమావేశం కూడా...
- నవంబర్ 1 నుంచి 8 వరకు ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) 25వ కాంగ్రెస్‌కు విశాఖపట్నంను వేదికగా ఆ సంస్థ ఎంపిక చేసింది. నవంబర్ 1 నుంచి 8 వరకు ఈ సమావేశాలను ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఐఈసీ) 75వ సమావేశాన్ని కూడా ఐసీఐడీ నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోవడమే ఈ కాంగ్రెస్ ప్రధానఎజెండా. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో గత అక్టోబర్ 3 నుంచి 10 వరకు ఐసీఐడీ 24వ కాంగ్రెస్, 74వ ఐఈసీ సమావేశాలు జరిగాయి. ఐసీఐడీ 25వ కాంగ్రెస్‌ను మన రాష్ట్రంలోని విశాఖపట్నంలో నిర్వహించాలని ఆ సంస్థ నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కాంగ్రెస్‌ను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రతినిధి బృందం అడిలైడ్ కాంగ్రెస్‌లో తెలిపింది. విశాఖ కాంగ్రెస్‌కు హాజరుకావాలని 78 దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆహ్వానించింది. వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలను ప్రతిపాదిస్తూ నివేదికలను ఏప్రిల్ 30 లోపు పంపాలని ఆ సంస్థ పేర్కొంది. ఇందులో అత్యుత్తమ విధానాలపై 25వ కాంగ్రెస్‌లో చర్చించనుంది.

మే 15 నుంచి ఏపీఈఏపీసెట్

ఈసెట్ మే 5న, ఐసెట్ మే 24 నుంచి నిర్వహణ

సాక్షి, అమరావతి: ఏపీలో 2023–24 విద్యా సంవత్సరంలో కీలకమైన ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎంట్రన్స్ టెస్టుల షెడ్యూల్‌ను ఏపీ ఉన్నత విద్యా మండలి ఖరారు చేసింది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఈఏపీసెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్), లేటరల్ ఎంట్రీ (డిప్లొమా విద్యార్థులు ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశం)కి సంబంధించిన ఈసెట్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు, పరీక్షల నిర్వహణ తేదీలను నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్ వివరాలను ఉన్నత విద్యా మండలి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈఏపీసెట్ పరీక్షలను మే 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈసెట్ మే 5న, ఐసెట్ మే 24, 25 తేదీల్లో నిర్వహిస్తారు.

బొబ్బిలి వీణ.. శిఖరాగ్ర ఆదరణ

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన అతిథులకూ ఇవే బహుమతి
- రాష్ట్రపతి భవన్ నుంచి.. వైట్‌హౌస్ వరకు బొబ్బిలి వీణలకు స్థానం
- 300 ఏళ్లనాటి చారిత్రక సంపదగా జియోగ్రాఫికల్ గుర్తింపు దక్కించుకున్న బొబ్బిలి వీణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రపంచంలో ప్రతిష్టాత్మకమైన 20 సభ్యదేశాల శిఖరాగ్ర సమావేశాల్లో బొబ్బిలి వీణ వైభవాన్ని చాటుకోనుంది. విశాఖలో ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న జీ–20 సదస్సుకు వివిధ దేశాల నుంచి హాజరయ్యే అతిథులను గౌరవించేందుకు 200 బొబ్బిలి వీణలను అధికారులు ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉన్నందున ఆయన చేతుల మీదుగా వీటిని ప్రపంచం నలుమూలల నుంచి

జీ-20 దేశాల అతిథుల కోసం 200 వీణలకు ఆర్డర్

వచ్చే అతిథులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు దేశం నలుమూలల నుంచి హాజరైన పారిశ్రామిక దిగ్గజాలు, ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బొబ్బిలి వీణలను బహూకరించారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లికి చెందిన సర్వసిద్ధి ఇంటిపేరు గల కుటుంబీకులే దశాబ్దాలుగా బొబ్బిలి వీణలను తయారుచేస్తూ వస్తున్నారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా 1994వ సంవత్సరంలో సొసైటీని ఏర్పాటు చేసింది. 2002లో బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో వీణల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

వీణల తయారీయే ఆధారంగా ఉన్న మా కళాకారులకు టీటీడీతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంలో 200 వీణలను తయారుచేసి అందించాం. అతిథుల కోసం మా వీణలతో కచేరీ కూడా ఏర్పాటు చేయించారు. ఈ నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న మరో ప్రతిష్టాత్మక సదస్సు జీ–20 కోసం కూడా 200 వీణలకు ఆర్డర్ వచ్చింది.

– సర్వసిద్ధి రామకృష్ణ, ఇన్‌చార్జి, బొబ్బిలి వీణల కేంద్రం



వీణల ధరలు ఇలా..

వీణ సైజు (అంగుళాల్లో)	రకం	ధర	ప్యాకింగ్‌తో ధర
9	సాధారణ	రూ.1,200	రూ.1,430
13	సాధారణ	రూ.1,900	రూ.2,300
17	సాధారణ	రూ.2,200	రూ.2,700
23	సాధారణ	రూ.3,600	రూ.4,500
9	నెమలి	రూ.1,800	రూ.2,200
17	నెమలి	రూ.2,900	రూ.3600
9	స్వరమాపది	రూ.2,000	రూ.2,500
పెద్దవీణ	(సరస్వతివీణ)	రూ.32,000	--

నిఘా పెంచండి... నివేదికలివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

దృష్టి పెట్టాలని జిల్లా అధికారులు ఆదేశాలు వెళ్లాయి. మార్కులు తక్కువ వస్తున్న విద్యార్థులను మానసికంగా వేధించడం, ఇతర కాలేజీల నుంచి పరీక్షలు రాయించే చర్యలపైనా ఫిర్యాదులున్నాయి. వాటిని పరిశీలించాలని బోర్డు ఆదేశించింది.

వాటిపై మరింత దృష్టి..

- అకాడమీల పేరుతో విద్యార్థులను చేర్చుకోవడం బోర్డు నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ కొన్ని కాలేజీలు ఆయా విద్యార్థులను ఇతర కాలేజీల పేరిట పరీక్షలు రాయిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ఏ కాలేజీ ద్వారా ఏ అకాడమీ విద్యార్థుల చేత పరీక్షలు రాయిస్తున్నారనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.
- చాలా ప్రైవేటు కాలేజీలపై గతంలో అవకతవకల ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోకుండా అడ్డుకున్న అధికారులెవరు? వారికి సహరించిన యాజమాన్యాలు, వ్యక్తులు ఎవరు? ఈ తంతులో ఎంత మేర ముడుపులు చేతులు మారాయి? అనే వివరాలనూ తెలుసుకుంటున్నారు.
- కొన్నేళ్లుగా కొందరు బోర్డు అధికారులు, కొన్ని కాలేజీల యాజమాన్యాల మధ్య మధ్యవర్తిత్వం వహించిన వారి ప్రమేయం, సాగించిన అవినీతి కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..



విద్యార్థులకు నష్టం కలిగించే కాలేజీలపై కొరడా ఝుళిపించాలి. ర్యాంకుల కోసం విద్యార్థులను వేధిస్తున్న, నిబంధనలను అతిక్రమిస్తున్న కాలేజీలపై కఠిన చర్యల విషయంలో బోర్డు చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

– గౌరీ సతీశ్ (ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘం అధ్యక్షుడు)

అవినీతి అధికారులను తొలగించాలి



విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ర్యాంకులతో ప్రచారం చేసుకుంటున్న కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఆగడాల వెనుక కొందరు బోర్డు అధికారుల ప్రమేయం ఉంది. అవినీతికి పాల్పడుతూ ఆయా సంస్థలను వెనకేసుకొచ్చిన అధికారులను గుర్తించి తొలగించాలి.

– మాచర్ల రామకృష్ణగౌడ్ (తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్)

'గగన్‌యాన్'లో మహిళా వ్యోమగామికి అవకాశం

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2024లో నిర్వహించబోయే గగన్‌యాన్ ప్రయోగంలో అంతరిక్షంలోకి పంపించడానికి ఒక మహిళకు అవకాశం కల్పించనున్నామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించబోయే చంద్రయాన్–2 మిషన్‌కు ఒక మహిళే డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో రాజరాజన్ మాట్లాడారు. చంద్రయాన్–2 ప్రయోగంలో కూడా ఎక్కువగా మహిళలే పాల్గొనడం విశేషమన్నారు. స్వయంకృషి, పట్టుదల ఉంటే జీవితంలో మహిళలు కూడా పురుషులకు ఏమీ తీసిపోరని కోయంబత్తూరు పీఎస్‌సీ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జయంతశ్రీ బాలకృష్ణన్ అన్నారు.



మాట్లాడుతున్న రాజరాజన్

అనంతరం షార్ కేంద్రంలోని మహిళలకు, విద్యార్థినులకు పలు రకాల ఆటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ ఇంకా షార్‌లో మహిళా ఇంజినీర్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒకే విడతలో 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వమిది

- ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొనం
- ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: 'ఏపీలో రికార్డు స్థాయిలో ఒకే విడతలో తమలాంటి 1.34 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం ఇది. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే నిరసనలు, ఆందోళనల్లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులం పాల్గొనం'అని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టంచేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానిపాషా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ఎవరూ ఊహించని విధంగా చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో బృహత్తర ఆలోచనతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.34 లక్షల మంది యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. ఈ 1.34 లక్షల కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును మా ఉద్యోగులెవరూ ఎప్పటికీ మరువలేరు. రాష్ట్రంలో కొంతమంది ఉద్యోగ సంఘాల నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యోగ వ్యవస్థలో సింహ భాగంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను తప్పుదోవ పట్టించేలా రెచ్చగొడుతూ, ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పాల్పడేలా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు ఎవ్వరూ ఎటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు, ఆందోళనల్లో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం'అని పేర్కొన్నారు.

రేపు ఆన్‌లైన్ 'పెన్షన్ అదాలత్'

సాక్షి, హైదరాబాద్: నెలవారీ పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీన ఉదయం 11గంటలకు ఆన్‌లైన్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కమిషనర్ ఎం.హెచ్.వార్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://meet.google.com/cav-esqk-bzm లింకు ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈపీఎస్ చట్టం–95, అధిక పెన్షన్, ఆప్షన్ నమోదు, దరఖాస్తు విధానం తదితర అంశాలను తెలుసుకునేందుకు ఈ అదాలత్ అత్యుత్తమ వేదికని వివరించారు. సందేహాలున్న వారు, సమాచారం తెలుసుకోవాలనుకున్న వారంతా ఆన్‌లైన్ అదాలత్‌లో పాల్గొనాలని సూచించారు.

'స్కిల్' కుంభకోణంలో కీలక వ్యక్తి అరెస్టు

'సీమెన్స్'కంపెనీ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను అరెస్టు చేసిన సీఐడీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో మరో కీలక వ్యక్తిని సీఐడీ అరెస్టు చేసింది. సీమెన్స్ ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఆయన నివాసంలో బుధవారం అదుపులోకి తీసుకుంది. అనంతరం ఆయన్ని న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకువస్తున్నారు. జీవీఎస్ భాస్కర్‌తో సహా ఈ కేసులో ఇప్పటివరకు సీఐడీ 8 మందిని అరెస్టు చేసింది. రూ. 371 కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు ప్రభుత్వ పెద్దలు కొల్లగొట్టడంలో జీవీఎస్ భాస్కర్ ప్రధాన పాత్ర పోషించారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వం సీమెన్స్ కంపెనీ ముసుగులో షెల్ కంపెనీలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం రూపకల్పనలో ఆయనే కీలకంగా వ్యవహరించారు. సీమెన్స్ ఇండియా లిమిటెడ్‌కు అప్పట్లో ఎండీగా ఉన్న సుమన్ బోస్‌తో కుమ్మక్కై టీడీపీ పెద్దలు ఈ ఎంవోయూ కథ నడిపారు. అందులో భాస్కర్ కీలకంగా వ్యవహరించారు.

విమానంలో ధూమపానం.. యువతి అరెస్టు

దొడ్డబళ్లాపురం: విమానంలో ధూమపానం చేసిన యువతిని బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లోని సీల్దా జిల్లాకు చెందిన ప్రియాంక చక్రవర్తి (24) అనే యువతి ఆదివారం అర్ధరాత్రి కోల్‌కతా నుంచి బెంగళూరు వస్తున్న ఇండిగో విమానంలో ప్రయాణించింది. ఆమె విమానం టాయ్‌లెట్లోకి వెళ్లి ధూమపానం చేయసాగింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో సిబ్బంది తలుపులు తెరవాలని కోరగా, ఆమె సిగరెట్‌ను డస్ట్‌బిన్‌లో పారవేసి తలుపులు తీసింది. పొగ వాసన రావడంతో సిబ్బంది తనిఖీ చేయగా డస్ట్‌బిన్‌లో సిగరెట్ దొరికింది. విమానం బెంగళూరులో దిగగానే ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విమానంలో పొగ తాగడం నేరం కాబట్టి కేసు నమోదు చేసి ప్రియాంకను అరెస్టు చేశారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలో బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరు కాగా వీరిలో నైపుణ్యం కనబరిచిన 16 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన ఈ బాలుర జట్టు ఈ నెల 10 నుంచి 12వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో జరిగే 37వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుంది. ఎంపికైన వారిలో టి.దీక్షిత్, జె.రవివర్మ, ఈ.అనీశ్‌రాజ్, డి.ఇషాంత్, ఏ.చరణ్, జి.అశ్విత్, బి.కౌశిక్, కె.శ్రీను, జె.సిద్ధార్థ(గోల్ కీపర్), కె.రఘు, డి.సాయిచరణ్(మంచిర్యాల), కె.అభిలాశ్, ఎం.మణికంఠ(నిర్మల్), డి.యోగి, ఎస్.మహేశ్, పి.కార్తీక్, ఎం.రాంకుమార్, డి.శిరీష్ (గోల్ కీపర్), సీహెచ్.సాయిశ్రీనాథ్(కుమురంభీం) ఎంపికయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి రమేశ్‌రెడ్డి, నిర్మల్ జిల్లా కన్వీనర్ పెంటన్న, పీడీ సదానందం, కోచ్‌లు సునార్కర్ అరవింద్, దుర్గం రాజలింగు, కళ్యాణ్, రాజశేఖర్, పీఈటీలు రమేశ్, రాజేందర్ పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా బాలుర హ్యాండ్‌బాల్ జట్టుతో అసోసియేషన్ సభ్యులు

గొప్ప కవులను అందించిన గడ్డ కరీంనగర్

- ఆలోచింపజేసిన మహిళా కవిసమ్మేళనం
- డాక్టర్ నలిమెల భాస్కర్‌కు పద్మశ్రీ శ్రీభాష్యం జీవన సాఫల్య పురస్కారం
- ముగిసిన కరీంనగర్ పుస్తక ప్రదర్శన

కరీంనగర్‌కల్చరల్: పుస్తకం సమాజాన్ని మారుస్తుందని, గొప్ప గొప్ప కవులను అందించిన నేల కరీంనగర్ గడ్డ అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిబాపూలే పార్క్, తెలంగాణ బుక్ ట్రస్టు ఆధ్వర్యంలో, సాహిత్య అకాడమీ సౌజన్యంతో వారం రోజులుగా నిర్వహిస్తున్న కరీంనగర్ బుక్ ఫెయిర్ ముగింపు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డాక్టర్ నలిమెల భాస్కర్‌కు పద్మశ్రీ శ్రీభాష్యం జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్లకు, పార్టీలకు వెళ్లేవారు పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం అలవాటు చేసుకోవాలన్నారు. కరీంనగర్‌లో అన్ని గ్రామాలలో పుస్తక యాత్ర చేపట్టాలని గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్‌కు సూచించారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్‌ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉదయం పాకాల యశోధరెడ్డి రాసిన ఎచ్చమ్మ కథలను రచయిత్రి డాక్టర్ అడువాల సుజాత చదివి వినిపించారు. తోట నిర్మలారాణి అధ్యక్షతన పెనుగొండ సరసిజ సమన్వయం మధ్య సాగిన మహిళా కవి సమ్మేళనంలో పలువురు రచయిత్రులు వినిపించిన కవితలు ఆలోచింపజేశాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యాం ప్రసాద్ లాల్, గరిమా అగర్వాల్, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



భాస్కర్‌కు పద్మశ్రీ శ్రీభాష్యం జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్న జూలూరి గౌరీశంకర్, కలెక్టర్ కర్ణన్

నేను కట్నం తీసుకోలేదు... నా బిడ్డలకు కట్నమివ్వను

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: 'నేను ఒక్క రూపాయి కట్నం తీసుకోలేదు.. బ్యాంకు లోన్ తీసుకుని పెళ్లి చేసుకున్నా.. నాకు ఇద్దరు ఆడపిల్లలు.. వారికి కూడా పైసా కట్నమివ్వను.. కట్నం తీసుకోని వారికే వారినిచ్చి వివాహం చేస్తానని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జీవితంలో ఎలా నడుచుకోవాలో నాకు నా తల్లి నేర్పించిన విలువలని, ప్రతీ తల్లి తన బిడ్డలు సన్మార్గంలో నడుచుకునేలా ప్రోత్సహించాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను జిల్లా కేంద్రంలోని తానీషా గార్డెన్‌లో బుధవారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే రామన్నతో కలిసి జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


నేత్రపర్వంగా తెప్పోత్సవం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు బుధవారం బ్రహ్మపుష్కరిణి(కోనేరు)లో శ్రీకొత్తలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయం నుంచి కోనేరు వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. కోనేరులో హంస వాహనంపై ఐదు ప్రదక్షిణలు చేయించి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం భోగ మండపంలోని ఊయలపై స్వామివారిని ఆశీనులు చేసి డోలోత్సవం జరిపించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఉత్సవాలు తిలకించారు. నర్సింహ నామస్మరణలతో కోనేరు మార్మోగింది. స్వామివారిని దర్శించుకోవడం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



కోనేరులో నృసింహుని తెప్పోత్సవం


దేశానికే ఆదర్శంగా ముఖరా(కె)




మీనాక్షికి చెక్కు అందజేస్తున్న మంత్రి సత్యవతి

ఇచ్చోడ: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పల్లెప్రగతి కార్యక్రమాలను వందశాతం అమలు చేస్తూ ముఖరా(కె) గ్రామం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఇందులో సర్పంచ్ గాడ్గే మీనాక్షి కృషి అభినందనీయమని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మీనాక్షిని శాలువాతో సన్మానించారు. ఉత్తమ మహిళా అవార్డుతో పాటు రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోళికేరి, హన్మకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు తాగి యువకుడు మృతి



మహిపత్ మృతదేహం



అధికారులు స్వాధీనం చేసుకున్న కల్తీ కల్లు తయారీ పదార్థాలు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం చిన్న సుద్దగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహిపత్‌రావు (27) కల్తీ కల్లు తాగి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహిపత్‌రావు మంగళవారం రాత్రి హోలీ సంబరాల అనంతరం లక్కారంలోని కిష్టగౌడ్ వద్ద కల్తీ కల్లు తాగి ఒక ప్యాకెట్ జేబులో పెట్టుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పడిపోయాడు. సహచరులు గమనించడంతో అప్పటికే మృతిచెందాడు. బుధవారం కిష్టగౌడ్ ఇంటికి వెళ్లి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇంట్లోనే విషపూరిత రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేస్తూ విక్రయిస్తున్నాడని ఆరోపించారు. ఈ కల్లు తాగే మహిపత్‌రావు మృతిచెందాడని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న సీఐ సైదారావు, ఎస్సై సుమన్, ఎక్సైజ్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. కిష్టగౌడ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. అనంతరం ఆయన ఇంట్లో కల్తీ కల్లు తయారీకి వినియోగిస్తున్న రసాయనాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాజన్న ఆలయం ముస్తాబు





శివకల్యాణానికి సిద్ధమైన వేదిక

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి శివకల్యాణ మహోత్సవానికి ముస్తాబైంది. ఆలయ అధికారులు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం నుంచి మంగళవారం వరకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు ఉత్సవాలు మొదలుకానున్నాయి. శుక్రవారం ఉదయం 6.15 గంటలకు తీర్థరాజస్వామిపూజ, ఆవాహిత దేవతార్చన, ఆవాహిత దేవత హోమం, ఉదయం 10.50 గంటలకు ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం 12.55 గంటలకు పార్వతీరాజరాజేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.



శివకల్యాణ మహోత్సవానికి ముస్తాబైన రాజన్న ఆలయం

మానవ అక్రమ రవాణను ఒంటి చేత్తో అడ్డుకుంటోంది పల్లవి ఘోష్ . తను స్థాపించిన 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్' ద్వారా పది వేల మంది బాల బాలికలను, స్త్రీలను అక్రమ రవాణ నుంచి కాపాడగలిగింది. అస్సాంకు చెందిన పల్లవి ఘోష్ ఈశాన్య రాష్ట్రాల పోలీసులకు, సరిహద్దు భద్రతా దళాలకు సుపరిచితం. వారి సహాయంతో పల్లవి చేస్తున్న కృషికి ఎన్నో ప్రశంసలు లభిస్తున్నాయి.

యాంటీ ట్రాఫికింగ్ యాక్టివిస్ట్

కిడ్నాపర్లకు సింహస్వప్నం


పల్లవి ఘోష్

'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' లెక్కల ప్రకారం భారత్‌లో 2021లో 77,535 మంది బాల బాలికలు 'మిస్' అయ్యారు. వీరిలో 59,544 మంది ఆడపిల్లలు. వీరంతా ఏమయ్యారు?

అంతులేని అక్రమం

'మన దేశంలో పేదరికం, వలసలు, వరదలు, అధిక సంతానం, ఇంటి సభ్యుల మధ్య సఖ్యతా, ప్రేమా లేకపోవడం... ఇవి ఉన్నంత కాలం మానవ అక్రమ రవాణా ఉంటుంది. ఆడపిల్లలను వ్యభిచారం కోసం, బలవంతపు పెళ్లిళ్ల కోసం కిడ్నాప్ చేస్తున్నారు. అబ్బాయిలను వెట్టి కార్మికులుగా మార్చడానికి తీసుకెళుతున్నారు. ఇవి ఆగాలంటే సమాజంలో చైతన్యం రావాలి' అంటోంది పల్లవి ఘోష్.

2013 నుంచి 2023 మధ్య కాలంలో పల్లవి ఘోష్ యాంటీ ట్రాఫికింగ్ యాక్టివిస్ట్‌గా దాదాపు 10 వేల మంది బాల బాలికలను, స్త్రీలను కాపాడింది. ఈమె కార్యరంగం అంతా ఈశాన్య రాష్ట్రాల్లో ఉంది. అక్కడి ట్రాఫికర్లకు పల్లవి పేరు చెబితే హడల్.

బాల్యంలో పడిన తొలిముద్ర

పల్లవి ఘోష్‌ది అస్సామ్‌లోని లుమ్‌డింగ్. ఏడవ క్లాస్‌లో ఉండగా వేసవి సెలవుల్లో బెంగాల్‌లోని మేనమామ ఇంటికి వెళ్లింది. 'అప్పుడు ఆ పల్లెటూళ్లో ఒకాయన తన కూతురి కోసం వెతుకుతూ తిరుగుతున్నాడు. ఎవరో అపరిచితుడు బైక్ మీద వచ్చి మాట కలిపి ఆ అమ్మాయిని తీసుకెళ్లాడని ఊళ్లో చెప్పుకున్నారు. ఆ వయసులో ఆ ఘటన నా మీద చాలా ముద్ర వేసింది' అంటుంది పల్లవి. ఢిల్లీలో డిగ్రీ చేసిన పల్లవి చెన్నై నుంచి 'జెండర్ ఇష్యూస్' మీద పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్ నిరోధానికై పని చేసే ఢిల్లీ స్వచ్ఛంద సంస్థ 'శక్తివాహిని'లో 2013లో చేరింది.


తాను రక్షించిన పిల్లలతో పల్లవి

ఎన్నో అనుభవాలు

యాంటీ ట్రాఫికింగ్ యాక్టివిస్ట్‌గా పల్లవి ఎన్నో అనుభవాలు చూసింది. 'ఈశాన్య రాష్ట్రాల నుంచి తెచ్చి ఢిల్లీలో పని మనుషులుగా స్త్రీలను అమ్మేస్తారు. ఆ స్త్రీలను ఇంటి యజమానులు దారుణంగా హింసిస్తారు. అలాంటి వారిని ఎందరినో విడిపించాను. హర్యానాలో పెళ్లికూతుళ్లది పెద్ద సమస్య. అందుకని బెంగాల్, అస్సాం, నాగాలాండ్ వంటి రాష్ట్రాల నుంచి మహిళలను ఎత్తుకొచ్చి బలవంతంగా పెళ్లి చేసి ఇళ్ల లోపల ఉంచేస్తారు. పల్లెల్లో ఈ విషయం అందరికీ తెలిసినా ఎవరూ నోరు మెదపరు. అడ్డుకోరు. ఆశ్చర్యం ఏమంటే వయసు కూడా పట్టించుకోరు. 50 ఏళ్ల మహిళను కూడా ఎత్తుకొచ్చి హర్యానాలో పెళ్లి చేశారు' అంటుంది పల్లవి.

ప్రాణాలకు ప్రమాదమైనా

శక్తివాహినిలో ఏడేళ్లు పని చేశాక 2020లో సొంతగా 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్' అనే ఎన్.జి.ఓ స్థాపించి యాంటీ ట్రాఫికింగ్ మీద పని చేస్తున్న పల్లవి ఈ పనిలో చాలా రిస్క్ ఉందని చెబుతుంది. 'ఆడపిల్లలను/స్త్రీలను ఇళ్ల నుంచి వ్యభిచార గృహాల నుంచి విడిపించడానికి వెళ్లినప్పుడు దారుణంగా ఎదురుదాడి చేస్తారు. చంపాలని చూస్తారు. అయితే పోలీసుల సహాయం లేకుండా నేను వెళ్లను. కొంతమంది బ్రోకర్లు నాకు నేరుగా ఫోన్ చేసి ఈ దాడులు మానేస్తే ఇల్లు కొనిస్తాం అని బేరానికి వచ్చారు. కోర్టులో ఒకడు నాకు కత్తి చూపించాడు' అంటుంది పల్లవి. అయినా సరే ఆమె తన కృషి మానలేదు.

డ్రైవర్లను చైతన్యవంతం చేయాలి

ఈశాన్య రాష్ట్రాల్లో పల్లవి ఊరూరు తిరిగి అక్కడి కార్మికులతో, కూలి మహిళలతో, స్కూలు విద్యార్థినులతో మాట్లాడుతుంది. తన సంస్థ వాలంటీర్ల ద్వారా పెద్ద సంఖ్యలో మహిళలను కలిసి మానవ అక్రమ రవాణా గురించి చెబుతుంది.

'అన్నింటి కంటే ముఖ్యం రిక్షావాళ్లను, క్యాబ్ డ్రైవర్లను, ఆటోవాళ్లను చైతన్యవంతం చేయాలి. ఎందుకంటే ఆడవాళ్లను ఎత్తుకుపోవాలంటే వీరి ద్వారానే పోవాలి. వీరు ఆపగలిగితే సగం కేసులు ఆగిపోతాయి' అంటుంది పల్లవి. ఆడపిల్లల అక్రమ రవాణాను నిరోధించడం ఒకెత్తయితే తిరిగి పట్టుకొచ్చాక వారికి కొత్త జీవితాలు ఇవ్వడం ఒకెత్తు. 'తీసుకొచ్చిన వారిని షెల్టర్ హోమ్స్‌లో పడేయడం సరి కాదు. ఆ హోమ్స్‌లో రకరకాల అనుభవాల పిల్లలు ఉంటారు. వారందరూ కలిసి ఉండటం వల్ల పిలలు ఆరోగ్యకరమైన మానసిక స్థితితో ఎదగలేరు' అంటుంది పల్లవి.

భయం, నిరాశల కంటే 'ఆశ' అనేది వంద రెట్లు పదునైనది. బలమైనది. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)లో మహిళల ప్రాతినిధ్యం తగినంత లేదనే నిరాశ స్వరం వినిపిస్తున్న నేపథ్యంలో నేటి తరం అమ్మాయిలు సాంకేతికరంగంపై చూపుతున్న ఆసక్తి, ఆవిష్కరణలు కొత్త భవిష్యత్‌కు ఊపిరి పోస్తున్నాయి.

అవును...ఆశయం నెరవేరుతుంది!

యూత్ పల్స్

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) రిపోర్ట్ ప్రకారం 75 శాతం మంది ఉద్యోగులు రాబోయే కాలంలో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)కు సంబంధించి ఉంటారు. ఇప్పటికైతే 'స్టెమ్'లో పురుషులతో పోల్చితే మహిళల ప్రాతినిధ్యం తక్కువగా కనిపిస్తోంది.

అయితే శాస్త్రీయరంగంలో ఈతరం అమ్మాయిల ఆవిష్కరణలు చూస్తుంటే సాంకేతికత, ఆవిష్కరణల విషయంలో లింగసమానత్వం అనేది కచ్చితంగా సాధ్యమే అనిపిస్తోంది.

'క్వెస్ట్ అలయెన్స్' స్వచ్ఛంద సంస్థ, ఐబీఎం-ఇండియాతో కలిసి దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన 'స్టెమ్ ఫర్ గర్ల్స్ హ్యాక్‌థాన్'లో ఎంతోమంది అమ్మాయిలు పాల్గొన్నారు. శాస్త్రీయ ఆలోచనలు, ఆవిష్కరణలకు ఈ హ్యాక్‌థాన్ వేదిక అయింది.

రెండు నెలల పాటు సాగిన ఈ వర్క్‌షాప్‌లలో శానిటరీ డిస్పోజల్ మిషన్ (విష వాయువులను నిరోధించే యంత్రం), వీధుల్లో ఉన్న చెత్తను సేకరించే గార్బెజ్ కలెక్టర్, బియ్యంలో రాళ్లు ఏరివేసే డీస్టోన్, సౌర శక్తితో పనిచేసే సెల్ఫ్-ఆపరేటెడ్ డిష్ వాషర్, మల్టీ పర్పస్ క్లీనింగ్‌టూల్ ... ఇలా ఎన్నో కొత్త పరికరాలను అమ్మాయిలు తయారుచేశారు.

ఈ వర్క్‌షాప్‌తో సంబంధం లేకుండా తమ ఆవిష్కరణలతో వార్తల్లో నిలిచిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు.

మధ్యప్రదేశ్‌లోని పన్నా పట్టణానికి చెందిన నిషి గోస్వామి వైద్యసమాచారానికి ఉపకరించే ఏఐ ఆధారిత యాప్‌కు రూపకల్పన చేసింది.

తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన వినిష సోలార్ ఐరన్ బండిని తయారుచేసి 'శభాష్' అనిపించుకుంది.

భోపాల్‌కు చెందిన సీనియర్ ఇంటర్ స్టూడెంట్ అనుష్క శ్రీవాస్తవ ఎకో-ఫ్రెండ్లీ వాటర్‌బాటిల్ తయారుచేసింది. ఉత్తరాఖండ్‌లోని పటా గ్రామానికి చెందిన బీఎస్సీ విద్యార్థి మనీష రమోలా ఔషధ మొక్కలకు సంబంధించిన లోతైన సమాచారాన్ని అందించే ఏఐ ఆధారిత యాప్‌కు రూపకల్పన చేసింది. బెంగళూరుకు చెందిన



దిగాంతిక బోస్ 'వైరస్ డెస్ట్రాయిడ్ మాస్క్' తయారుచేసింది.

నిషి గోస్వామి నుంచి దిగాంతిక బోస్ వరకు తరగతి గదిలో పాఠాలు మాత్రమే వినలేదు. ఆనంది భాయి గోపాలరావు జోషి, అసిమా ఛటర్జీలాంటి ఎంతోమంది అలనాటి ప్రసిద్ధ శాస్త్రవేత్తల నుంచి, నేటి తరానికి కొత్త శక్తిని ఇస్తున్న 'నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్' తొలి మహిళా అధ్యక్షురాలు దేబ్‌జానీ ఘోష్, ఐబీఎం, ఇండియా ఆవిష్కరణలలో రెండు దశబ్దాల భాగస్వామిగా ఉన్న గార్గీ దాస్ గుప్తా, ఐటీ విభాగంలో మూడు దశబ్దాల అనుభవం ఉన్న అమృత గంగోత్ర, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ తొలి మహిళా డైరెక్టర్ సంఘమిత్ర బందోపాధ్యాయ లాంటి ఎంతో మంది స్ఫూర్తిదాయక విజేత గురించి విని ఉన్నారు.

స్ఫూర్తి ఉన్న చోట కొత్త ఆలోచన మొదలవుతుంది. కొత్త ఆవిష్కరణకు బీజం పడుతుంది. భవిష్యత్‌పై కొత్త ఆశను రేకెత్తిస్తుంది.

● కొత్త దారి

కళారాజభవనం


కాంతులీనే రాజభవనం





ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో బరిపడ పట్టణంలో ఉన్న 1804 కాలానికి చెందిన అందమైన రాజభవనంలోకి వెళ్లే అవకాశం కొందరికి మాత్రమే ఉండేది. రాజవంశీకులు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన తరువాత ఈ రాజభవనం కళావిహీనమై ఒంటరి ద్వీపంలో మౌనముద్రతో కనిపించేది.

అలాంటి రాజభవనంలోకి మళ్లీ కళ తీసుకువచ్చారు అక్షిత, మృణాళిక అనే అక్కాచెల్లెళ్లు.

ఇప్పటి ఆ ప్రత్యేకత ఏమిటంటే సామాన్యులు కూడా ఈ రాజభవనంలోకి అడుగు పెట్టడం.

స్థానిక సంస్కృతి, కళలను ప్రోత్సహించడంతో పాటు అ భవనం పర్యాటకులను ఆకర్షించే పర్యాటక కేంద్రంగా మారింది.

రాజవంశీకులైన అక్షిత, మృణాళికలు కోల్‌కత్తాలో చదువుకొని, పై చదువులకు విదేశాలకు వెళ్లారు. అక్షిత పొలికల్ సైన్స్, హ్యూమన్‌రైట్స్, మృణాళిక సోషియాలజీ చదువుకుంది. సెలవుల్లో మాత్రమే ఈ రాజభవనానికి వచ్చేవాళ్లు. ఈ ప్యాలెస్ పూర్వవైభవం గురించి తల్లిదండ్రులు, తాతల నుంచి ఎన్నో అద్భుత విషయాలు విన్నారు. అలాంటి ప్యాలెస్ కాస్త కళావిహీనంగా మారడంతో తమ వంతుగా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నారు.


అక్షిత, మృణాళిక

'మనం ఏమీ చేయలేము. అదంత తేలికైన విషయం కాదు' అని నిరాశ పరిచారు తల్లిదండ్రులు.

అయిన వెనక్కి తగ్గలేదు ఈ అక్కాచెల్లెళ్లు. గత వైభవం ఆనవాళ్లు చెరిగిపోకుండా సకల జాగ్రత్తలు తీసుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఒరిజినల్ స్ట్రక్చర్‌ను అలాగే పెట్టి మార్పులు చేశారు. వందల సంవత్సరాల నాటి కళాకృతులకు బూజు దులిపి వెలుగు తీసుకువచ్చారు. వివిధ రకాల కళాకృతులు తయారు చేయడానికి చేతివృత్తి కళాకారులందరికీ ఈ రాజభవనం కేంద్రం అయింది.రాజభవనాన్ని బొటీక్ హోటల్‌గా మార్చడం ద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అనుకున్నారు.

'నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో ఉన్న ఇక్కడికి ఎవరు వస్తారు?' అని చాలా మంది భయపెట్టారు.

తమ నిర్ణయంపై నమ్మకంతో వారి మాటలను పట్టించుకోలేదు అక్షిత, మృణాళికలు.

అయిదు సంవత్సరాల తరువాత...

రాజభవనం పూర్వం లాగే చిద్విలాసంగా ఉంది. మనుషుల రాకపోకలతో సందడి సందడిగా ఉంది. ఒడిశాకు వచ్చే పర్యాటకులకు 'చూడాల్సిన ప్యాలెస్' జాబితాలో మయూర్‌భంజ్ ప్యాలెస్ చేరింది. ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు రావడం వల్ల స్థానిక కళాకృతులకు గిరాకీ పెరిగింది. స్థానిక కళాకారులు వచ్చి తమ కళారూపాలను ఇక్కడ ప్రదర్శిస్తారు.

కనువిందు చేసే ఆకర్షణలే కాదు చవులూరించే స్థానిక వంటకాలకు కూడా రాజభవనం వేదిక అయింది. చిరుధాన్యాలతో చేసే వంటకాల రుచులు ప్రత్యేక ఆకర్షణగా మారాయి.

సైబర్ టాక్

ఈ వేధింపులనూ రిపోర్ట్ చేయండి!

వినీత్ (పేరు మార్చడమైనది) సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. అతను తన సహచరుడు ప్రేమించుకున్నారు. వారిద్దరూ కలిసి బతకాలని నిర్ణయం తీసుకున్నారు. కుటుంబ సభ్యులు కూడా చివరకు వారి నిర్ణయానికి ఆమోదం తెలిపారు. కానీ, 'మగవాళ్లు ఇద్దరూ పెళ్లి చేసుకుంటున్నారట..' అనే వ్యంగ్యపు మాటలు వారిని బాధిస్తున్నాయి. అంతేకాదు, సోషల్ మీడియాలో వారికి సంబంధించిన వార్తలు, వ్యతిరేక కామెంట్లు, లైంగికపరమైన చర్చలు జరుపుతుండటంతో వారిలో ఆందోళన మొదలైంది. 'మేం, మాలాంటి వారంతా గౌరవంగా బతకాలనుకుంటున్నాం. ఉద్యోగాలు చేసుకుంటున్నాం. అలాంటప్పుడు మా ఎదుగుదలకు సంబంధించి కాకుండా, లైంగికపరంగా మమ్మల్ని దిగజార్చే మాటలే ఎందుకు పదే పదే వస్తున్నాయి. ఈ బాధించే మాటలు, వీడియోల నుంచి మాకు విముక్తి ఎప్పుడు?' అంటూ ప్రశ్నిస్తున్నారు.

• • •

మాయ ట్రాన్స్‌జెండర్. ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తోంది. సమాజంలో తమ వర్గాన్ని తక్కువగా చూస్తారన్న భయం ఆమెలో లేకపోలేదు. దానికి తోడు యూ ట్యూబ్ చూస్తున్నప్పుడల్లా ఆమెను వేల ప్రశ్నలు చుట్టుముడుతున్నాయి. వీడియోలు వైరల్ అవడం కోసం తమ వర్గానికి చెందిన వారిని లైంగికపరమైన విషయాలమీదనే ఫోకస్ చేస్తున్నారనేది ఆమె బాధ. దీనివల్ల సహచర ఉద్యోగుల్లోనూ, చుట్టుపక్కల కుటుంబాల్లోనూ తనను కూడా అదే విధంగా చూస్తారని, నాలాగ బాధపడుతున్నవారు ఎంతో మంది ఉన్నారంటోంది మాయ.

• • •


ప్రతీకాత్మక చిత్రం

ఇది నేటి సమాజంలో అణచివేతకు గురికాబడుతున్న మరో వర్గంగా స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లను ప్రధానంగా చూస్తుంటాం. ఎల్‌జిబిటిక్యూఐఎ అనే పేరుతో వీరు హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో తమ సమస్యలను విన్నవించుకుంటూ ఓ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా వస్తున్న ఈ జుగుప్సాకరమైన కంటెంట్ కలిగించే ఆందోళనను ఓ సున్నితమైన అంశంగా పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు. తమ వర్గం వారిలోనూ డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, ఇతర ఉన్నతోద్యోగాలు చేసుకుంటున్న వారు ఉన్నారని, తమ విజయగాథలను తెలియజేయమని ఈ సందర్భంగా వారు వేడుకున్నారు.

వైరల్ ప్రధానమా?

సోషల్ మీడియా ద్వారా డబ్బు రావాలంటే ఇప్పుడు యూ ట్యూబ్ అనేది ఒక సాధనం అని మనకు తెలిసిందే. ఎంత వైరల్ అయ్యే అంశాలు ఉంటే ఆ వీడియో ద్వారా అంత డబ్బు, దానితో పాటు పేరు వస్తుందని చాలా మందికి తెలుసు. అందుకే, ఆసక్తిని రేకెత్తించే అంశం ఏమిటో దానినే వీడియో అప్‌లోడ్ చేసేవారు ఎంచుకుంటారు. దీనితో పాటు వెబ్‌సైట్స్ ఇతర సామాజిక మాధ్యమాలు కూడా వార్త వైరల్ అయ్యేందుకు ఈ అంశాలను ఎంచుకుంటాయి.

సైబర్ వేధింపులు

సామాజిక మాధ్యమాల్లో మహిళలే అధిక వేధింపులకు లోనవుతుంటారు. అయితే, ఇటీవల పెరుగుతున్న పరిణామాల్లో ఎల్‌జిబిటిక్యూఐ+ కూడా చేరుతోంది. ఆఫ్‌లైన్‌లో జాతి, మత, వర్గంలో ఉండే విభేధాలు ఆన్‌లైన్‌లోనూ చూస్తుంటాం. డిజిటల్ యుగంలో తమ ఉనికిని చాటుకునే రోజుల్లో ఉన్నాం కాబట్టి ఎంచుకునే అంశాలు మరింత సున్నితంగా, తోటి వారి గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

సహాయం కోసం వీరిని సంప్రదించవచ్చు

రకరకాల సామాజిక మాధ్యమాల ద్వారా, సమాజంలో తమ గౌరవం దెబ్బతింటుందని, ఇతరులు తమను వేధింపులకు లోను చేస్తున్నారని అవి సమస్యగా తమ జీవనానికి అడ్డంకిగా ఉందనుకుంటే...

1. చట్టపరమైన రక్షణ కోసం 100కి కాల్ చేసి, పోలీసుల సాయం పొందవచ్చు.

2. జాతీయ/రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) అనేది జాతీయస్థాయి ప్రభుత్వ సంస్థ. మానవ హక్కుల ఉల్లంఘనలను ఈ సంస్థ ప్రత్యేకంగా పరిశీలిస్తుంది. ఎల్‌జిబిటిక్యూ+ వ్యక్తులైన వారు తమకు తగిన సహాయం కావాలంటే వీరిని సంప్రదించవచ్చు.

3. మహిళల కోసం జాతీయ /రాష్ట్ర కమిషన్: నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ (ఎన్‌సీడబ్ల్యూ) అనేది లైంగిక నేరాలు, గృహహింస, వేధింపులు .. మొదలైన వాటి నుంచి మహిళల రక్షణలో పనిచేసే జాతీయస్థాయి ప్రభుత్వ సంస్థ. ఈ ఎన్‌సీడబ్ల్యూ కూడా తగిన సహాయం చేస్తుంది.

4. ఆన్‌లైన్ క్రైమ్ రిపోర్టింగ్ (ఆన్‌లైన్‌లో చేసిన వేధింపుల కింద) https://www.cybercrime.gov.in లోనూ రిపోర్ట్ చేయవచ్చు.

– సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎవరికి రిపోర్ట్ చేయాలి?

సామాజిక మాధ్యమాల ద్వారా తమ గౌరవానికి భంగం కలిగించే అంశాలు ఉంటే రిపోర్ట్ చేయాల్సింది..

ఫేస్‌బుక్ ..
https://www.facebook.com/help/116326365118751

ట్విటర్ ...
https://help.twitter.com/en/safety-and-security/report-abusive-behavior

ఇన్‌స్టాగ్రామ్–యూట్యూబ్
https://help.instagram.com/547601325292351https://support.google.com/youtube/answer/2801939#protected_group

లింక్డ్‌ఇన్:
https://www.linkedin.com/help/linkedin/answer/a1336329/report-harassment-or-a-safety-concern?lang=en

పైన ఇచ్చిన సోషల్‌మీడియా లింక్స్ ద్వారా ఆయా విభాగాలకు రిపోర్ట్ చేయవచ్చు. దానిపైన ఆ మాధ్యమాలు తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.


అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్



- అర లీటరు నీటిలో రెండు స్పూన్ల ఉసిరిపొడి, టీస్పూను నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని ప్రతిరోజూ తలకు రాసుకుని తలస్నానం చేస్తే, అతి తక్కువ సమయంలో అందమైన నల్లని జుట్టు మీ సొంతమవుతుంది.
- ఒక కప్పు బీట్‌రూట్ రసంలో అరకప్పు పెరుగు, పావుకప్పు బాదం నూనె, చెంచా ఉసిరిక పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టించి, అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. నెలకు రెండుసార్లయినా ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.
- పెరుగులో ఒక స్పూను తేనె, రెండు స్పూన్ల నిమ్మకాయ రసం కలిపి తలకి పట్టించి ఒక అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.
- పుదీనా ఆకులను రుబ్బి నీళ్ల కలిపి మాడుకు పట్టించి కొంతసేపటి తరువాత తలస్నానం చేస్తే చుండ్రు సమస్య ఉండదు.
- గుడ్డు తెల్లసొనను తలకు పట్టించి... గంట తరువాత స్నానం చేస్తే చుండ్రు తగ్గుతుంది.



పోరాడి ఓడిన సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. బెంగళూరులో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సహజ 6–7 (8/10), 3–6తో డయానా మర్సిన్‌కెవిచా (లాత్వియా) చేతిలో ఓడిపోయింది. గంటా 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ అంకితా రైనా 6–3, 6–0తో వన్షిత (భారత్)పై నెగ్గి రెండో రౌండ్‌కు చేరింది.

లక్ష్య సేన్‌కు షాక్



జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ఆటగాడు, ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 41వ ర్యాంకర్ క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) 21–19, 21–16తో ఆరో సీడ్ లక్ష్య సేన్‌ను బోల్తా కొట్టించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. పొపోవ్‌పై గతంలో నాలుగుసార్లు నెగ్గిన లక్ష్య సేన్ రెండోసారి ఓటమి చవిచూశాడు.

గుజరాత్ జెయింట్స్ తొలి విజయం

- సోఫియా డంక్లీ, హర్లీన్ మెరుపులు
- బెంగళూరుకు 'హ్యాట్రిక్' ఓటమి



డంక్లీ



హర్లీన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో గుజరాత్ జెయింట్స్ ఖాతాలో తొలి విజయం చేరింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 11 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేయగా... 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసి ఓడిపోయింది. బెంగళూరు జట్టులో సోఫీ డివైన్ (45 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎలీస్ పెరీ (25 బంతుల్లో 32; 5 ఫోర్లు), హీథెర్ నైట్ (11 బంతుల్లో 30 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ప్రయోజనం లేకపోయింది. గుజరాత్ బౌలర్లలో గార్డ్‌నర్ (3/31) రాణించింది. బెంగళూరు జట్టుకిది వరుసగా మూడో ఓటమి. స్నేహ్ రాణా సారథ్యంలోని గుజరాత్ జెయింట్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆంధ్ర అమ్మాయి సబ్బినేని మేఘన (11 బంతుల్లో 8; 2 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరగ్గా... సోఫియా డంక్లీ (28 బంతుల్లో 65; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), హర్లీన్ డియోల్ (45 బంతుల్లో 67; 9 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు వేగంతో అర్ధ సెంచరీలు నమోదు చేశారు. ప్రీతి బోస్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో డంక్లీ వరుస బంతుల్లో 4,6,4,4,4తో 22 పరుగులు సాధించింది. యాష్లే గార్డ్‌నర్ (19; 2 ఫోర్లు), హేమలత (16; 2 ఫోర్లు, 1 సిక్స్), అనాబెల్ సదర్లాండ్ (14; 1 ఫోర్, 1 సిక్స్) కూడా రాణించడంతో గుజరాత్ స్కోరు 200 దాటింది. ఈ టోర్నీలో ఓ జట్టు 200 పరుగులు దాటడం ఇది నాలుగోసారి. బెంగళూరు బౌలర్లలో శ్రేయంక పాటిల్, హీథెర్ నైట్ రెండు వికెట్ల చొప్పున తీశారు.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ముంబై ఇండియన్స్ X ఢిల్లీ క్యాపిటల్స్

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

చివరి పంచ్ ఎవరిదో!

బోర్డర్–గావస్కర్ ట్రోఫీ తొలి రెండు టెస్టుల్లో భారత జట్టు ఆటను చూస్తే 4–0 ఖాయమనిపించింది. అయితే ఒక్కసారిగా పుంజుకున్న ఆస్ట్రేలియా మూడో టెస్టు గెలవడంతో పాటు చివరి మ్యాచ్‌ను కూడా ఆసక్తికరంగా మార్చేసింది. అన్ని రంగాల్లో ప్రత్యర్థికంటే పైచేయిగానే కనిపిస్తున్నా నాలుగో టెస్టులో రోహిత్ సేన విజయం సాధిస్తుందని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. గత మ్యాచ్ గెలుపు ఇచ్చిన ఉత్సాహంతో స్మిత్ బృందం సానుకూల దృక్పథంతో పోరుకు సై అంటోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అతి పెద్ద క్రికెట్ స్టేడియంలో సిరీస్‌కు ఆసక్తికర ముగింపు ఖాయం. ఇరు దేశాల ప్రధానమంత్రులు హాజరు కానుండటం కూడా తొలి రోజు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది.

- నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా నాలుగో టెస్టు
- డబ్ల్యూటీసీ ఫైనల్ లక్ష్యంగా టీమిండియా
- సిరీస్ సమంపై కంగారూల దృష్టి
- మ్యాచ్‌కు హాజరుకానున్న రెండు దేశాల ప్రధానులు
- ఉదయం గం.9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కుల్దీప్ యాదవ్, సిరాజ్, రోహిత్ శర్మ

అహ్మదాబాద్: టెస్టు క్రికెట్‌లో అత్యంత హోరాహోరీ సమరాల్లో ఒకటైన భారత్, ఆస్ట్రేలియా పోరు చివరి అంకానికి చేరింది. సిరీస్‌లో ఇప్పటికే ఆధిక్యంలో ఉన్న భారత్ మరో మ్యాచ్ గెలిచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించాలని పట్టుదలగా ఉండగా... గత కొన్నేళ్లలో ఏ పర్యాటక జట్టుకూ సాధ్యంకాని రీతిలో సిరీస్‌లో రెండు టెస్టులు నెగ్గిన ఘనతను సొంతం చేసుకోవాలని ఆసీస్ భావిస్తోంది. ఇండోర్ టెస్టు అనుభవం దృష్ట్యా టీమిండియా పూర్తిగా స్పిన్ పిచ్ వైపు మొగ్గు చూపకపోవచ్చు. కాబట్టి ఈ మ్యాచ్‌లో ఇరు జట్లకు సమాన అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు.

భరత్ చోటు పదిలం!

ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు చూస్తే భారత బ్యాటర్లకు బాగానే పరీక్ష పెట్టింది. రోహిత్ మినహా మరెవరూ సెంచరీ సాధించలేకపోగా, పుజారా ఒకే ఒక అర్ధ సెంచరీ చేశాడు. కోహ్లి అయితే అది కూడా లేదు. బౌలర్ల చలవతో రెండు టెస్టుల్లోనూ భారత్ విజయాన్ని అందుకోగలిగింది. ఇంకా చెప్పాలంటే అక్షర్ పటేల్ చేసిన రెండు అర్ధసెంచరీలు, జడేజా హాఫ్ సెంచరీ జట్టును ఆదుకున్నాయి. లోయర్ ఆర్డర్ భాగస్వామ్యం లేకపోతే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో. ఈ నేపథ్యంలో ప్రధాన బ్యాటర్లంతా ఈ మ్యాచ్‌లోనైనా తమ స్థాయికి తగిన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. చాలా కాలంగా టెస్టుల్లో విఫలమవుతున్న కోహ్లి తన సత్తా చాటేందుకు ఇదే సరైన అవకాశం. గిల్ కూడా తనకు దక్కిన అవకాశాన్ని వాడుకోవాల్సి ఉంది. మరోవైపు వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ భరత్‌ను తప్పించి ఇషాన్ కిషన్‌ను ఆడించే అవకాశాలు ఉన్నాయని వినిపించింది. అయితే మీడియా సమావేశంలో రోహిత్ చెప్పినదాన్ని బట్టి చూస్తే భరత్ కొనసాగడం ఖాయం. భరత్ బ్యాటింగ్ సంతృప్తికరంగా లేకపోయినా... బ్యాటింగ్‌లో సమష్టి వైఫల్యం కనిపిస్తున్నప్పుడు ఒక్క భరత్‌నే నిందించడంలో అర్థం లేదనే కారణంతో పాటు కీపర్‌గా మెరుగైన నైపుణ్యం ఉండటం భరత్‌కు కలిసి రానుంది. బౌలింగ్‌లో జట్టులో ఒక మార్పు చోటు చేసుకోవచ్చు. గత టెస్టులో విశ్రాంతి తీసుకున్న షమీ నేరుగా రానుండగా... అతని కోసం సిరాజ్‌ను పక్కన పెట్టే అవకాశం ఉంది. ఉమేశ్ ఇండోర్ టెస్టులో చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ మైదానంలో ఆడిన రెండు టెస్టుల్లోనే 20 వికెట్లు తీసిన అక్షర్ పటేల్‌పై అందరి దృష్టి నిలిచింది. ఈ మైదానం అతనికి సొంత గ్రౌండ్ కూడా కావడం విశేషం.



స్మిత్

మార్పుల్లేకుండా...

గెలిచిన జట్టులో మార్పులు చేయకూడదనేది సహజ సూత్రం. అరుదైన విజయం సాధించిన ఆస్ట్రేలియా కూడా అందుకు మినహాయింపేమీ కాదు. స్పిన్‌కు మరీ అనుకూలించే పిచ్ కాకపోయినా ముగ్గురు స్పిన్నర్లు లయన్, మర్ఫీ, కునెమన్‌లను కంగారూ టీమ్ మేనేజ్‌మెంట్ నమ్ముకుంది. అదనపు బ్యాటర్ కోసం ప్రధాన పేసర్ స్టార్క్‌ను పక్కన పెట్టే ప్రతిపాదన వచ్చినా... మరీ ఒక్క పేసర్ కూడా లేకుండా ఆడటం జట్టును లోపంగా మారవచ్చు. స్టార్క్‌తో పాటు గ్రీన్‌లాంటి మీడియం పేస్ ఆల్‌రౌండర్ ఉండటంతో రెండో రెగ్యులర్ పేసర్ అవసరం లేదు. బ్యాటింగ్‌లోనైతే ఆసీస్ నిశ్చింతగా ఉంది. 1–8 స్థానాల వరకు ఎలాంటి మార్పు అవసరం లేకుండా ఆ జట్టు బ్యాటింగ్ బృందం నిలదొక్కుకుంది. ఉస్మాన్ ఖాజా ఈ సిరీస్‌లో అందరికంటే మెరుగైన ప్రదర్శన కనబర్చగా... హెడ్, హ్యాండ్స్‌కాంబ్ రాణించారు. ఎన్నో అంచనాలతో భారత్‌లో అడుగు పెట్టిన లబుషేన్ ఒక భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. 2017 తరహాలో అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించకపోయినా స్మిత్ అందరికంటే కీలకం అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా అతని నాయకత్వం కారణంగానే ఆసీస్ గత మ్యాచ్ గెలిచింది. ఈ సారి అతను టీమ్‌ను ఎలా నడిపిస్తాడనేది ఆసక్తికరం.



ఆ ఇద్దరు అతిథులుగా...

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ కలిసి నాలుగో టెస్టు తొలి రోజు ఆటను మైదానంలో వీక్షించనున్నారు. ఇందు కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి సెషన్ సమయంలోనే వీరిద్దరు అక్కడ ఉంటారు. మరోవైపు ఈ మ్యాచ్ ప్రేక్షకుల హాజరులో కూడా కొత్త రికార్డు నెలకొల్పే అవకాశం ఉంది. ఒకరోజు ఆటకు హాజరైన ప్రేక్షకుల సంఖ్య 91,112 ప్రస్తుతం రికార్డుగా ఉంది (2013 మెల్‌బోర్న్‌లో యాషెస్ టెస్టు). అయితే ఇప్పటి వరకు టికెట్ల అమ్మకాలను బట్టి చూస్తే మోదీ స్టేడియంలో కొత్త రికార్డు నమోదు కావచ్చు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, జడేజా, శ్రీకర్ భరత్, అశ్విన్, అక్షర్ పటేల్, షమీ, ఉమేశ్ యాదవ్. ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), హెడ్, ఖాజా, లబుషేన్, హ్యాండ్స్‌కాంబ్, గ్రీన్, క్యారీ, స్టార్క్, మర్ఫీ, నాథన్ లయన్, కునెమన్.

పిచ్, వాతావరణం

గత మూడు టెస్టులతో పోలిస్తే ఇది బ్యాటింగ్‌కు కాస్త అనుకూలమైన పిచ్. స్పిన్ ప్రభావం ఉన్నా... మరీ మొదటి రోజునుంచే టర్న్ కాకపోవచ్చు. భారత్‌లో చాలా మైదానాల తరహాలో ఆట సాగుతున్నకొద్దీ నెమ్మదిస్తుంది. టాస్ గెలిచిన జట్టు తొలుత బ్యాటింగ్ చేసుకోవడం సురక్షితం.

బుమ్రా... ఆరు నెలలు ఆటకు దూరం

భారత బౌలర్‌కు న్యూజిలాండ్‌లో శస్త్ర చికిత్స



అహ్మదాబాద్: భారత అగ్రశ్రేణి పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆరు నెలలు క్రికెట్‌కు దూరం కానున్నాడు. వెన్ను నొప్పి గాయంతో బాధపడుతున్న 29 ఏళ్ల బుమ్రాకు బుధవారం న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్‌లో డాక్టర్ రోవన్ షౌటెన్ నిర్వహించిన శస్త్రచికిత్సవిజయవంతమైంది. ఈ గాయం నుంచి కోలుకోవడానికి బుమ్రాకు ఆరు నెలల సమయం పట్టనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌లో జరిగే ఆసియా కప్ వన్డే టోర్నీకి అతను అందుబాటులో ఉండటంలేదు. అయితే భారత్ వేదికగా అక్టోబర్–నవంబర్‌లలో జరిగే వన్డే ప్రపంచకప్ మెగా టోర్నీ సమయానికి బుమ్రా పూర్తిస్థాయిలో కోలుకుంటాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

దక్షిణాఫ్రికా 311/7



మార్క్‌రమ్

జొహనెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో బుధవారం మొదలైన రెండో టెస్టులో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 89.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 311 పరుగులు సాధించింది. మార్క్‌రమ్ (139 బంతుల్లో 96; 17 ఫోర్లు), టోనీ డి జార్జి (155 బంతుల్లో 86; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. మార్క్‌రమ్ తొలి వికెట్‌కు డీన్ ఎల్గర్ (54 బంతుల్లో 42; 7 ఫోర్లు)తో కలిసి 76 పరుగులు... రెండో వికెట్‌కు టోనీ డి జార్జితో 116 పరుగులు జోడించాడు. విండీస్ బౌలర్లలో గుడకేశ్ మోతీ మూడు వికెట్లు, కైల్ మేయర్స్ రెండు వికెట్లు తీశారు.

శ్రీజకు నిరాశ



సింగపూర్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ సింగపూర్ స్మాష్ టోర్నీలో భారత్‌కు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించలేకపోయింది. బుధవారం జరిగిన మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ రెండో మ్యాచ్‌లో జాతీయ చాంపియన్ శ్రీజ 12–10, 6–11, 9–11, 3–11తో జూ చెన్‌హుయ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో హైదరాబాద్ కుర్రాడు స్నేహిత్ సూరావజ్జుల 11–4, 7–11, 10–12, 11–6, 11–8తో జేవియర్ డిక్సన్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు.

సినిమా

లేడీస్ స్పెషల్



అనుష్క



సమంత



హన్సిక

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'లేడీస్ స్పెషల్' అంటూ కొత్త పోస్టర్స్‌తో ఇండస్ట్రీ కళకళలాడింది. ఆయా చిత్రబృందాలు వారి సినిమాల్లోని కథానాయికల పోస్టర్స్‌ను రిలీజ్ చేశాయి. ఆ పోస్టర్స్ పై ఓ లుక్ వేయండి.

ఫారిన్ అన్విత

ఫారిన్ వీధుల్లో ఎంచక్కా హ్యాపీగా వాక్ చేస్తున్నారు మిస్ అన్వితా రవళి శెట్టి. ఆమె సంతోషానికి గల కారణాలను వేసవిలో థియేటర్స్‌లో చూడాల్సిందే. అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం వేసవిలో రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రంలో చెఫ్ అన్విత రవళి పాత్రలో అనుష్క నటిస్తున్నారు. అన్విత కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

శకుంతల ప్రేమ

ప్రముఖ కవి కాళిదాసు రచించిన ప్రేమకావ్యం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా రూపొందిన చిత్రం 'శాకుంతలం'. ఇందులో శకుంతలగా సమంత, దుష్యంత మహారాజుగా మలయాళ నటుడు దేవ్ మోహన్ నటించారు. గుణశేఖర్ దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది. ఈ చిత్రంలోని సమంత కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అలాగే బుధవారం నుంచి సమంత 'ఖుషి' చిత్రం షూటింగ్‌లో పాల్గొంటున్నారు.

ప్రమాదానికి చేరువలో..

ఉమెన్స్ డే రోజున 'మ్యాన్' సినిమాను అనౌన్స్ చేశారు హన్సిక. క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. మద్రాస్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇగోర్ దర్శకత్వం వహిస్తున్నారు. ''వేటాడాలి. లేకపోతే మరొకరు మనల్ని వేటాడతారు. ఒక నిజానికి మనం దగ్గరవుతున్నామంటే అర్థం ప్రమాదానికి కూడా చేరువ అవుతున్నట్లే లెక్క'' అని ఈ సినిమా గురించి పేర్కొన్నారు హన్సిక.

మిస్ భైరవి

'రామబాణం' కోసం భైరవిలా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు డింపుల్ హయతి. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'రామబాణం'లో డింపుల్ హయతి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలోని ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, భైరవి పాత్రలో నటిస్తున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రం మే 5న విడుదల కానుంది.

గీత సాక్షిగా..

నిజ జీవిత ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'గీత సాక్షిగా'. లాయర్ పాత్రలో చిత్రా శుక్లా నటించిన ఈ చిత్రకథ మరో తార చరిష్మా చుట్టూ తిరుగుతుంది. ఆదర్శ్, చిత్రా శుక్లా జంటగా రూపొందిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో ఈ నెల 22న రిలీజ్ కానుంది. ఈ చిత్రం నుంచి చిత్రా శుక్లా లుక్‌ని రిలీజ్ చేశారు. ఆంథోని మట్టిపల్లి స్క్రీన్‌ప్లే రాసి, దర్శకత్వం వహించారు. చేతన్ రాజ్ కథ అందించి, నిర్మించారు.

ఇవే కాదు..

మహిళా దినోత్సవానికి మరికొందరు తారల కొత్త పోస్టర్స్ కూడా విడుదలయ్యాయి.



డింపుల్ హయతి · చిత్రా శుక్లా



రామ్ చరణ్

సీఈఓగా రామ్ చరణ్?

'సీఈఓ'గా కనిపిస్తారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'దిల్' రాజు, శిరీష్ ఓ సినిమా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా టైటిల్‌గా ఇప్పటికే 'అధికారి', 'సర్కారోడు' వంటి పేర్లు తెరపైకి రాగా తాజాగా 'సీఈఓ' తెరపైకి వచ్చింది. ఫైనల్ టైటిల్‌ను ఈ ఉగాదికి లేదా రామ్ చరణ్ బర్త్ డే (మార్చి 27)కి ప్రకటిస్తారని టాక్.

హాలీవుడ్‌కి... ఆస్కార్ బరిలో నిలిచిన 'నాటు నాటు' ప్రమోషన్స్‌లో భాగంగా 'ఆర్ఆర్ఆర్' టీమ్ అమెరికాలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హాలీవుడ్‌లో తన తొలి సినిమా గురించిన ప్రకటన త్వరలోనే వెల్లడి కానుందని రామ్ చరణ్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అలాగే తనకు ఎంతో ఇష్టమైన హాలీవుడ్ యాక్టర్స్‌లో ఒకరైన నటి జూలియా రాబర్ట్స్‌తో నటించాలని ఉందని, ఆమె సినిమాలో గెస్ట్ రోల్ అయినా ఇష్టమేనని రామ్ చరణ్ ఆ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

అవార్డులపై నమ్మకం పోయింది

- కళ్యాణీ మాలిక్



''ఓ సినిమా సంగీతం విషయంలో అధిక భాగం దర్శకుల పాత్ర ఉంటుంది. దర్శకుడి అభిరుచిని బట్టే సినిమా, సంగీతం ఉంటాయి. నా సంగీతం బాగుందంటే అందులో ఎక్కువ క్రెడిట్ నా దర్శకులకే ఇస్తాను'' అన్నారు సంగీత దర్శకుడు కళ్యాణీ మాలిక్. నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహించిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు కళ్యాణీ మాలిక్ మాట్లాడుతూ– ''2003లో నా తొలి సినిమా 'ఐతే' రిలీజైంది. ఈ 20 ఏళ్లలో 'ఫలానా అబ్బాయి..' నా 19వ సినిమా. సంవత్సరానికో సినిమా చేస్తున్నాను. ఈ ప్రయాణంలో నా సంగీతానికి ఎన్నో ప్రశంసలు దక్కాయి. ఆ విషయంలో సంతృప్తిగా ఉన్నాను. నా కెరీర్‌లో 'ఫలానా అబ్బాయి..' లోని 'కనుల చాటు మేఘమా..' ఉత్తమ పాట అని చెప్పగలను. ఈ పాటకు జాతీయ అవార్డు వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశాను. కానీ జాతీయ అవార్డులు ఎవరికి ఇస్తారో, అవి ఎలా వస్తాయో ఈ మధ్య ఓ ఫ్రెండ్ చెప్పాడు. దాంతో అవార్డులపై నమ్మకం పోయింది. నాకిప్పటి వరకూ ఒక్క అవార్డు కూడా రాలేదు. 'ఊహలు గుసగుసలాడే'లోని 'ఏం సందేహం లేదు..' పాటని నేను, సునీత పాడాం. సునీతకు అవార్డు వచ్చింది కానీ నాకు రాలేదు. అప్పటి నుంచి అవార్డుల గురించి పట్టించుకోవడం మానేశా. నా సినిమా, నా పాట నచ్చి ఎవరైనా నిర్మాత నాకు మరో చాన్స్ ఇస్తే అదే పెద్ద అవార్డుగా భావిస్తాను. మా అన్నయ్య (కీరవాణి) స్వరపరిచిన 'నాటు నాటు..' ఆస్కార్ బరిలో నిలవడం గర్వంగా ఉంది. ఇక నేను సంగీతం అందించిన 'ఇంటింటి రామాయణం', 'విద్య వాసుల అహం' చిత్రాలు రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి. రెండు వెబ్ సిరీస్‌లు చేస్తున్నా'' అన్నారు.

అందరూ కనెక్ట్ అవుతారు

- శివశంకర్ దేవ్



వాసంతి, అజయ్ శ్రీనివాస్, ఆది, శివశంకర్

''ఏడాదిన్నర క్రితం దర్శకుడు దేవ్ 'సీఎస్ఐ సనాతన్' కథ చెప్పినప్పుడు ఎగ్జయిట్ అయ్యాను. సాధారణ పౌరులకు కనెక్ట్ అయ్యే కథ ఇది'' అని ఆది సాయికుమార్ అన్నారు. శివశంకర్ దేవ్ దర్శకత్వంలో ఆది సాయికుమార్, మిషా నారంగ్ జంటగా నటించిన చిత్రం 'సీఎస్ఐ సనాతన్'. సునిత సమర్పణలో అజయ్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఆది మాట్లాడుతూ– ''మామూలుగా ఇలాంటి కథలు మలయాళంలో చూస్తుంటాం. తెలుగులో మా 'సీఎస్ఐ సనాతన్' మొదటిది అనుకుంటున్నాను'' అన్నారు. ''కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ కథ రాసుకున్నాను. ఇప్పటికే మన దేశంలో ఈ కథలోని ఘటనల్లాంటివి జరుగుతున్నాయి కాబట్టి ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది'' అన్నారు శివశంకర్ దేవ్.

ఓటింగ్ డన్



సూర్య

ఆస్కార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు సూర్య. ఈ నెల 12న లాస్ ఏంజిల్స్‌లో 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక జరగనుంది. విజేతల ఎంపిక కోసం పదివేల మందికి పైగా ఉన్న ఆస్కార్ ఓటర్స్ ఈ నెల 2 నుంచి 7వరకు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేశారు. ఇందులో భాగంగానే సూర్య కూడా ఓటు వేశారు. అకాడమీ 'క్లాస్ ఆఫ్ 2022'లో భాగంగా సూర్య ఆస్కార్ సభ్యునిగా ఎంపికైన సంగతి తెలిసిందే. అలాగే సూర్యతో పాటు నటి కాజోల్, డైరెక్టర్, స్క్రీన్ రైటర్ రీమా ఖగ్తీలు కూడా ఆస్కార్ మెంబర్స్ అయిన సంగతి గుర్తుండే ఉంటుంది.

ఓ పల్లెటూరి కథ



గౌతమ్

మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిన సమయంలో ఒక పల్లెటూరిలో జరిగిన కథతో రూపొందించిన హిస్టారికల్ మూవీ 'ఆగస్ట్ 16, 1947'. గౌతమ్ కార్తీక్, రేవతి జంటగా ఎన్.ఎస్. పొన్‌కుమార్ దర్శకత్వంలో దర్శకుడు ఏఆర్ మురుగదాస్, ఓం ప్రకాష్ భట్, నర్సీరామ్ చౌదరి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ, ఇంగ్లిష్ భాషల్లో ఏప్రిల్ 7న రిలీజ్ చేయనున్నట్లు బుధవారం చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''ప్రేక్షకులను ఈ సినిమా స్వాతంత్య్రం వచ్చిన రోజుల్లోకి తీసుకెళ్తుంది. మంచి అనుభూతినిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహనిర్మాత: ఆదిత్య జోషి.

ఫ్రెండ్ మారడు



ఇంద్ర

ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతీ శర్మ, ఇమ్రాన్, సీతల్ భట్ ముఖ్య పాత్రల్లో లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. యు. మేఘనాథ్, యం. లోకేష్ కుమార్ సమర్పణలో చంద్రాస్ చంద్ర, విజయ రమేష్ రెడ్డి నిర్మించారు. ఈ మూవీ మోషన్ పోస్టర్ లోగోను ఆంధ్రప్రదేశ్ అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, డైరెక్టర్ రాజు యాదవ్, నటి జయలక్ష్మి లాంచ్ చేశారు. ''ప్రతి మనిషీ ప్రేమకు ఎంత ప్రాధాన్యం ఇస్తాడో స్నేహానికి కూడా అంతే ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పే చిత్రమిది'' అన్నారు లక్ష్మణ్ జెల్ల.

స్వచ్ఛమైన హాస్యం



అభిషేక్

అభిషేక్ రెడ్డి పచ్చిపాలా, నాజియా జంటగా 'జబర్దస్త్' ఫణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. పూర్ణస్ యస్వంత్ దర్శకత్వంలో ఈట ప్రకాష్ ధర్మపురి నిర్మించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ''స్వచ్ఛమైన హాస్యంతో రూపొందిన చిత్రం ఇది. విడుదలైన మోషన్ పోస్టర్, యూట్యూబ్ షార్ట్స్ వైరల్ అవుతున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అమీర్, సంగీతం: ఓ. బాజి, సమర్పణ: కార్తీక్ ధర్మపురి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సూరి శ్రీ ఇనగంటి.

సాక్షి బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	124	60,224
నిఫ్టీ ▲	43	17,754

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,547	▲	17
డోజోన్స్	32,708	▼	148
ఎఫ్‌టీఎస్ఈ 100	7,930	▲	10
డాక్స్	15,632	▲	72
షాంఘై	3,283	▼	2
నికాయ్	28,444	▲	135

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	55,245
బంగారం (22 క్యారట్)	55,024
వెండి (కేజీ)	61,883

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.50	83.17
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	95.67	98.91
€	యూరో	ఎస్‌బీఐ	85.20	88.26
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.85	60.74
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.01	55.36
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.77	61.71
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.89	22.56
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.44	23.24
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.66	12.74

5జీని విస్తరిస్తున్న టెల్కోలు

331 ప్రాంతాల్లో జియో సర్వీసులు • 265 కేంద్రాల్లో ఎయిర్‌టెల్ సేవలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా టెలికం కంపెనీలు 5జీ సేవలను వేగంగా విస్తరిస్తున్నాయి. రిలయన్స్ జియో తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోసహా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 27 నగరాలు, పట్టణాల్లో నూతనంగా 5జీ సర్వీసులను జత చేసింది. దీంతో భారత్‌లో కంపెనీ మొత్తం 331 ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీని పరిచయం చేసినట్టు అయింది. జియో వెల్కమ్ ఆఫర్‌లో భాగంగా ఎటువంటి అదనపు ఖర్చు లేకుండానే కస్టమర్లు ప్రస్తుత చార్జీతో 1 జీబీపీఎస్ స్పీడ్‌తో అపరిమిత ఇంటర్నెట్‌ను ఆస్వాదించవచ్చు. 2023 చివరినాటికి దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లో 5జీ సర్వీసులను అందుబాటులోకి తేవాలన్నది రిలయన్స్ లక్ష్యం. సంస్థ అధినేత ముఖేష్ అంబానీ ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

భారతీ ఎయిర్‌టెల్ సైతం.. మరో టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ ఏకంగా 125 నగరాలు, పట్టణాల్లో కొత్తగా 5జీ సేవలను జోడించింది. దీంతో సంస్థ అందిస్తున్న 5జీ సర్వీసులు దేశంలో మొత్తం 265 ప్రాంతాలకు విస్తరించాయి. ఉత్తరాదిన జమ్మూ మొదలుకుని దక్షిణాదిన కన్యాకుమారి వరకు ప్రతి ప్రధాన నగరంలో నూతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్టు ఎయిర్‌టెల్ ప్రకటించింది. దేశంలోని అన్ని నగరాలు, పట్టణాలకు 5జీని వేగంగా చేర్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపింది. 2024 మార్చి నాటికి అన్ని పట్టణాలతో పాటు ప్రధాన గ్రామీణ ప్రాంతాల్లో అడుగుపెడతామని భారతీ ఎయిర్‌టెల్ సీటీవో రన్‌దీప్ సెఖన్ తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు లక్ష్యమని తెలిపారు.

నాట్కో షేర్ల బైబ్యాక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ కంపెనీ నాట్కో ఫార్మా 30 లక్షల షేర్లను బహిరంగ మార్కెట్లో బైబ్యాక్ చేయాలని బోర్డు నిర్ణయించింది. రూ.210 కోట్లు వెచ్చించి 1.64 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును గరిష్టంగా రూ.700 చెల్లించి బైబ్యాక్ చేయనున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు బుధవారం తెలిపింది. ప్రస్తుత మార్కెట్ ధర రూ.568 ఉంది. ఒకానొక దశలో బీఎస్ఈలో నాట్కో ఫార్మా షేరు గరిష్ట ధర రూ.580 తాకింది. క్రితం ముగింపుతో పోలిస్తే బుధవారం కంపెనీ షేరు ధర 0.33 శాతం ఎగసి రూ.568 వద్ద స్థిరపడింది.

విజయవాడలో వేగ జ్యువెలర్స్ కొత్త షోరూం



విజయవాడ: వజ్రాభరణాల రంగంలో రెండు దశాబ్దాలుగా కస్టమర్ల విశ్వాసాన్ని చూరగొన్న ''వేగ జ్యువెలర్స్'' భారీ విస్తరణ బాట పట్టింది. ఈ సందర్భంగా విజయవాడలోని నందమూరి రోడ్డులో ఏర్పాటు చేసిన కొత్త షోరూంను బుధవారం సినీ నటుడు బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కానుకగా రూ.2 లక్షల విలువైన నగల కొనుగోలుపై ఒక గ్రాము బంగారు నాణేన్ని సంస్థ ఉచితంగా అందిస్తోంది. పరిమిత కాలంగా ఉండే ఈ ఆఫర్‌ను కస్టమర్లు వినియోగించుకోవాలని డైరెక్టర్ వనమా నవీన్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ మరో డైరెక్టర్ వనమా సుధాకర్, సినీ ప్రముఖులు ప్రగ్నా జైస్వాల్, సంజన ఆనంద్‌లు పాల్గొన్నారు.

అదానీ గ్రూప్‌లో మరిన్ని పెట్టుబడులు

- అవకాశాల కోసం ఐదేళ్లుగా ఎదురుచూపు
- జీక్యూజీ పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ జైన్

సిడ్నీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ కంపెనీలలో మరిన్ని పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు జీక్యూజీ పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ జైన్ తాజాగా స్పష్టం చేశారు. భారత్‌లో 25 శాతం ఎయిర్ ట్రాఫిక్ అదానీ నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్టుల ద్వారానే నమోదవుతున్నట్లు జైన్ పేర్కొన్నారు. అంతేకాకుండా దేశీ సరుకు రవాణా(కార్గో)లో అదానీ గ్రూప్ పోర్టులు 25 నుంచి 40 శాతం పరిమాణాన్ని సాధిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి ఐదేళ్లుగా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు చేపట్టేందుకు వేచిచూస్తున్నట్లు విలేకర్ల సమావేశంలో జైన్ తెలియజేశారు. స్థానిక ఇన్వెస్టర్లతో జైన్ సమావేశమవుతున్నారు. అయితే షేర్ల ధరలు అందుబాటులో లేకపోవడంతో దీర్ఘకాలం వేచి చూసినట్లు వెల్లడించారు. కాగా.. ఇటీవల అదానీ గ్రూప్‌లోని 4 కంపెనీలలో అమెరికా ఈక్విటీ పెట్టుబడుల కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్ 1.87 బిలియన్ డాలర్లు(రూ. 15,446 కోట్లు) ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ బాటలో ఇకపైన కూడా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులను మరింత విస్తరించనున్నట్లు జైన్ స్పష్టం చేశారు. ఇటీవల సెకండరీ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్), అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్), అదానీ గ్రీన్ ఎనర్జీ(ఏజీఈఎల్), అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్(ఏటీఎల్)లకు చెందిన మైనారిటీ వాటాలను జీక్యూజీ పార్ట్‌నర్స్ కొనుగోలు చేసిన విషయం విదితమే.





అదానీ పవర్ అనుబంధ సంస్థల విలీనం

పూర్తిస్థాయి అనుబంధ సంస్థలు ఆరింటిని విలీనం చేసుకున్నట్లు అదానీ పవర్ లిమిటెడ్ తాజాగా వెల్లడించింది. వీటిలో అదానీ పవర్ మహారాష్ట్ర, అదానీ పవర్ రాజస్తాన్, ఉడుపి పవర్ కార్పొరేషన్, రాయ్‌పూర్ ఎనర్జెన్, రాయ్‌గఢ్ ఎనర్జీ జనరేషన్, అదానీ పవర్ ముంద్రా లిమిటెడ్ ఉన్నట్లు పేర్కొంది. గత నెల(ఫిబ్రవరి) 8న జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అహ్మదాబాద్ బెంచ్ ఇందుకు అనుమతించినట్లు తెలియజేసింది.

ఇన్వెస్టర్లకు అవగాహన పెంచాలి

నియంత్రణ సంస్థలకు అసోచామ్ వినతి



న్యూఢిల్లీ: మార్కెట్ల నియంత్రణ సంస్థలు రిటైల్ ఇన్వెస్టర్లకు ఎప్పటికప్పుడు తగిన సమాచారాన్ని అందించడంతోపాటు అవగాహనను పెంచే చర్యలు చేపట్టవలసి ఉన్నట్లు అసోచామ్- కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదికలో అసోచామ్ పేర్కొంది. రిటైలర్లు సెంటిమెంటుపై అధికంగా ఆధారపడతారని, దీంతో మార్కెట్ల ఆటుపోట్లపై తగిన అవగాహన పెంచవలసిన అవసరం ఉన్నదని పేర్కొంది. రిటైల్ లావాదేవీలతో మార్కెట్లలో లిక్విడిటీ పెరగడంతోపాటు, ఆర్డర్‌బుక్ బలపడుతుందని అభిప్రాయపడింది.

కనిష్టాల వద్ద కొనుగోళ్లు

- మూడోరోజూ ముందుకే
- స్వల్పలాభాలతో గట్టెక్కిన సూచీలు
- రాణించిన బ్యాంకింగ్, ఇంధన షేర్లు



ముంబై: కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు బుధవారం వరుసగా మూడవ రోజూ లాభాల బాటనే నడిచాయి. స్వల్ప లాభాలు ఆర్జించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూలతలు ఉన్నప్పటికీ.., అధిక వెయిటేజీ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన రంగాల షేర్లు రాణించడం కలిసొచ్చింది. ద్రవ్యోల్బణం పెరిగితే ముందస్తు వడ్డీరేట్ల పెంపు తప్పదనే ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యల నేపథ్యంలో సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 308 పాయింట్లు పతనమై 59,916 వద్ద, నిఫ్టీ 45 పాయింట్లు నష్టపోయి 17,666 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఒక దశలో సెన్సెక్స్ 379 పాయింట్లు క్షీణించి 59,845 వద్ద, నిఫ్టీ 109 పాయింట్లు పతనమై 17,602 ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. అయితే బేర్స్ షార్ట్ పొజిషన్లను కవర్ చేయడంతో పలు షేర్లు కనిష్టస్థాయి నుంచి కోలుకున్నాయి. చివర్లో కొనుగోళ్లు మరింత పెరగడంతో సెన్సెక్స్ 124 పాయింట్లు లాభపడి 60348 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు పెరిగి 17,754 వద్ద నిలిచింది. రియల్టీ, మెటల్, కన్జూమర్ డ్యూరబుల్, ఐటీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రుణ భారం తగ్గింపు చర్యలతో అదానీ గ్రూప్ షేర్లు లాభాల బాటన నడిచాయి.

క్రిప్టోలకు మనీలాండరింగ్ నిబంధనల వర్తింపు



న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీల్లాంటి వర్చువల్ అసెట్స్ నియంత్రణపై కేంద్రం మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా క్రిప్టోల ట్రేడింగ్, సంబంధిత ఆర్థిక సర్వీసులకు మనీలాండరింగ్ నిరోధక చట్టాలను వర్తింపచేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనితో దేశీ క్రిప్టో ఎక్స్ఛేంజీలు ఇకపై అనుమానాస్పద లావాదేవీలేవైనా గుర్తిస్తే ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఇండియా (ఎఫ్ఐయూ–ఐఎన్‌డీ)కి తెలియజేయాల్సి ఉంటుంది. ఎంతో కొంత విలువ కలిగి, క్రిప్టో పద్ధతుల్లో జనరేట్ చేసిన కోడ్ లేదా నంబరు లేదా టోకెన్‌లను వర్చువల్ డిజిటల్ అసెట్లుగా పరిగణిస్తారు.

సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా శేఖర్‌రెడ్డి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ చైర్మన్‌గా 2023–24 సంవత్సరానికిగాను సీఎస్ఆర్ ఎస్టేట్స్ సీఎండీ సి.శేఖర్ రెడ్డి నియమితులయ్యారు. రియల్టీ రంగంలో మూడు దశాబ్దాలకుపైగా అనుభవంతో విధాన రూపకల్పనలో రాష్ట్ర, కేంద్ర స్థాయిలో కీలకంగా ఉన్నారు. అలాగే సీఐఐ తెలంగాణ వైస్ చైర్మన్‌గా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఈడీ సాయి డి ప్రసాద్ ఎన్నికయ్యారు.

'ఫోర్స్' వైస్ ప్రెసిడెంట్‌గా వినయేంద్ర



హైదరాబాద్: ఫ్రైట్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ రిలేటెడ్ కార్గో ఎక్స్‌పర్ట్స్ (ఫోర్స్) వైస్ ప్రెసిడెంట్‌గా సీవేస్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ డైరెక్టర్ వినయేంద్ర పర్వతనేని (వినయ్) ఎంపికయ్యారు. ఈ హోదాకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుల్లో వినయ్ కూడా ఒకరు. అంతర్జాతీయంగా స్వతంత్ర రవాణా సేవల సంస్థలు అసోసియేషన్‌గా ఏర్పాటు చేసుకున్న ఫోర్స్‌లో ప్రతి దేశం నుంచి కేవలం ఒక్క సంస్థకే ప్రాతినిధ్యం లభిస్తుంది. గతంలో సీవేస్ గ్రూప్ ఎండీ కెప్టెన్ వీకే మోహన్ దీనికి ప్రెసిడెంట్‌గా విధులు నిర్వర్తించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-3-2023	
విశాఖ	425-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
8-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్

భారత వాయుసేన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలచేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి. **వయసు:**26.12.2002 నుంచి 26.06.2006 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫేజ్–1(ఆన్‌లైన్ రాతపరీక్ష), ఫేజ్–2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్–1, అడాప్టబిలిటీ టెస్ట్–2), ఫేజ్–3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 17.03.2023.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 31.03.2023.
» **ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభతేది:** 20.05.2023.
» **వెబ్‌సైట్:** www.agnipathvayu.cdac.in

నిమ్‌సెట్-2023

నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) లు.. ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(నిమ్‌సెట్)ను ఏటా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నిమ్‌సెట్‌ను నిట్, జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 813.
» **నిట్‌లలో సీట్ల వివరాలు:** అగర్తలా–30, అలహాబాద్–116, భోపాల్–115, జంషెడ్‌పూర్–115, కురుక్షేత్ర–96(వీటిలో 32 సెల్ఫ్ ఫైనాన్స్), రాయ్‌పూర్–110, సూరత్కల్–58, తిరుచురాపల్లి–115, వరంగల్–58.
» **అర్హత:** మ్యాథ్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ, బీసీఏ, బీఐటీ, బీ వొక్ (కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)ల్లో ఏదైనా కోర్సు చదివుండాలి లేదా ఏ బ్రాంచిలోనైనా బీటెక్/బీఈ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏ కోర్సు చదివినప్పటికీ కనీసం 60 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 55 శాతం) తప్పనిసరి. చివరి సంవత్సరం కోర్సుల్లో ఉన్నవారు అర్హులే.
» **తెలంగాణలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.
» **పరీక్ష తేది:** 11.05.2023.
» **ఫలితాల ప్రకటన తేది:** 16.06.2023.
» **వెబ్‌సైట్:** www.nimcet.in

ఉమ్మడి వ్యూహం.. విజయం ఖాయం!

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2, గ్రూప్-3.. తీవ్ర పోటీ నెలకొంది! వందల్లో ఉన్న ఈ పోస్టులకు.. లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి!! దాదాపు 80 శాతం మంది రెండు పరీక్షలకూ దరఖాస్తు చేసుకున్నట్లు అంచనా. ఇప్పటికే గ్రూప్-2 పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. మరి కొద్ది రోజుల్లో గ్రూప్-3 తేదీలపైనా స్పష్టత రానుంది. మరోవైపు ఈ రెండు పరీక్షలకు ఏక కాలంలో ప్రిపరేషన్ సాగించడం ఎలా.. అనే సందేహం అభ్యర్థులకు ఎదురవుతోంది! ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు ఉమ్మడి సన్నద్ధతపై ప్రత్యేక కథనం..

» గ్రూప్-2, 3లకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ
» ఒక్కో సర్వీసుకు అయిదు లక్షలకు పైగా దరఖాస్తులు
» దాదాపు 80 శాతం మంది రెండు సర్వీసులకు పోటీ
» ఆగస్ట్ 28, 29 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు
» గ్రూప్-3పై మరికొద్ది రోజుల్లో స్పష్టత
» ఉమ్మడి వ్యూహంతోనే సక్సెస్ అంటున్న నిపుణులు

- **గ్రూప్–2 సర్వీసులు:** మొత్తం పోస్టులు 783; దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 5,51,943. అంటే.. ఒక్కో పోస్ట్‌కు 705 మంది పోటీ!
- **గ్రూప్–3 సర్వీసులు:** మొత్తం పోస్టులు 1,375; దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 5,36,447. అంటే.. ఒక్కో పోస్ట్‌కు 390 మంది పోటీ!!
- ఈ రెండు గణాంకాలను చూస్తే.. గ్రూప్–2, గ్రూప్–3 పోస్టులకు పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కువ మంది అభ్యర్థులు గ్రూప్–2తోపాటు గ్రూప్3కి కూడా దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 80 శాతం మేరకు అభ్యర్థులు రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకుని ఉంటారని అంచనా వేస్తున్నారు. అయితే ఒకే సమయంలో రెండు పరీక్షలకు ప్రిపరేషన్ సాగించడంపైనే కొంత ఆందోళన నెలకొంది. రెండు పరీక్షల ప్యాట్రన్‌పై అవగాహన పెంచుకొని.. ఉమ్మడిగా ప్రిపరేషన్ సాగిస్తే.. విజయం సాధించొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

కామన్ సిలబస్.. కలిసొచ్చేలా

గ్రూప్–2, 3 అభ్యర్థులకు ప్రధానంగా కలిసొచ్చే అంశం.. ఈ రెండు సర్వీసుల పరీక్షలకు సంబంధించి సిలబస్ ఒకే రీతిలో ఉండడం. గ్రూప్–2 నాలుగు పేపర్లుగా, గ్రూప్–3 మూడు పేపర్లుగా నిర్వహించనున్నారు. రెండు పరీక్షల మధ్య తేడా ఏంటి? అంటే.. గ్రూప్–2లో 4 పేపర్లు ఉంటే.. గ్రూప్–3లో మూడు పేపర్లే ఉండడమే. గ్రూప్–2లో ప్రత్యేకంగా నాలుగో పేపర్‌గా తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం అనే అంశాలతో పరీక్ష ఉంటుంది. ఈ అంశాలను గ్రూప్–3లోని పేపర్–2, పేపర్–3 అంశాలతో సమ్మిళితం చేసుకునే అవకాశం ఉంది.

సరి పోల్చుకుంటూ

గ్రూప్–2, 3లకు ఉమ్మడి ప్రిపరేషన్ సాగించాలనుకునే అభ్యర్థులు రెండు సర్వీసులకు సంబంధించిన సిలబస్‌ను పరిశీలించాలి. ఆ తర్వాత రెండు పరీక్షల సిలబస్‌లోని అంశాలను సరిపోల్చుకుంటూ..ఒకే తరహాలో ఉన్న టాపిక్స్‌పై స్పష్టత తెచ్చుకోవాలి. కామన్ అంశాలను ఒకే సమయంలో చదివేలా.. వేర్వేరుగా ఉన్న అంశాలకు నిర్దిష్టంగా ప్రత్యేక సమయం కేటాయించేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. రెండింటిలోనూ ఒకే సిలబస్ అంశాలు ఉన్నాయి. కాబట్టి ప్రిపరేషన్ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదనేది నిపుణుల అభిప్రాయం.

సిలబస్‌కు సరితూగే పుస్తకాలు

ఉమ్మడి ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు సిలబస్‌కు సరితూగే ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సిలబస్‌కు సంబంధించిన అంశాలన్నీ ఉన్న పుస్తకాలను అన్వేషించి..వాటి ద్వారా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించి ప్రత్యేక దృష్టితో వ్యవహరించాలి. మార్కెట్లో ఈ అంశానికి సంబంధించి పదుల సంఖ్యలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సిలబస్‌కు అనుగుణంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అన్ని ముఖ్యమైన ఘట్టాలున్న ఒకట్రెండు పుస్తకాలను ఎంచుకోవడం మేలు చేస్తుంది. అదే విధంగా అకాడమీ పుస్తకాలను చదవడం కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

సిలబస్‌పై స్పష్టతతోపాటు, పుస్తకాలను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు..విశ్లేషణాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవానికి గ్రూప్–2, 3 రెండు పరీక్షలు పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి. కాని అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో డిస్క్రిప్టివ్ విధానంలో చదువుతూ.. ఆయా అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. అంతేకాకుండా ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి.

పూర్తిగా అర్థమయ్యేలా

అభ్యర్థులు ప్రిపరేషన్‌లో భాగంగా సమగ్ర అధ్యయనం కొనసాగించాలి. ఒక టాపిక్‌కు సంబంధించి నిర్వచనం మొదలు తాజా పరిణామాలకు వరకూ.. సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలి. అదే విధంగా నిర్దిష్టంగా ఒక టాపిక్‌ను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించే విధంగా చదవాలి. పరీక్షలో విజయం కోసం నిర్ణయాత్మక సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం పెంచుకోవాలి.

అనుసంధాన దృక్పథం

ప్రిపరేషన్ విషయంలో అభ్యర్థులు అనుసరించాల్సిన మరో వ్యూహం.. అనుసంధాన దృక్పథం. రెండు పరీక్షల్లోని ఉమ్మడి అంశాలను గుర్తించి.. వాటిని అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అన్ని అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. అభ్యర్థులు ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

ఏదీ వదలకుండా

జాతీయం నుంచి స్థానికం వరకూ.. పరీక్ష కోణంలో ఏ అంశాన్ని వదలకుండా చదవాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాలను ఔపోసన పట్టాలి. తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలిదశ ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం,వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటైన తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి.

సొంత నోట్స్

అభ్యర్థులు ఆయా విభాగాలను చదువుతున్నప్పుడే.. ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా నోట్స్ తయారు చేసుకోవాలి. అదే విధంగా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆయా వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటి గురించి తెలుసుకోవాలి. అప్పుడే సదరు టాపిక్‌పై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ప్రభుత్వ విధానాలు

జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విధానాలపై ప్రభుత్వ డాక్యుమెంట్లు ఉన్నాయి. వీటిపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలి. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు రూపొందించారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి.



తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణ ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న అంశాలపై పరీక్షలో కొన్ని ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి ముందుగా తెలంగాణ పాలసీలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా తెలంగాణ ఏర్పాటు,దానికి సంబంధించి ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు..నిధులు..నియామకాలు.. వంటి అంశాలపై ఎలాంటి విధానాలు తెచ్చారన్నది తెలుసుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు,గిరిజనులకు సంబంధించి రూపొందించిన పథకాల గురించి తెలుసుకోవాలి. పర్యావరణంపై తెలంగాణకు హరితహారం పాలసీ తెచ్చారు.

గ్రూప్-2.. పేపర్-4 ప్రత్యేకంగా

అభ్యర్థులు ప్రత్యేకంగా సమయం కేటాయించి నైపుణ్యం సాధించాల్సిన పేపర్.. గ్రూప్–2లోని నాలుగో పేపర్. 'తెలంగాణ ఆలోచన(1948–1970),ఉద్యమ దశ (1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991–2014)) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం–1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు.. జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు–వాటి సిఫార్సులు వంటి వాటిని అధ్యయనం చేయాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణ రాష్ట్రానికి కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

తెలంగాణపై ఫోకస్

తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీ పేరుతో ప్రత్యేకంగా ఉన్న అంశాలపై మరింత లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మార్కులు పెంచుకునే అవకాశం ఉంది. చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు–రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు–వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణలోని ముఖ్యమైన నదులు–పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం,జనాభా వంటి అంశాలపై అవగాహన అవసరం. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు –ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన పెంచుకోవాలి. తాజా బడ్జెట్ గణాంకాలు, ఆయా శాఖలు, పథకాలకు కేటాయింపులపై పట్టు సాధించాలి.

ప్రాక్టీస్ టెస్ట్‌లకు హాజరవడం

గ్రూప్–2, గ్రూప్–3 అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. దీనివల్ల ఆయా సబ్జెక్ట్‌లలో తమకు అప్పటి వరకు లభించిన పరిజ్ఞాన స్థాయిపై అవగాహన లభిస్తుంది. ఇంకా చదవాల్సిన అంశాల విషయంలో స్పష్టత వస్తుంది. అదే విధంగా తాము చేస్తున్న పొరపాట్లను విశ్లేషించుకుని.. వాటిని సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది.

నెల ముందు నుంచి రివిజన్

గ్రూప్–2, 3 సర్వీసుల ఉమ్మడి అభ్యర్థులు.. కేవలం ప్రిపరేషన్‌కే కాకుండా..పునశ్చరణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయా పరీక్ష తేదీలకు నెల రోజుల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌కు సమయం కేటాయించుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా.. ఉమ్మడి అంశాలను, ప్రత్యేక అంశాలను పరిశీలించుకుని.. పేపర్ వారీగా నిర్దిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తే ఒకే సమయంలో గ్రూప్–2, 3లకు సన్నద్ధత పొందే ఆస్కారం లభిస్తుంది.

గ్రూప్-2, గ్రూప్-3 ఉమ్మడి ప్రిపరేషన్ ముఖ్యాంశాలు

- దాదాపు ఒకే రీతిలో గ్రూప్–2, గ్రూప్–3 సిలబస్.
- గ్రూప్–2లో ప్రత్యేకంగా నాలుగో పేపర్.
- రెండు పరీక్షలకు ఒకే సమయంలో సన్నద్ధమయ్యే వీలు.
- సిలబస్ బేరీజు వేసుకుంటూ.. ప్రత్యేక అంశాలకు నిర్దిష్టం సమయంలో ప్రిపరేషన్.
- పరీక్షకు నెల రోజుల ముందు నుంచి రివిజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం.
- షార్ట్ నోట్స్, రెడీ రెకనర్స్‌తో రివిజన్ వేగంగా పూర్తి చేసుకునే అవకాశం

క్లుప్తంగా...

ఫార్మా, ఐటీలో హైదరాబాద్ టాప్: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఫార్మా, ఐటీ రంగాల్లో ప్రపంచంలోనే అతి పెద్ద ఎగుమతిదారుగా హైదరాబాద్ నిలుస్తోందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. బెర్లిన్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ టూరిజం అండ్ కల్చర్ ఎగ్జిబిషన్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా తయారు చేసిన కరోనా వ్యాక్సిన్ ప్రపంచం నలుమూలలకు అందించిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదని చెప్పారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్య సేవలను నామమాత్రపు ధరకు అందిస్తున్న నగరంగా హైదరాబాద్‌కు గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన పర్యాటక ప్రదేశాలున్నాయని వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగలు ఎంతో ప్రత్యేకమని వివరించారు. ఇంటర్నేషనల్ టూరిజం అండ్ కల్చర్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ టూరిజం స్టాల్ పర్యాటకులు, టూర్స్ అండ్ ట్రావెల్ ఆపరేటర్లను విశేషంగా ఆకర్షించిందని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బౌద్ధానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు.

యుద్ధప్రాతిపదికన గ్రామీణ రోడ్ల పనులు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ గ్రామీణ రోడ్ల నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేయాలని పీఆర్ ఆర్‌డీ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. దీనిపై సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా సమీక్షిస్తున్నందున ఇంజనీర్లు అత్యంత ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. ఆయన బుధవారం ఈఎన్‌సీ సంజీవరావుతో కలిసి పీఆర్ సీఈలు, ఎస్సీఈలు, ఈఈలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పనుల ప్రగతిని సమీక్షించారు. టెండర్లు పూర్తయిన పనులన్నీ నూరు శాతం ఈ వారంలోగా గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రౌండింగ్‌తో సరిపెట్టకుండా పనులన్నీ నిర్దేశిత కాల వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. బాగా పనిచేసే వారిని అభినందించడంతో పాటు.. పని చేయని వారిని ఉపేక్షించరాదని ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు స్పష్టం చేశారు. పనుల విషయంలో.. వెనుకబడిన జిల్లాల్లో పర్యటించి కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి త్వరగా పూర్తి చేయాలని ఈఎన్‌సీకి సూచించారు. 2021–22 సంవత్సరానికి సంబంధించి 'జీరో' గ్రౌండింగ్ ఉన్న జిల్లాల ఇంజనీర్ల సంజాయిషీ వెంటనే కోరాలని సూచించారు. 2021–22 సంవత్సరంలో 1,412 పనులు మంజూరు కాగా, 1,113 పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రగతిలో ఉన్నట్లు అధికారులు వివరించారు. 2022–23లో 1,597 పనులకు 1,082 పనులు ప్రగతిలో ఉన్నట్లు తెలిపారు.

పడాల రామారెడ్డి కన్నుమూత



శ్రీనగర్ కాలనీ: పడాల రామారెడ్డి కళాశాలల వ్యవస్థాపకుడు పడాల రామారెడ్డి (94) బుధవారం వయోభారంతో కన్నుమూశారు. పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించిన రామారెడ్డి న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్నారు. 1988లో అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలో మొట్ట మొదటి ప్రైవేట్ లా కళాశాలను పడాల రామారెడ్డి పేరిట నెలకొల్పారు. ఆయన హైకోర్టు లైబ్రేరియన్‌గా, జుడీషియల్ మేజిస్ట్రేట్‌గా కూడా పనిచేశారు. న్యాయశాస్త్రంపై ఉన్న పట్టుతో ఆయన సుమారు 120 లా పుస్తకాలను రచించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామారెడ్డి భౌతిక కాయాన్ని పంజగుట్ట ద్వారకాపురికాలనీలోని ఆయన స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆయన అంత్యక్రియలు గురువారం మహాప్రస్థానంలో నిర్వహించనున్నారు.

మహిళల కోసం 'సింగిల్ విండో'

- వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఎదిగేలా త్వరలో అమల్లోకి..
- వీ హబ్ వార్షికోత్సవంలో మంత్రి కేటీఆర్ వెల్లడి
- మహిళా సమానత్వం మన ఇళ్లనుంచే ప్రారంభం కావాలి
- నన్ను, మా చెల్లిని సమానంగా పెంచారు..మేం కూడా అలాగే చేస్తున్నాం



వీ హబ్ కార్యక్రమంలో చిన్నారిని అభినందిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఎదిగేందుకు కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం వారికి తగిన ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఇందుకోసం టీఎస్–ఐపాస్ తరహాలో త్వరలో ఓ 'సింగిల్ విండో'విధానం తీసుకురానున్నట్లు వెల్లడించారు. దీనిపై అధికారులు, మహిళా వ్యాపారవేత్తలతో చర్చిస్తున్నామని, త్వరలోనే పేరు పెట్టి అమల్లోకి తీసుకువస్తామని చెప్పారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వీ హబ్ 5వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలతో పలువురికి ఉపాధి కల్పిస్తున్న మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేటీఆర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

వీ హబ్ వేదికగా ఉన్నత స్థాయికి మహిళలు

రాష్ట్రాన్ని మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని మంత్రి చెప్పారు. మహిళలు ఏ రంగంలోనైనా అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. మహిళలను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల క్రితం వీహబ్‌ను ప్రారంభించామని, దాన్ని వేదికగా చేసుకుని ఎందరో మహిళలు ఉన్నతస్థాయికి చేరుకున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా 35,000 మందికి పైగా మహిళా ఉత్పాదకులను భాగస్వామ్యం చేయడంలో వీ హబ్ ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా.. స్వయం సహాయక సంఘాలకు స్త్రీ నిధి కింద వేల కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణాలుగా అందిస్తున్నామని చెప్పారు. తాజాగా రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాలు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

అమ్మాయి తక్కువ అనే భావన తగదు

'పిల్లలకు తల్లిదండ్రులు చిన్నప్పట్నుంచే విలువలు నేర్పించాలి. వారికి ఇష్టమైన చదువును చదివించాలి. తల్లిదండ్రుల వ్యవహారశైలి పిల్లలపై ప్రభావం చూపుతుంది. స్త్రీ, పురుషులకు ప్రతిభ సమానంగానే ఉంటుంది. కానీ కొందరు తెలిసీ తెలియక 'అమ్మాయి తక్కువ.. అబ్బాయి ఎక్కువ'అనే భావన నేర్పిస్తున్నారు. అలా వివక్ష చూపించకుండా ఇద్దర్నీ సమానంగా చూడటం మన ఇంటి నుంచే ప్రారంభిస్తే.. వారు కూడా ఇతర అమ్మాయిల్ని, అబ్బాయిల్ని సమానంగా, గౌరవంగా చూస్తారు. అప్పుడే అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించగలుగుతారు. మా ఇంట్లో నన్ను, నా చెల్లిని బాగా చదివించారు. నా చెల్లి యూఎస్ వెళ్తా అంటే నా కంటే ముందే పంపారు. మా పిల్లలను కూడా మేం సమానంగా చూస్తున్నాం. ఏం అవ్వాలనుకుంటే ఆ దిశగా ముందుకెళ్లాలని ప్రోత్సహిస్తున్నాం. పిల్లలకు ఆ నమ్మకం ఇవ్వగలిగితే అమ్మాయిలైనా, అబ్బాయిలైనా వంద శాతం అభివృద్ధి సాధిస్తారు. నా కూతురు 9వ తరగతి చదువుతోంది. తను మంచి ఆర్టిస్ట్ అవుతుంది అనుకుంటున్నాను. ఆమె ఏ రంగంలో ఉన్నా సరే మంచి మనిషిగా ఉండాలని కోరుకుంటున్నాను..'అని కేటీఆర్ అన్నారు.

'బాస్'కి భయపడాల్సిందే..

'మహిళలు ఎక్కువ నిబద్ధతతో ఫోకస్డ్‌గా, బాధ్యతాయుతంగా ఉంటారు. మమ్మల్ని తొక్కేస్తున్నారు కూడా. మేం బయటకి ఎంత నటించినా ఇంట్లో మహిళలే బాస్‌లు. ఎంత పెద్ద నేత అయినా ఇంటికి వెళ్లాక బాస్‌కి భయపడాల్సిందే..'అంటూ కేటీఆర్ చమత్కరించారు.

ఐదేళ్లలో 3,194 స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమలు

వ్యాపారాల నిర్వహణలో మహిళల భాగస్వామ్యం కీలకంగా మారిందని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు. మహిళలను వివిధ రంగాల్లో ప్రోత్సహించడంలో వీ హబ్ పాత్రను వివరించారు. వీహబ్ ద్వారా గత ఐదేళ్లలో 3,194 స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5,000 మంది మహిళా పారిశ్రామికవేత్తలు, 1,247 మంది విద్యార్థులు, 986 మంది సామాజికంగా ప్రభావశీలురైన పారిశ్రామికవేత్తలు, 609 మంది పట్టణ పారిశ్రామికవేత్తలతో వీ హబ్ విజయవంతంగా సాగుతోందని చెప్పారు. వివిధ రంగాల్లో మహిళలు ఎదిగిన తీరును వీ హబ్ సీఈవో దీప్తి రావుల వివరించారు. పలువురు మహిళలు తమ విజయానికి వీ హబ్ ఎలా తోడ్పడిందీ తెలిపారు.



వృద్ధాప్యం వయసుకే.. మెదడుకు కాదు

70 ఏళ్లకు పూర్తి స్థాయికి మేధో కార్యకలాపాలు

80- 90 వయసులో తక్కువ శక్తి వినియోగం.. గరిష్ట స్థాయిలో ఆలోచన

జార్జి వాషింగ్టన్ మెడికల్ స్కూల్ అధ్యయనంలో వెల్లడి

60+ 'సూపర్' బ్రెయిన్!

సాక్షి, అమరావతి: వృద్ధాప్యంలో వెంటాడే ఆరోగ్య సమస్యలతో పాటు మెదడు పనితీరు మందగించి జ్ఞాపక శక్తి క్షీణిస్తుందన్న వాదనల్లో నిజం లేదని అమెరికాలోని జార్జి వాషింగ్టన్ మెడికల్ స్కూల్ పరిశోధకులు చెబుతున్నారు. నిజానికి పెద్దల మెదడు ఎంతో ఆచరణాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటుందని, 60 ఏళ్లు దాటిన తర్వాత తీసుకునే నిర్ణయాలు చాలా సృజనాత్మకంగా ఉంటాయంటున్నారు. వీరి మెదడులో కుడి, ఎడమ హెమిస్ఫియర్స్ చాలా చురుగ్గా ఉండటంతో సృజనాత్మక ఆలోచనలు విస్తరిస్తున్నట్టు గుర్తించారు. చక్కటి జీవనశైలి, మానసికంగా చురుగ్గా ఉంటే మేధో సామర్థ్యాలు వయసుతో పాటు పెరుగుతాయే కానీ తగ్గవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 60 ఏళ్లు పైబడిన తర్వాత సృజనాత్మక కార్యకలాపాలను ప్రారంభించిన అనేక మందిపై ప్రయోగాలు నిర్వహించి ఈ ఫలితాలను రూపొందించారు.

చిన్నతనంలో ఏదైనా వస్తువు పాడు చేసినప్పుడు మెదడు విపరీతమైన ఒత్తిడికి లోనవుతుంది. యవ్వనంలో అదే పని చేసినప్పుడు కొంత కంగారు పడినా తక్కువ సమయంలోనే స్థిమితపడతారు. 60 ఏళ్లు దాటాక ఎలాంటి భావోద్వేగాలకైనా ఒకేలా స్థిరంగా స్పందిస్తారు. ఇక 70 ఏళ్ల వయసులో

నియంత్రణలో భావోద్వేగాలు..

మేధో కార్యకలాపాలు గరిష్ట స్థాయికి చేరినట్లు నిర్ధారించారు. ముదిమి వయసులో మెదడులోని మైలిన్ (న్యూరాన్ల మధ్య సంకేతాలను వేగంగా పంపుతుంది) పరిమాణం పెరుగుతుంది. దీంతో సగటు యువకులతో పోలిస్తే 60 ఏళ్లు దాటిన వారిలో మేధో సామర్థ్యాలు 300 శాతం పెరుగుతాయని పరిశోధకులు చెబుతున్నారు.

తొట్రుపాటు లేకుండా..

60 ఏళ్ల వయసు నుంచి వృద్ధులు నిర్ణయాలు తీసుకునేందుకు మెదడులోని రెండు హెమిస్ఫియర్స్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. '80–90 ఏళ్ల వయసులో ఒక వ్యక్తి మెదడు తక్కువ శక్తిని వినియోగించుకుని గరిష్ట స్థాయిలో ఆలోచిస్తుంది. అనవసరమైన విషయాలను వదిలేసి అవసరమైన వాటికే స్పందిస్తుంది'అని మాంట్రియల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మోంచి తెలిపారు. అధ్యయనంలో భాగంగా నిర్వహించిన వివిధ రకాల పరీక్షల్లో విజయం సాధించేందుకు యువకులు చాలా గందరగోళానికి గురవగా 60 ఏళ్లు పైబడినవారు ఎలాంటి తొట్రుపాటు లేకుండా సరైన నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. చికాగో నార్త్ వెస్టన్ యూనివర్సిటీలోని ఫీన్‌బర్గ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు వీరిని 'సూపర్ ఏజెర్స్'గా'అభివర్ణిస్తున్నారు. 80ల్లో ఉన్నవారు మేధోపరంగా చురుగ్గా ఉండేందుకు పెయింటింగ్, డ్యాన్స్, సంగీతం నేర్చుకోవడంతో పాటు స్నేహితులను కలుస్తూ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించు కోవడంలో ముందున్నారని, వారు అద్భుతాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాస్‌కాని పాలిటెక్నిక్ అభ్యర్థులకు మరో అవకాశం



సాక్షి, హైదరాబాద్: కొన్నేళ్లుగా పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 1990 నుంచి ఇప్పటి వరకు ఫెయిలైన వారికి ప్రత్యేక పరీక్ష నిర్వహించేందుకు అనుమతినిచ్చింది. ఇలాంటి వారికి ఈ ఏడాది జూన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని సాంకేతిక విద్యామండలి కార్యదర్శి డాక్టర్ సి.శ్రీనాథ్ తెలిపారు. పరీక్షలకు హాజరయ్యేందుకు రుసుము చెల్లింపు షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. అభ్యర్థులు రూ.3వేలు పరీక్ష ఫీజుగా, ఏప్రిల్ 10 వరకు చెల్లించవచ్చని తెలిపారు. రూ.400 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, తాత్కాల్ స్కీం కింద పరీక్ష రుసుముతో పాటు మరో రూ.6వేలు అదనంగా కలిపి ఏప్రిల్ 15 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ఇక ఇండస్ట్రియల్ అసెస్‌మెంట్ ఫీజుగా రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మూడేళ్ల వ్యవధి గల ఈ కోర్సును గరిష్టంగా 6 సంవత్సరాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత సిలబస్‌ను మార్చడంతో సప్లిమెంటరీ పరీక్షలు రాసుకునే అవకాశం లభించడం లేదు. కొన్నిసార్లు మానవతా దృక్పథంతో ప్రభుత్వం ప్రత్యేక అనుమతినిస్తుంది. ఇలా ఈసారి 1990 నుంచి 2018 వరకు అభ్యర్థులు ఫెయిలైన సబ్జెక్టులకు పరీక్షలు రాసుకునే అవకాశాన్నిచ్చారు. వీరికి మూడు సబ్జెక్టుల నుంచి మినహాయింపునిచ్చారు.

ఇంటర్ ఆన్‌స్క్రీన్ మూల్యాంకన టెండర్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ సమాధాన పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకన ప్రక్రియపై త్వరలో బోర్డ్ స్పష్టతకు రానుంది. దీనికోసం ఇప్పటికే టెండర్లు పిలిచిన ఇంటర్ బోర్డ్, వచ్చిన వాటిని పరిశీలిస్తోంది. బిడ్డింగ్‌కు రెండు కంపెనీలు టెండర్లు వేసినట్టు సమాచారం. వీటిల్లో అన్ని విధాల అర్హత, సామర్థ్యం ఉన్న వాటినే ఎంపిక చేయాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియపై బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం అధికారులతో కలిసి చర్చించారు. ప్రశ్నపత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం అత్యంత కీలకమైంది కావడంతో, అన్ని అర్హతలను, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. టెండర్‌లో పాల్గొన్న కంపెనీల ట్రాక్ రికార్డును పరిశీలించాలని మిత్తల్ ఆదేశించారు.

కఠిన విధుల్లోనూ మహిళల రాణింపు

సాక్షి, హైదరాబాద్: క్షేత్ర స్థాయిలో సవాళ్లతో కూడిన అటవీ సంరక్షణ వంటి విధుల్లోనూ మహిళలు రాణించటం గొప్ప విషయమని పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ కొనియాడారు. అరణ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటిని చక్కదిద్దటంతో పాటు, ఉద్యోగాల్లో రాణించటం మహిళలకున్న ఓర్పు, ప్రావీణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన ఉద్యోగినులకు ఈ సందర్భంగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు పాల్గొన్నారు.

'ముందు' ప్రవేశిస్తే మూడినట్లే!

- ప్రైవేట్ బస్సులపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక నజర్
- నిర్దేశించిన సమయానికి ముందే సిటీలోకి ఎంట్రీ
- ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలు అతిక్రమిస్తూ, నిర్ణీత సమయానికి ముందే నగరంలోని దూసుకు వచ్చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై సిటీ ట్రాఫిక్ విభాగం అధికారులు దృష్టి పెట్టారు. వీటివల్ల సాధారణ ప్రజలు, వాహన చోదకులకు ఏర్పడుతున్న ఇబ్బందులను తీవ్రంగా పరిగణించారు. ఈ బస్సుల్ని నియంత్రించడం కోసం సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. గడచిన మూడు రోజుల్లో 375 బస్సులపై కేసులు నమోదు చేశామని, ఈ విధానం కొనసాగిస్తామని సిటీ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు 'సాక్షి'కి తెలిపారు.

పీక్ అవర్స్‌లో నగరం మీదుగా...

నగరం నుంచి రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాలకు ప్రైవేట్ బస్సులు వేల సంఖ్యలో ఉన్నాయి. ఉత్తరాదితో పాటు ఇతర రాష్ట్రాల్లోని సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సినవి మధ్యాహ్నం, మిగిలినవి రాత్రి వేళల్లో బయలుదేరి వెళ్తుంటాయి. వీటిలో అత్యధికం సిటీలోని ఓ మూల నుంచి మరో మూల వరకు ప్రయాణించి సరిహద్దులు దాటుతాయి. పీక్ అవర్స్‌గా పిలిచే రద్దీ వేళల్లోనే వీటి ప్రయాణం ఉంటుంది. గతంలో వీటి విషయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎప్పుడు పడితే అప్పుడు రోడ్లపై పరుగులెత్తేవి. నగరం విస్తరించడం, వాహనాల సంఖ్య పెరగడంతో ఈ సమస్యను గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు కొన్నేళ్ల క్రితమే చర్యలు తీసుకున్నారు. రాత్రి 10 గంటల లోపు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సిటీలోకి రాకుండా నిబంధనలు రూపొందించారు.

ప్రత్యేక బస్టాపులు లేకపోవడంతో...

కొన్ని రోజులుగా ఈ నిబంధనలు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పట్టించుకోవట్లేదు. దీంతో చిత్రవిచిత్రమైన హారన్లు మోగిస్తూ రాత్రి 10 గంటల కంటే ముందే సిటీలోకి వస్తున్నాయి. ఈ బస్సుల కోసమంటూ ప్రత్యేకంగా బస్టాప్‌లు లేవు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లు, ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బుకింగ్ పాయింట్స్‌తో పాటు రోడ్డు పక్కనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటాయి. ఈ కారణంగా వల్ల నగరంలో ధ్వని కాలుష్యం, ట్రాఫిక్ జామ్స్ ఏర్పడటంతో పాటు పాదచారుల, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా ఈ విషయాన్ని గమనిస్తున్న ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రైవేట్ బస్సులు విషయంలో సమయపాలన నిబంధన కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించారు.

ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రైవ్.

ఈ అంశంపై స్పందించిన ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్ బాబు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్స్ చేయిస్తున్నారు. ఆయా సమయాల్లో కూడళ్లతో పాటు కీలక ప్రాంతాల్లో కాపుకాసి ఉంటున్న ఈ సిబ్బంది రాత్రి 10 గంటల్లోపు సిటీలోకి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేస్తున్నాయి. ఈ భారీ బస్సులు, వాటి హారన్ల వల్ల ఇబ్బందులే కాదు ప్రమాదాలకు ఆస్కారం ఉందని ట్రాఫిక్ అధికారులు భావిస్తున్నారు. ఈ కారణంగానే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించిన సమయానికి ముందు వీటిని సిటీలోకి రానీయకూడదని నిర్ణయించి ఈ స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగించనున్నారు. ఈ బస్సులు ఎక్కువగా సంచరించే మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటున్నారు.

స్పీడ్‌గా స్పందించారా..
అయితే డౌటే

- నకిలీ బ్యాంక్ గ్యారెంటీల గ్యాంగ్ చిక్కింది ఇలా
- ఇండస్‌ఇండ్ బ్యాంక్ పేరుతో హర్షిత కంపెనీకి బోగస్ గ్యారంటీలు
- సరి చూసేందుకు ఈ–మెయిల్ ఇచ్చిన మున్సిపల్ శాఖ
- ఐదు నిమిషాల్లోనే సమాధానం రావడంతో అనుమానం
- రీజనల్ కార్యాలయాన్ని సంప్రదించడంతో దందా వెలుగులోకి
- అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ రంగంతో పాటు బ్యాంకింగ్ సెక్టార్‌లోనూ కొన్ని అంశాల్లో తీవ్ర జాప్యం ఉంటుంది. ప్రధానంగా ఉత్తరప్రత్యుత్తరాలకు రోజులు, వారాలే కాదు అవసరమైతే నెలలు కూడా వేచి చూడాలి. అయితే ఓ బ్యాంక్ గ్యారెంటీ అంశానికి సంబంధించి బ్యాంక్‌కు ఈ–మెయిల్ పంపిన ఐదు నిమిషాల్లోనే జవాబు వచ్చేస్తే..? అలాంటి సత్వర స్పందనపై రాష్ట్ర ప్రభుత్వ అధికారికి వచ్చిన సందేశంతోనే నకిలీ బ్యాంక్ గ్యారెంటీల స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ఇటీవల నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.45 కోట్ల విలువైన బోగస్ బ్యాంక్ గ్యారెంటీ లేఖలు స్వాధీనం చేసుకున్నారు.

కోల్‌కతాలో 'కుటీర పరిశ్రమగా' ఈ దందా...

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని అనేక ప్రాంతాలు నకిలీ బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు తయారు చేయడానికి అడ్డాలుగా ఉన్నాయి. చిన్న చిన్న కార్యాలయాలతో పాటు గదుల్లోనూ కుటీర పరిశ్రమగా, వ్యవస్థీకృతంగా ఈ దందా నడుస్తుంటుంది. వీరికి దేశ వ్యాప్తంగా ఏజెంట్లు ఉంటారు. వరంగల్‌కు చెందిన ఏజెంట్ నాగరాజు వారిలో ఒకడు. చెన్నైకి చెందిన హర్షిత ఇంజనీరింగ్ కంపెనీ రాష్ట్రంలో కొన్ని కాంట్రాక్టులు దక్కించుకుంది. వీటి కోసం హర్షిత సంస్థ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాల్సి వచ్చింది. వాటిని ఏర్పాటు చేస్తానంటూ ఈ కంపెనీ ఎండీని కలిసిన నాగరాజు కమీషన్ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. కంపెనీ నుంచి దాదాపు రూ.47 లక్షలు కమీషన్‌గా తీసుకున్న ఇతగాడు నకిలీ బ్యాంక్ గ్యారెంటీ లెటర్లు అందించాడు.

పక్కాగా తయారు చేసిన కోల్‌కతా గ్యాంగ్...

ఏజెంట్‌గా వ్యవహరించిన నాగరాజుకు కొన్నేళ్ళ క్రితం రాజస్థాన్‌కు చెందిన నరేష్ వర్మ ద్వారా కోల్‌కతా వాసులు నీలోట్‌పాల్ దాస్, సుబ్రజిత్ గోశాల్‌లతో పరిచయమైంది. ఈ నలుగురూ కలసి గతంలో అనేక బ్యాంకులకు సంబంధించిన బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు వివిధ కంపెనీలకు అందించారు. కాగా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ పేరుతో తమకు అందినవి నకిలీవని తెలియని హర్షిత సంస్థ వాటిని అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు దాఖలు చేసి పనులు కూడా పొందింది. నకిలీ బ్యాంకు గ్యారెంటీ పత్రాలు తయారు చేయడంలో నీలోట్, సుబ్రజిత్‌లు దిట్టలు కావడంతో వీటిపై ఎవరికీ అనుమానం రాలేదు. కాంట్రాక్టర్లు, కాంట్రాక్టులు పొందిన సంస్థల నుంచి ఈ బ్యాంకు గ్యారెంటీ పత్రాలు పొందే ప్రభుత్వ విభాగాలు సాధారణంగా క్రాస్ చెక్ చేయవు. అయితే కొన్ని సందర్భాల్లో ఆ బ్యాంక్‌ను సంప్రదించి సందేహం నివృత్తి చేసుకుంటాయి.

ఐదు నిమిషాల్లోనే సమాధానం రావడంతో...

ఈ ఉత్తరప్రత్యుత్తరాలు ఈ–మెయిల్ ద్వారా జరుగుతాయి. సదరు బ్యాంక్ గ్యారెంటీ లేఖలోనే ఈ మెయిల్ ఐడీ కూడా ఉంటుంది. ఈ విషయం తెలిసిన కోల్‌కతా ద్వయం దీనికోసం ప్రత్యేకంగా కొన్ని ఈ–మెయిల్ ఐడీలు కూడా రూపొందించింది. వీటిలో ఆయా బ్యాంకుల పేర్లు ఉండేలా, వాటిని చూసిన అధికారులు నిజమైనవిగానే భావించేలా జాగ్రత్తపడింది. హర్షిత సంస్థ ద్వారా అందుకున్న బ్యాంక్ గ్యారెంటీలను సరిచూడాలని భావించిన అర్బన్ డెవలప్‌మెంట్ విభాగాధినేత అందులో ఉన్న ఈ–మెయిల్‌కి మెసేజ్ పంపించారు. దీన్ని అందుకున్న సుబ్రజిత్ గోశాల్ బ్యాంకు అధికారి మాదిరిగానే కేవలం ఐదు నిమిషాల్లోనే సమాధానంగా మెయిల్ పంపిస్తూ... అవి నిజమైనవేనని స్పష్టం చేశా డు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఇంత త్వర గా సమాధానం రావడంతో షాక్‌కు గురైన అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు అనుమానించారు.

రీజనల్ కార్యాలయాన్ని సంప్రదించడంతో...

కోల్‌కతాలోని బ్రాంచ్ నుంచి వచ్చిన జవాబుతో పాటు బ్యాంకు గ్యారెంటీ పత్రాలను మరోసారి సరిచూడాలని భావించారు. దీంతో వీటిని ముంబైలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ రీజనల్ కార్యాలయానికి ఈ–మెయిల్ ద్వారా పంపించారు. వీటిని చూసిన అక్కడి అధికారుల షాక్‌కు గురయ్యారు. ఈ బ్యాంకు గ్యారెంటీ పత్రాల్లో పేర్కొన్న ప్రాంతంలో తమకు అసలు శాఖే లేదని స్పష్టం చేశారు. తమకు ఈ–మెయిల్ ఐడీలు కూడా ఉండవని పేర్కొన్నారు.

నవీన్ హత్యలో సూత్రధారి ఎవరు?

యువతి పాత్రపై పోలీసులు ఆరా

- నేటితో ముగియనున్న హరిహరకృష్ణ కస్టడీ
- ఆ తర్వాత నిహారికనూ కస్టడీలోకి తీసుకోవాలని పోలీసుల నిర్ణయం


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇంజనీరింగ్ విద్యార్థి నేనావత్ నవీన్ (22) హత్య కేసులో అసలు సూత్రధారి ఎవరనేది కనిపెట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మృతదేహాన్ని ముక్కలు చేయాలనేంత కక్ష, శరీర భాగాలను కాల్చిపాడేయాలనే కిరాతక ఆలోచన ఎవరిదనేది తేల్చేపనిలో పోలీసులు ముందుకు వెళ్తున్నారు. నవీన్ హత్య విషయం నిందితుడు పేరాల హరిహరకృష్ణ చెప్పే వరకూ యువతి కట్టా నిహారిక (ఏ–3)కు తెలియదని పోలీసులు ప్రాథమికంగా తెలుపుతున్నప్పటికీ.. ఆమె పాత్రపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గత నెల 17న అబ్దుల్లాపూర్‌మెట్ శివారు ప్రాంతంలో నవీన్‌ను హరిహరకృష్ణ కిరాతకంగా హత్య చేసి, 24న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ప్రేమించిన యువతి దూరమవుతుందనే కక్షతోనే నవీన్‌ను హరిహర హత్య చేసి ఉంటే.. హత్య అనంతరం మృతుడి తల, మొండం, పెదాలు, చేతివేళ్లు, మర్మాంగాలను కోసి, ఆయా భయానక ఫొటోలను యువతికి పంపించాల్సిన అవసరం ఏముందనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ఆయా ఫొటోలు నిజమేనా? కాదా? అని ధ్రువీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 20వ తేదీన నిందితుడు హరితో కలిసి యువతి సంఘటనా స్థలానికి వెళ్లడంపై కూడా పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే నిందితులు డిలీట్ చేసిన సెల్‌ఫోన్ డేటాను రికవరీ చేసేందుకు పోలీసులు వారి సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్‌కు పంపించారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో నిహారిక, హసన్‌ను పోలీసులు ఈ నెల 6న అరెస్టు చేసిన సంగతి తెలుసుకున్న నిందితుడు హరి..బుధవారం కస్టడీ విచారణలో ఆమె యోగ క్షేమాలు పోలీసులను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. హరికి న్యాయస్థానం అనుమతిచ్చిన ఏడు రోజుల పోలీసు కస్టడీ నేటితో ముగియనుంది. ఈ కేసులో యువతి పాత్రను లోతుగా దర్యాప్తు చేసేందుకు నిహారికను కూడా పోలీసు కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది.

వర్సిటీ విద్యార్థులను ప్రశ్నించిన పోలీసులు

ఇదిలా ఉండగా..నవీన్ చదివే మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నవీన్ తోటి విద్యార్థులు, స్నేహితులను రాచకొండ పోలీసులు విచారించారు. గత నెల 17న హైదరాబాద్‌లో ఉంటున్న ఇంటర్మీడియట్ ఫ్రెండ్ హరిహరకృష్ణను కలిసేందుకు వెళ్తున్నానని చెప్పి నవీన్ వెళ్లాడని స్నేహితులు పోలీసులకు వివరించినట్లు తెలిసింది. తిరిగి రాకపోటంతో హరికి ఫోన్ చేయగా ప్రశ్నించగా.. నవీన్ తనను కలిశాడని, యువతి విషయంపై గొడవ జరిగిందని హ రి తెల్పినట్లు పేర్కొన్నారని తెలిసింది. గంజాయి కా వాలంటూ అబ్దుల్లాపూర్‌మెట్ వైపు వెళ్లాడని త ప్పు డు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

పక్కాగా 'పోలీస్' పరీక్షలు

- యూనిఫాం సర్వీసెస్ పోస్టుల తుది రాత పరీక్షకు సర్వం సన్నద్ధం
- బయోమెట్రిక్ విధానంలో అభ్యర్థుల హాజరు నమోదు
- 11న ఐటీ, కమ్యూనికేషన్ ఎస్సై పరీక్షలతో ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో కీలకమైన తుది రాత పరీక్షల నిర్వహణకు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) పక్కాగా ఏర్పాట్లు చేస్తోంది. అవకతవకలకు తావులేకుండా పూర్తిస్థాయిలో సాంకేతికతను వినియోగిస్తోంది. పోలీస్ శాఖతోపాటు ఎక్సైజ్, రవాణా శాఖల్లోని వివిధ విభాగాల్లో కలిపి మొత్తం 17,516 పోస్టుల భర్తీకి తుది రాత పరీక్షను నిర్వహిస్తున్నారు. అన్ని పోస్టులకు కలిపి దేహదారుఢ్య పరీక్షలకు 2,07,106 మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 1,11,209 మంది తుది రాత పరీక్షలకు ఎంపికయ్యారు. మార్చి 11న తుది రాత పరీక్షలు మొదలుకానున్నాయి. ఆ రోజు ఐటీ, కమ్యూనికేషన్స్ ఎస్ఐ, ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్ఐ పోస్టులకు పరీక్ష జరగనుండగా, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మార్చి 26న పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై తుది రాత పరీక్ష, ఏప్రిల్ 2న కానిస్టేబుల్ మెకానిక్, డ్రైవర్ పోస్టులకు, ఏప్రిల్ 8, 9 తేదీల్లో సివిల్ ఎస్సై పోస్టులకు, ఏప్రిల్ 30న సివిల్ కానిస్టేబుల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు పరీక్షలు జరగనున్నాయి.

హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లోనూ: అభ్యర్థుల సంఖ్య ఆధారంగా రాత పరీక్షలకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ ఎస్సై, ఫింగర్‌ప్రింట్ ఏఎస్సై, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై, కానిస్టేబుల్, మెకానిక్‌వంటి పోస్టుల అభ్యర్థులకు హైదరాబాద్‌లోనే కేంద్రాలు ఏర్పాటు చేశారు. సివిల్ ఎస్సైలకు హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలో నిర్వహించనున్నారు. కానిస్టేబుల్ తుది రాత పరీక్షలు హైదరాబాద్‌తోపా టు పది ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నారు.

పూర్తిస్థాయిలో సాంకేతికత..

పోలీస్ నియామక ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేసేందుకు టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు సాంకేతికతను జోడిస్తున్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతీ అభ్యర్థి అటెండెన్స్‌ను బయోమెట్రిక్ విధానంలోనే తీసుకుంటున్నారు. దేహదారుఢ్య పరీక్షల సందర్భంగా తీసిన బయోమెట్రిక్ హాజరుకు, తుది రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థి బయోమెట్రిక్‌కు సరిపోలితేనే పరీక్షకు అనుమతించనున్నారు. దీంతో ఒకరి బదులుగా మరొకరు పరీక్షకు హాజరు కాకుండా కట్టడి చేసేందుకు అవకాశముంటుంది. పూర్తి ప్రక్రియను సీసీటీవీల ద్వారా రికార్డు చేస్తున్నారు. దేహదారుఢ్య పరీక్షల్లోనూ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ చిప్స్, రిస్ట్‌బ్యాండ్‌లు, డిజిటల్‌హైట్ మీటర్లను వినియోగించిన విషయం తెలిసిందే. కాగా, ప్రతీ విభాగంలో పోటీ తీవ్రంగా ఉండటంతో అభ్యర్థులు గంటల తరబడి పుస్తకాలతో కుస్తీపడుతూ పరీక్షకు సన్నద్ధమవుతున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.